ప్రకటనల కోసం
సంప్రదించండి
98483 28698

తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక
Estd : 2002
# జనంసాక్షి
www.janamsakshi.org
RNI NO.TELTEL / 2013 /50370
గురువారం 29.01.2026 | సంపుటి : 12 సంచిక : 190 | పేజీలు : 12 వెల : రూ. 4/-
హైదరాబాద్ Simultaneously Published from Hyderabad & Karimnagar ఎడిటర్ : ఎం.ఎం. రహమాన్




అందరికీ అందుబాటులోకి


## కొత్త ఆధార్ యాప్



**న్యూఢిల్లీ(జనంసాక్షి):** కేంద్ర ప్రభుత్వం సరికొత్త ఆధార్ యాప్‌ను లాంచ్ చేసింది. దేశ డిజిటల్ ప్రజా మౌలిక సదుపాయాలను బలోపేతం చేసే లక్ష్యంతో దీనిని తీసుకొచ్చింది. ఈ కొత్త యాప్‌తో ఆధార్ సర్వీసులు మరింత సరళంగా, సురక్షితంగా, యూజర్ ఫ్రెండ్లీగా మారనున్నాయి. బుధవారం దిల్లీలో డాక్టర్.అంబేద్కర్ ఇంటర్నేషనల్ సెంటర్‌లో జరిగిన కార్యక్రమంలో కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్ ఈ యాప్‌ను జాతికి

మిగతా 2లో..

## బంగారం మరింత ప్రియం



ఏకంగా రూ.8వేలు పెరిగిన పుత్తడి

**న్యూఢిల్లీ(జనంసాక్షి):** అంతర్జాతీయంగా నెలకొన్న అనిశ్చితుల వేళ మదుపర్లు బంగారాన్ని సురక్షిత పెట్టుబడి సాధనంగా భావిస్తున్నారు. ఈ నేపథ్యంలో

మిగతా 2లో..

విమానప్రమాదంలో మహారాష్ట్ర డిప్యూటీ సీఎం

# అజిత్ పవార్ దుర్మరణం



ఆయనతోపాటు ఇద్దరు పైలెట్లు, మరో ఇద్దరు సహాయకులు కూడా మృతి



ఎమర్జెన్సీ ల్యాండింగ్‌కు ప్రయత్నించి బండరాయిని ఢీకొట్టడంతో ఘటన

- ఎన్నికల ప్రచారం నిమిత్తం ముంబయి నుంచి బారామతి వెళ్తుండగా ఘటన
- ఆయన అకాల మరణం తీరని లోటు
- రాష్ట్రంలో మూడు రోజుల పాటు సంతాప దినాలు
- మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడణవీస్ ప్రకటన
- ఘటనపై ప్రధాని మోదీ, రాష్ట్రపతి ముర్ము దిగ్భ్రాంతి
- కాంగ్రెస్ సీనియర్ నాయకుడు రాహుల్, సీఎం రేవంత్ సంతాపం

**ముంబై(జనంసాక్షి):** మహారాష్ట్రలో విషాదం చోటుచేసుకుంది. విమాన ప్రమాదంలో ఉప ముఖ్యమంత్రి అజిత్ పవార్ దుర్మరణం చెందారు. బుధవారం ఉదయం ఆయన ప్రయాణిస్తున్న విమానం బారామతిలో కుప్పకూలింది ఈ దుర్ఘటనలో పవార్ (66)తో పాటు మరో నలుగురు ప్రాణాలు కోల్పోయారు. జిల్లా పరిషత్ ఎన్నికల ప్రచారం నిమిత్తం ముంబయి నుంచి బారామతి వెళ్తుండగా ఉదయం 8.45 గంటల ప్రాంతంలో ఈ ఘటన చోటు చేసుకుంది. సాంకేతిక లోపం కారణంగానే ఈ ఘటన చోటుచేసుకున్నట్లు తెలుస్తోంది. ముంబయి నుంచి బయల్దేరిన గంట తర్వాత విమానంలో సమస్య తలెత్తింది. ఎమర్జెన్సీ

మిగతా 2లో..

అజిత్ విమాన ప్రమాదంలో

### కుట్ర కోణం

సుప్రీం పర్యవేక్షణలో దర్యాప్తు జరగాలి: సీఎం మమతా బెనర్జీ

అది ప్రమాదమే.. రాజకీయం చేయొద్దు

శరద్ పవార్

2లో..



## ఫిబ్రవరి 3 నుంచి సీఎం రేవంత్ ఎన్నికల ప్రచారం




**హైదరాబాద్(జనంసాక్షి):** తెలంగాణలో మున్సిపల్ ఎన్నికలకు నోటిఫికేషన్ వచ్చేసింది. ఈ క్రమంలో సీఎం రేవంత్ రెడ్డి ఎన్నికల ప్రచారం కోసం ఫిబ్రవరి 3 నుంచి రాష్ట్రం లో పర్యటించనున్నారు. ప్రస్తుతం అమెరికాలో ఉన్న ఆయన.. నెలాఖరుకు స్వదేశా నికి తిరిగి వస్తారు. ఫిబ్రవరి 3న నల్గొండ జిల్లా మిర్యాలగూడ, 4న కరీంనగర్ జిల్లా జగిత్యాల, 5న రంగారెడ్డి జిల్లా చేవెళ్ల, 6న భూపాలపల్లి, 7న మెదక్, 8న నిజామాబాద్‌లో సీఎం పర్యటిస్తారు

మిగతా 2లో..

## వికసిత్ భారత్ వైపు దేశం పయనిస్తోంది

- పదేళ్లలో పేదల కోసం 4కోట్ల ఇళ్ల నిర్మాణం
- జల్ జీవన్ మిషన్ ద్వారా గ్రామాలకు తాగునీరు
- వందేభారత్, అమృత్ భారత్ రైళ్ల ద్వారా సేవలు
- ఆయుష్మాన్ భారత్‌తో కోట్లమందికి వైద్యం
- వరిధాన్యం ఉత్పత్తిలో ప్రపంచంలో నంబర్ వన్
- అక్వా, పాల ఉత్పత్తుల్లో భారత్ ముందంజ
- జీఎస్టీ తగ్గింపుతో పెరిగిన కొనుగోలు శక్తి
- పవర్ టెక్నాలజీ హబ్‌గా రూపొందుతున్న భారత్
- గ్రీన్ ఎనర్జీ రంగంలో పవర్ హౌస్‌గా భారత్
- ఉభయ సభలను ఉద్దేశించి రాష్ట్రపతి ప్రసంగం



**న్యూఢిల్లీ(జనంసాక్షి):** దేశం వికసిత్ భారత్ వైపు పయనిస్తోందని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చెప్పారు. పేదల అభ్యున్నతికి ప్రభుత్వం కట్టుబడి ఉందని, గత పదేళ్లలో పేదల కోసం 4కోట్ల ఇళ్లు కట్టించామని, జల్ జీవన్ మిషన్ ద్వారా గ్రామాలకు తాగునీరు అందిస్తున్నామని రాష్ట్రపతి తెలిపారు. 'పదేళ్లలో 25కోట్ల మందిని పేదరికం నుంచి బయటకు తీసుకొచ్చాం. సామాజిక న్యాయం ప్రాతిపదికన కేంద్రం పనిచేస్తోందన్నారు. పార్లమెంట్ బడ్జెట్ సమావేశాల తొలి రోజైన బుధవారం రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఉభయసభల్ని ఉద్దేశించి ప్రసంగించారు. ఈ సందర్భంగా రాష్ట్రపతి ప్రసంగిస్తూ...వందేభారత్, అమృత్ భారత్ రైళ్ల ద్వారా సేవలు విస్తరించాం. ప్రతి పౌరుడికి జీవిత బీమా కల్పించడం ప్రభుత్వ లక్ష్యం. ఆయుష్మాన్ భారత్‌తో కోట్లమందికి వైద్యసేవలందిస్తున్నాం. వరి ఉత్పత్తిలో ప్రపంచంలోనే భారత్ నెం1 స్థానంలో నిలిచింది. అక్వా, పాల ఉత్పత్తుల్లో భారత్ ముందంజలో

మిగతా 2లో..

## మున్సిపల్ ఎన్నికల్లోనూ సత్తా చాటుతాం

- పార్టీ పనితీరు, గెలుపు అవకాశాలు లక్ష్యంగా అభ్యర్థుల ఎంపిక
- ముఖ్యమంత్రి లేనప్పుడు మంత్రులు నన్ను కలవడంలో తప్పులేదు
- దీనిపై అసత్య కథనాలు రాయడం సరికాదు : డిప్యూటీ సీఎం భట్టి



**ఖమ్మం(జనంసాక్షి):** మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థుల ఎంపిక అనేది కేవలం ఒకరిద్దరి నిర్ణయం కాకూడదని, అత్యంత పారదర్శకంగా , సమిష్టిగా సాగాలని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. ఆయా మున్సిపాలిటీల బాధ్యతలు చూస్తున్న మంత్రులు, ఎమ్మెల్యేలు, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు , సీనియర్ నాయకులు అందరూ కలిసి చర్చించి, ఏకాభిప్రాయంతో అభ్యర్థులను ఖరారు చేయాలని సూచించారు. ఖమ్మం జిల్లాలో మీడియాతో మాట్లాడిన భట్టి.. కాంగ్రెస్ ఎమ్మెల్యేలు అందరూ మున్సిపల్ ఎన్నికలను సీరియస్‌గా తీసుకొని పార్టీ నేతలను సమన్వయం చేసుకుంటూ ముందుకెళ్లాలని సూచించారు. అభ్యర్థుల ఎంపికలో అందరినీ కలుపుకుని పోవడం వల్ల పార్టీలో అంతర్గత విభేదాలు రాకుండా ఉంటాయని, ఇది ఎన్నికల్లో పార్టీ విజయావకాశాలను మెరుగుపరుస్తుందని ఆయన అభిప్రాయపడ్డారు. ముఖ్యంగా పార్టీ మండల , పట్టణ స్థాయి నాయకులతో నిరంతరం సమన్వయం చేసుకుంటూ ఈ ప్రక్రియను విజయవంతం చేయాలని శాసనసభ్యులకు దిశానిర్దేశం చేశారు. అభ్యర్థుల ఎంపికకు సంబంధించి భట్టి

మిగతా 2లో..

## మున్సిపల్ ఎన్నికల్లో తెలంగాణ జాగృతి పోటీ

ఏఐఎఫ్‌బీ పార్టీ సింహం గుర్తుపై..

ప్రకటించిన ఏఐఎఫ్‌బి తెలంగాణ చైర్మన్ జావెద్ లతీఫ్

**హైదరాబాద్ (జనంసాక్షి) :** మున్సిపల్ ఎన్నికల్లో ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ సింహం గుర్తుపై తెలంగాణ జాగృతి అభ్యర్థులు పోటీ చేయనున్నారు. ఈ మేరకు తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత సమక్షంలో ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ తెలంగాణ రాష్ట్ర చైర్మన్ జావెద్ లతీఫ్, ఉపాధ్యక్షులు కె.బుచ్చిరెడ్డి ప్రకటించారు. తెలంగాణ జాగృతి, ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ నేతల చర్చలు చర్చించారు.

మిగతా 2లో..





## హైదరాబాద్ వేదికగా అఖిలభారత పోలీస్ ఫుట్‌బాల్ సమరం

- మార్చిలో నిర్వహణ
- ఏర్పాట్లపై బి శివధర్ రెడ్డి సమీక్ష

**హైదరాబాద్(జనంసాక్షి):** జనవరి 28:74వ బి.ఎన్. మల్లిక్ మెమోరియల్ ఆల్ ఇండియా పోలీస్ ఫుట్ బాల్ ఛాంపియన్ షిప్ ను ప్రతిష్టాత్మకంగా నిర్వహించనున్నామని తెలంగాణ రాష్ట్ర డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ బి శివధర్ రెడ్డి వెల్లడించారు. డిజిపి కార్యాలయంలో బుధవారం జరిగిన సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సమావేశంలో డిజిపి బి.శివధర్ రెడ్డి మాట్లాడుతూ...తెలంగాణ రాష్ట్రంలో గతంలో చక్కని ఫుట్ బాల్ క్రీడాకారులు ఉండేవారని, 1956వ సంవత్సరంలో జరిగిన మెల్బోర్న్ ఒలింపిక్స్ లో సెమీఫైనల్ చేరిన భారత ఫుట్ బాల్ జట్టులో తెలంగాణ ప్రాంతానికి చెందిన ఏడుగురు క్రీడాకారులు నూర్ మొహమ్మద్, జుల్ఫీకరుద్దీన్, అహ్మద్ హుసేన్, అజీజుద్దీన్, బలరాం, తంగరాజ్, వంటివారు పాల్గొన్నారన్నారు. వీరిలో అయిదుగురు హైదరాబాద్ సిటీ పోలీస్ వారు. ఆ జట్టు కోచ్ సయ్యద్ అబ్దుల్ రహీమ్ కూడా హైదరాబాదీయే. కాలక్రమేనా పోలీసు ఉద్యోగుల్లో ఫుట్ బాల్ క్రీడ పట్ల ఆసక్తి సన్నగిల్లిందని అభిప్రాయపడ్డారు. 74 వ బీ.ఎన్.మల్లిక్ అఖిల భారత ఫుట్ బాల్ ఛాంపియన్ షిప్ పోటీలు నిర్వహించే అవకాశం ఈ సంవత్సరం తెలంగాణ రాష్ట్ర పోలీస్ శాఖకు వచ్చిందన్నారు. ఛాంపియన్ షిప్ పోటీల పనులను వేగవంతంగా పూర్తి చేయాల్సి ఉందన్నారు. తెలంగాణ పోలీస్ శాఖ ఆతిథ్యమిస్తున్న ఈ మెగా టోర్నీ ఈ ఏడాది మార్చి 23 నుంచి ఏప్రిల్ 5వ తేదీ వరకు హైదరాబాదులో నిర్వహించనున్నామన్నారు. దేశవ్యాప్తంగా ఉన్న 28 రాష్ట్రాలు, 8 కేంద్ర పాలిత ప్రాంతాలు, 11 కేంద్ర సాయుధ పోలీస్ బలగాలు, 6 కేంద్ర పోలీస్ సంస్థల నుంచి

మిగతా 2లో..

## రాష్ట్రంలో మరో కుంభకోణం

ఎక్సైజ్ శాఖలో మైక్రో బేవరేజెస్‌కు అనుమతుల్లో అవినీతి:హరీశ్‌రావు

**హైదరాబాద్(జనంసాక్షి):** రాష్ట్రంలో మరో అవినీతి కుంభకోణాన్ని బయటపెడుతున్నట్లు మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత హరీశ్ రావు తెలిపారు. ఎక్సైజ్ శాఖలో కొత్తగా మైక్రో బేవరేజెస్‌కు అనుమతులు ఇస్తున్నారని విమర్శించారు. "110 దరఖాస్తుల్లో 25కు అనుమతి ఇవ్వాలని నిర్ణయించారు. కొత్త అనుమతుల్లో ముఖ్య నేత కోటా 21, మంత్రి కోటా 4" అని హరీశ్ ఆరోపించారు.





## నేడు సారలమ్మ ఆగమనం

- మేడారం జాతరలో జనసందడి
- భారీగా ఏర్పాట్లు చేసిన ప్రభుత్వం

**ములుగు(జనంసాక్షి):** ఆసియా ఖండంలోనే అతిపెద్ద గిరిజన జాతరగా, తెలంగాణ కుంభమేళాగా పేరుగాంచిన మేడారం సమ్మక్క – సారలమ్మ మహా జాతర మొదలయ్యింది. లక్షలాది మంది భక్తులు తరలివస్తున్నారు. జాతరలో కీలక ఘట్టం ఆవిష్కృతం కానుంది. సాయంత్రం కన్నెపల్లి నుంచి సారలమ్మ అమ్మవారు మేడారం గద్దెపైకి రానున్నారు. కన్నెపల్లిలోని సారలమ్మ మందిరంలో కోయ పూజారులు ప్రత్యేక పూజలు

మిగతా 2లో..

అనర్హతపై వేగం పెంచిన స్పీకర్

## దానంకు నోటీసులు

రేపు స్పీకర్ కార్యాలయంలో హాజరు కావాలని ఆదేశం

**హైదరాబాద్(జనంసాక్షి):** తెలంగాణ రాజకీయాల్లో ఎమ్మెల్యేల అనర్హత పిటిషన్ల అంశంపై సుప్రీంకోర్టు సీరియస్ కావడంతో.. అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ వేగం పెంచారు. ఇందుకు సంబంధించి తాజాగా ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్‌కు స్పీకర్ నోటీసులు జారీ చేశారు. ప్రస్తుతం ఈ విషయం రాష్ట్ర రాజకీయాల్లో హాట్ టాపిక్‌గా మారింది. ఈ నెల 30వ తేదీన ఉదయం స్పీకర్ కార్యాలయంలో హాజరు కావాలని దానం నాగేందర్‌ను ఆదేశించారు. అదేవిధంగా ఫిర్యాదు చేసిన బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డికి కూడా నోటీసులు అందాయి. ఇందులో భాగంగా ఉదయం 10:30 గంటలకు బీఆర్ఎస్ ఇచ్చిన ఫిర్యాదుపై విచారణ జరగనుండగా..

మిగతా 2లో..



### నేను బీఆర్ఎస్‌కు రాజీనామా చేయలేదు

నాపై అనర్హత పిటిషన్‌కు కొట్టేయండి

అఫిడవిట్‌లో స్పీకర్‌కు వివరించిన దానం నాగేందర్

2లో..

## ఈయూతో ట్రేడ్ డీల్ వల్ల భారత్‌కే ఎక్కువ లాభం

అమెరికా వాణిజ్య ప్రతినిధి జేమిసన్ గ్రీర్

**వాషింగ్టన్(జనంసాక్షి):** భారత్– ఐరోపా సమాఖ్యల మధ్య స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం కుదిరిన సంగతి తెలిసిందే. దీనిపై అమెరికా వాణిజ్య ప్రతినిధి జేమిసన్ గ్రీర్ మాట్లాడుతూ కీలక వ్యాఖ్యలు చేశారు. ఈ ఒప్పందం భారత్‌కే ఎక్కువ అనుకూలంగా ఉందని అన్నారు. ఓ ఇంటర్వ్యూలో గ్రీర్ మాట్లాడుతూ.. 'ఈ ఒప్పందానికి సంబంధించి కొన్ని వివరాలు నేను పరిశీలించా. దీనిలో భారతదేశం పైచేయిగా నిలుస్తుందని భావిస్తున్నా. ఐరోపా మార్కెట్‌లో భారత ఉత్పత్తులకు ఎక్కువ అవకాశాలు ఉన్నాయి' అని పేర్కొన్నారు. భారతీయ నిపుణులకు ఐరోపా దేశాల్లో ఎక్కువ అవకాశాలు లభిస్తాయన్నారు. ఈ సందర్భంగా అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ దేశీయ ఉత్పత్తులకు ఎక్కువగా ప్రాధాన్యం ఇస్తున్నారన్నారు. దేశంలోకి దిగుమతయ్యే వస్తువులపై టారిఫ్‌లు విధిస్తుండటంతో..

మిగతా 2లో..

## ఇరాన్ దిశగా మరిన్ని యుద్ధనౌకలు

వాటిని వినియోగించే అవసరం రాకూడదని ఆశిస్తున్నా : ట్రంప్



**వాషింగ్టన్(జనంసాక్షి):** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇరాన్‌కు మరోసారి హెచ్చరికలు చేశారు మరిన్ని యుద్ధనౌకలు ఆ దేశం దిశగా కదులుతున్నాయని పేర్కొన్నారు. వాటిని వినియోగించే అవసరం రాకూడదని తాను ఆశిస్తున్నట్లు తెలిపారు. ఇప్పటికే యూఎస్‌కు చెందిన విమాన వాహకనౌక యూఎస్ఎస్ అబ్రహం లింకన్ పశ్చిమాసియాకు చేరుకొన్న సంగతి తెలిసిందే. ఈ క్రమంలో మరిన్ని యుద్ధనౌకల గురించి ట్రంప్ చేసిన వ్యాఖ్యలు ఉద్రిక్తతలను మరింత పెంచాయి. 'ప్రస్తుతం మరో అందమైన యుద్ధనౌక ఇరాన్ వైపు ప్రయాణిస్తోంది. వారు ఒక ఒప్పందం చేసుకుంటారని ఆశిస్తున్నాం. ఇప్పటికే వారు దాన్ని చేసుకోవాల్సి ఉంది. అయితే అందుకు వారు సిద్ధంగా ఉన్నారని నాకు తెలుసు. వాళ్లు నాకు చాలాసార్లు ఫోన్ చేశారు' అని ట్రంప్ అన్నారు. అదనపు వైమానిక రక్షణ వ్యవస్థలను ఈ ప్రాంతానికి

మిగతా 9లో..

## ఫిబ్రవరి 3 నుంచి సీఎం రేవంత్ ఎన్నికల ప్రచారం

మరోవైపు రాష్ట్రవ్యాప్తంగా తొలి రోజు 890 మంది అభ్యర్థుల నుంచి 902 నామినేషన్లు దాఖలయ్యాయి. వీరిలో 382 మంది కాంగ్రెస్ అభ్యర్థులు, 258 మంది బీఆర్ఎస్ అభ్యర్థులు, 169 మంది భాజపా అభ్యర్థులు ఉన్నారు.

## హైదరాబాద్ వేదికగా అఖిలభారత పోలీస్ ఫుట్ బాల్ సమరం

మొత్తం 53 జట్లు ఈ క్రీడా సమరంలో పాల్గొంటాయని డిజిపి తెలిపారు. సుమారు 1060 మంది పురుష క్రీడాకారులు, 350 మంది మహిళా క్రీడాకారులు, కోచ్‌లు, రిఫరీలు మరియు ఇతర అధికారులతో కలిపి మొత్తం 2000 మందికి పైగా ప్రతినిధులు ఈ వేడుకలో భాగస్వాములు కాబోతున్నారన్నారు. మొత్తం 12 రోజుల పాటు సాగే ఈ ఛాంపియన్‌షిప్‌లో 125 మ్యాచ్‌లను నిర్వహించేందుకు ప్రణాళికలు సిద్ధం చేశామని, గచ్చిబౌలిలోని జీఎంసీ బాలయోగి స్టేడియం, అజీజ్ నగర్‌లోని ఎచ్‌ఎఫ్‌సి గ్రౌండ్, మోయినాబాద్‌లోని శ్రీనిధి ఫుట్‌బాల్ క్లబ్ మైదానాలతో పాటు మరికొన్ని ప్రధాన మైదానాల్లో ఈ పోటీలు జరగనున్నాయన్నారు. ఈ మెగా ఈవెంట్ నిర్వహణకు తాను చైర్మన్ గాను, సైబరాబాద్ సిపి డాక్టర్ ఎం. రమేష్ ఆర్గనైజింగ్ సెక్రటరీగా , అడ్మినిస్ట్రేషన్ కమిటీలో ఐపిఎస్ అధికారులు అభిలాషా బిస్త్, అనిల్ కుమార్, సంజయ్ కుమార్ జైన్, వి.సి. సజ్జనార్, అవినాష్ మహంతి, గజరావు భూపాల్ వంటి సీనియర్ అధికారులు వివిధ బాధ్యతలను నిర్వహిస్తారన్నారు. మార్చి 23న జట్ల రిపోర్టింగ్ తో ప్రారంభమయ్యే ఈ క్రీడల షెడ్యూల్‌లో భాగంగా మార్చి 25న మధ్యాహ్నం 3 గంటలకు అధికారికంగా ఆరంభ వేడుకలు జరగనున్నాయని, ఏప్రిల్ 5న తుది పోరు అనంతరం అదే రోజు మధ్యాహ్నం 3 గంటలకు ముగింపు వేడుకలు నిర్వహిస్తామని తెలిపారు. ఈ టోర్నీ కోసం తెలంగాణ పోలీస్ అకాడమిలో క్రీడాకారులందరికీ వసతి సౌకర్యాలు కల్పించడమే కాకుండా, జట్ల రాకపోకల కోసం 45 ప్రత్యేక బస్సులు మరియు అధికారుల కోసం ఇతర వాహనాలను సిద్ధం చేస్తామని, క్రీడాకారుల ఆరోగ్య భద్రత దృష్ట్యా ప్రతి గ్రౌండ్ వద్ద ఒక అంబులెన్స్ తో పాటు వైద్య బృందం నిరంతరం అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకుంటామన్నారు. సాంకేతికపరంగా ఈ టోర్నీని పారదర్శకంగా నిర్వహించేందుకు ఆలిండియా పోలీస్ స్పోర్ట్స్ కంట్రోల్ బోర్డ్ నుండి 40 మంది ప్రతినిధులు మరియు రిఫరీలు హాజరవుతున్నారనీ, మ్యాచ్‌ల సమయంలో తలెత్తే వివాదాల పరిష్కారానికి జ్యూరీ ఆఫ్ అప్పీల్స్ కమిటీని కూడా ఏర్పాటు చేశామన్నారు. ఈ క్రీడా పోటీలకు సంబంధించి ఫిబ్రవరి 5వ తేదీ నుంచే ప్రత్యేక కంట్రోల్ రూమ్ అందుబాటులోకి వస్తుందని, అఖిల భారత స్థాయి పోటీలు రాష్ట్ర ప్రతిష్టను చాటిచెప్పేలా నిర్వహించేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయని డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ బి శివధర్ రెడ్డి వెల్లడించారు. అడిషనల్ డిజిపి అనిల్ కుమార్, మల్కాజ్గిరి పోలీస్ కమిషనర్ అవినాష్ మహంతి, సైబరాబాద్ పోలీస్ కమిషనర్ డాక్టర్ ఎం. రమేష్, స్పోర్ట్స్ ఐజిపి డాక్టర్ గజరావు భూపాల్, హైదరాబాద్ శాంతిభద్రతల అడిషనల్ సిపి తఫ్సీర్ ఇక్బాల్, జాయింట్ సిపి ఎన్.శ్వేత, విజిలెన్స్ డిఐజి అభిషేక్ మహంతి, యూసఫ్ గూడా బెటాలియన్ కమాండెంట్ మురళీకృష్ణ తదితరులు సమావేశంలో పాల్గొన్నారు.

## అనర్హతపై వేగం పెంచిన స్పీకర్

మధ్యాహ్నం 12:00 గంటలకు బీజేపీ ఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి ఇచ్చిన ఫిర్యాదుపై విచారణ జరగనుంది. ఎమ్మెల్యేల అనర్హత అంశంలో జాప్యం జరుగుతోందని భావించిన సుప్రీంకోర్టు ఈ నెల 19న స్పీకర్‌కు కోర్టు ధిక్కరణ నోటీసులు జారీ చేసింది. చర్యలు తీసుకోకపోతే కఠినంగా వ్యవహరిస్తామని హెచ్చరించిన నేపథ్యంలో, స్పీకర్ పెండింగ్‌లో ఉన్న ముగ్గురు ఎమ్మెల్యేలుదానం నాగేందర్, కడియం శ్రీహరి, డాక్టర్ సంజయ్ అంశాన్ని పరిశీలిస్తున్నారు. ఇప్పటికే అరికపూడి గాంధీ సహా మరో ఏడుగురికి 'క్లీన్ చిట్' లభించిన సంగతి తెలిసిందే. అయితే మిగిలిన ఎమ్మెల్యేలతో పోలిస్తే దానం నాగేందర్ కేసు భిన్నమైనది. ఆయన బీఆర్ఎస్ ఎమ్మెల్యేగా ఉంటూనే 2024 పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ బి-ఫామ్‌పై ఎంపీగా పోటీ చేశారు. ఇది స్పష్టమైన ఫిరాయింపు కిందకు వస్తుందని.. అందుకే ఆయనపై అనర్హత వేటు పడే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని సమాచారం. ఒకవేళ స్పీకర్ అనర్హత వేటు వేస్తే, దానం తన ఎమ్మెల్యే పదవిని కోల్పోతారు. మరోవైపు స్పీకర్ నిర్ణయం తీసుకోకముందే.. దానం నాగేందర్ తన పదవికి రాజీనామా చేసి ఉప ఎన్నికలకు వెళ్తారనే ప్రచారం కూడా గట్టిగా సాగుతోంది. మొత్తానికి 30వ తేదీన జరిగే విచారణ తెలంగాణ రాజకీయాల్లో పెను మార్పులకు దారితీసేలా కనిపిస్తోంది.

## నేను బీఆర్ఎస్‌కు రాజీనామా చేయలేదు

హైదరాబాద్(జనంసాక్షి): తెలంగాణలో బీఆర్ఎస్ ఫిరాయింపు ఎమ్మెల్యే వ్యవహారంలో కొత్త పరిణామాలు చోటుచేసుకున్నాయి. ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్‌పై బీఆర్ఎస్ దాఖలు చేసిన అనర్హత పిటిషన్‌పై, ఆయన స్పీకర్ కు వినతిపత్రం అందజేశారు. పార్టీ ఫిరాయింపులకు పాల్పడ్డారన్న ఆరోపణలను దానం నాగేందర్ ఘాటుగా ఖండిస్తూ, ఆ పిటిషన్‌ను కొట్టి వేయాలని స్పీకర్‌ను కోరారు. అఫిడవిట్‌లో దానం నాగేందర్ తాను బీఆర్ఎస్ పార్టీకి రాజీనామా చేయలేదని, అలాగే పార్టీ తనను సస్పెండ్ చేసినట్లు సమాచారమూ అధికారికంగా తనకు అందలేదని స్పష్టం చేశారు. మార్చి 2024లో జరిగిన కాంగ్రెస్ సమావేశానికి హాజరైన విషయాన్ని అంగీకరించినప్పటికీ, అది పూర్తిగా వ్యక్తిగత హోదాలో జరిగినదేనని చెప్పారు. ఒక పార్టీ సమావేశానికి వ్యక్తిగతంగా హాజరవడమే ఫిరాయింపుగా పరిగణించడాన్ని ఆయన తప్పుబట్టారు. మీడియా కథనాల ఆధారంగా తాను పార్టీ మారినట్లు బీఆర్ఎస్ భావించడం అనుచితమని, ఆ నిర్ధారణకు చట్టపరమైన ఆధారాలు లేవని చెప్పారు. అనర్హత పిటిషన్ రాజకీయ ప్రయోజనాల కోసం దాఖలు చేయబడిందని వాదించిన దానం నాగేందర్, పిటిషన్‌లో బలం లేదని, అందువల్ల దానిని కొట్టి వేయాలని స్పీకర్ కోర్టును కోరుతూ తన అఫిడవిట్‌ను ముగించారు.

## దేశానికే రోల్‌మోడల్‌గా డిజాస్టర్ మేనేజిమెంట్

మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

హైదరాబాద్(జనంసాక్షి):ప్రకృతి విపత్తులను సమర్ధవంతంగా ఎదుర్కొని వీలైనంతవరకూ ప్రాణ నష్టం, ఆస్తి నష్టం జరగకుండా రాష్ట్రంలో ప్రకృతి విపత్తుల నిర్వహణా సంస్థ విభాగాన్ని బలోపేతం చేసి దేశానికి ఒక రోల్ మోడల్‌గా ఉండేలా తీర్చిదిద్దుతున్నామని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు. ఎటువంటి విపత్తులనైనా ఎదుర్కొనేలా వంద కోట్ల రూపాయిలతో అత్యాధునిక పరికరాలను కొనుగోలు చేయాలని నిర్ణయించినట్లు వెల్లడించారు. ఇందుకు సంబంధించి బుధవారం నాడు సచివాలయంలోని తన కార్యాలయంలో విపత్తుల నిర్వహణా విభాగం, ÷ర్ సర్వీసెస్, ఎస్‌డిఆర్‌ఎఫ్, హైడ్రా, ఐ సిసిసి విభాగాలతో సమావేశం నిర్వహించి ఎలాంటి పరికరాలను కొనుగోలు చేయాలన్న విషయంపై సుదీర్ఘంగా చర్చించారు. వరదలు, అగ్నిప్రమాదాలు వంటి అత్యవసర పరిస్థితుల్లో త్వరితగతిన స్పందించడానికి ఖచ్చితమైన సమాచార వ్యవస్థ, రియల్‌టైమ్ మానిటరింగ్ సాధ్యమ య్యేలా విపత్తు ముందస్తు హెచ్చరిక వ్యవస్థలు, డ్రోన్లు, శాటిలైట్ ఆధారిత కమ్యూనికేషన్, ఆధునిక రెస్క్యూ పరికరాలు, అత్యాధునిక ÷ర్ / సెర్చ్ ఆపరేషన్ల సాంకేతికతను రెవెన్యూ?విపత్తు నిర్వహణ విభాగాలకు అందుబాటులోకి తెస్తామని మంత్రి వెల్లడించారు. విపత్తు విభాగంలో పనిచేసేవారికి శిక్షణ ఇవ్వడానికి రాష్ట్ర స్థాయిలో డిజాస్టర్ మేనేజిమెంట్ ఆధ్వర్యంలో అత్యుత్తమ శిక్షణా కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని నిర్ణయించినట్లు తెలిపారు. వాతావరణ పరిస్థితులు ఎప్పటికప్పుడు ప్రజలకు తెలియజేసేలా ఆయా స్థానిక పరిస్థితులను బట్టి మండల స్థాయి వరకు అడ్వాన్సుడ్ వెదర్ స్టేషన్లు ఏర్పాటు చేయాలని నిర్ణయించినట్లు తెలిపారు.

# విమాన ప్రమాదంలో మహారాష్ట్ర డిప్యూటీ సీఎం అజిత్ పవార్ దుర్మరణం



ల్యాండింగ్ సమయంలో విమానం అదుపుతప్పి కూలిపోయింది. ఆ వెంటనే భారీగా మంటలు చెలరేగాయి. ప్రమాద తీవ్రతకు విమానం రెండు ముక్కలైనట్లు తెలుస్తోంది. విమాన ప్రమాదంపై డీజీసీఏ (ఆఉఅం) స్పందించింది. విమానంలో ఎవరూ బతికి లేరని వెల్లడించింది. అజిత్ పవార్‌తో పాటు ముంబయి పీఎస్‌వో వదీప్ జాదవ్, కెప్టెన్ సుమిత్ కపూర్, కెప్టెన్ శాంభవి పాఠక్, ఫ్లైట్ అటెండెంట్ పింకీ మాలి మరణించినట్లు తెలిపింది. అజిత్ పవార్ 1959 జులై 22న జన్మించారు. ఆయన తండ్రి అనంత్‌రావ్ పవార్.. సీనియర్ రాజకీయ నాయకుడు, మహారాష్ట్ర మాజీ సీఎం శరద్ పవార్‌కు సోదరుడు. బాబాయి శరద్ పవార్ అడుగుజాడల్లో రాజకీయాల్లోకి అడుగుపెట్టిన అజిత్‌పవార్.. 1982లో తొలిసారి కార్పొరేటివ్ షుగర్ ఫ్యాక్టరీ బోర్డుకు ఎన్నికయ్యారు. ఆ తర్వాత 16 ఏళ్ల పాటు పుణె జిల్లా సెంట్రల్ కోఆపరేటివ్ బ్యాంక్ ఛైర్మన్‌గా వ్యవహరించారు. 1991లో తొలిసారి బారామతి పార్లమెంటరీ నియోజకవర్గం నుంచి లోక్‌సభకు ఎన్నికయ్యారు. అనంతరం బాబాయి శరద్ పవార్ కోసం ఆ సీటును త్యాగం చేసి.. రాష్ట్ర రాజకీయాల్లోకి వచ్చారు. 1991 ఉప ఎన్నికల్లో బారామతి అసెంబ్లీ స్థానం నుంచి గెలుపొందారు. ఈ నియోజకవర్గం నుంచి ఎనిమిది సార్లు మహారాష్ట్ర ఎమ్మెల్యేగా విజయం సాధించారు. ప్రస్తుతం సీఎం దేవేంద్ర ఫడణవీస్ నేతృత్వంలోని మహాయుతి ప్రభుత్వంలో ఉప ముఖ్యమంత్రిగా పనిచేస్తున్నారు. అజిత్ పవార్‌కు భార్య, ఇద్దరు కుమారులున్నారు. భార్య సునేత్ర పవార్ రాజ్యసభ ఎంపీగా వ్యవహరిస్తున్నారు.

బండరాయిని ఢీకొట్టి..

ప్రమాద సమయంలో పుణె, బారామతి ప్రాంతాన్ని దట్టమైన పొగమంచు కమ్మేసింది. దీంతో విజిబిలిటీ తక్కువగా ఉంది. ఇది కూడా ప్రమాదానికి కారణమై ఉంటుందని అధికారులు భావిస్తున్నారు. కొండ ప్రాంతంలో ప్రయాణిస్తున్న క్రమంలో విమానం నియంత్రణ కోల్పోయింది. దీంతో ఓ బండరాయిని ఢీకొట్టడంతో విమానం నుంచి భారీగా మంటలు చెలరేగాయి.

ఘటనపై ప్రధాని మోదీ, రాష్ట్రపతి ముర్ము దిగ్భ్రాంతి కాంగ్రెస్ సీనియర్ నాయకుడు రాహుల్, సీఎం రేవంత్ సంతాపం

అజిత్ పవార్ మృతిపై ప్రధాని మోదీ, హోం మంత్రి అమిత్ షాగ్భ్రాంతి వ్యక్తంచేశారు. ఈ ప్రమాద ఘటనపై మహారాష్ట్ర సీఎం దేవేంద్ర ఫడణవీస్‌తో మోదీ, అమిత్ షా మాట్లాడారు. 'విమాన ప్రమాదంలో మహారాష్ట్ర ఉప ముఖ్యమంత్రి అజిత్ పవార్ ప్రాణాలు కోల్పోవడం బాధాకరం. మహారాష్ట్రకు ఇది కోలుకోలేని నష్టం. రాష్ట్ర అభివృద్ధికి ఆయన ఎంతో కృషి చేశారు. పవార్ కుటుంబానికి, ఆయన మద్దతుదారులకు ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నాను' -రాష్ట్రపతి ద్రౌపది ముర్ము

'మహారాష్ట్ర డిప్యూటీ సీఎం అజిత్ పవార్ మృతిగ్భ్రాంతి కలిగించింది. అట్టడుగు స్థానం నుంచి రాజకీయ నేతగా ఎదిగిన ఆయన ప్రజా నాయకుడిగా మహారాష్ట్ర ప్రజల గుండెల్లో ఎప్పటికీ నిలిచిపోతారు. ఆయన కుటుంబానికి నా ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నా' - ప్రధాని నరేంద్ర మోదీ

'మహారాష్ట్ర ఉప ముఖ్యమంత్రి అజిత్ పవార్ మృతి వార్త వినగానే తీవ్రగ్భ్రాంతికి గురయ్యాను. మేము ఎప్పుడు కలిసినా, మహారాష్ట్ర ప్రజల సంక్షేమానికి సంబంధించిన అనేక అంశాలపై చర్చించుకునేవాళ్లం. ఆయన మరణం ఎన్డీఏ కుటుంబానికి తీవ్ర నష్టం. ఈ కష్ట సమయంలో మేమంతా పవార్ కుటుంబానికి అండగా ఉంటాం' హోంమంత్రి అమిత్ షా

'మహారాష్ట్ర ఉప ముఖ్యమంత్రి అజిత్ పవార్ అకాల మరణం గురించి తెలిసి తీవ్రగ్భ్రాంతికి గురయ్యాను. తన సుదీర్ఘ ప్రజా జీవితంలో మహారాష్ట్ర అభివృద్ధి, శ్రేయస్సుకు ఆయన ఎంతో కృషి చేశారు. ఆయన కుటుంబానికి, శ్రేయోభిలాషులకు, అభిమానులకు నా సానుభూతిని తెలియజేస్తున్నాను' - రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్

'విమాన ప్రమాదంలో అజిత్ పవార్ మృతి చెందడంగ్భ్రాంతికరం. పవార్ కుటుంబసభ్యులకు, అనుచరులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నా'. -కాంగ్రెస్ అగ్రనేత రాహుల్

'విమాన ప్రమాదంలో అజిత్ పవార్ ప్రాణాలు కోల్పోవడం నన్ను తీవ్ర వేదనకు గురిచేసింది. ఆయన మృతితో రాష్ట్రంలో విషాద వాతావరణం నెలకొంది. వ్యక్తిగతంగా ఆయన నాకు మంచి స్నేహితుడు. పరిపాలనలో ఎదురైన ఎన్నో సవాళ్లను ఇద్దరం కలిసి ఎదుర్కొన్నాం. మహారాష్ట్ర అభివృద్ధికి మరిన్ని చర్యలు తీసుకుంటున్న సమయంలో ఆయన అకాల మరణం తీరని లోటు. రాష్ట్రంలో మూడు రోజుల పాటు సంతాప దినాలు ప్రకటిస్తున్నాం' - ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడణవీస్

'విమాన ప్రమాదంలో మహారాష్ట్ర ఉప ముఖ్యమంత్రి అజిత్ పవార్ మృతి చెందిన వార్తలు చూసి తీవ్రగ్భ్రాంతికి గురయ్యాను. ఆయన కుటుంబసభ్యులు, స్నేహితులు, అనుచరులకు నా ప్రగాఢ సంతాపాన్ని తెలియజేస్తున్నాను' - ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు

'మహారాష్ట్ర డిప్యూటీ సీఎం అజిత్ పవార్ అకాల మరణం తీవ్ర దిగ్భ్రాంతి కలిగించింది. ఆయన కుటుంబ సభ్యులకు, అనుచరులకు ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నా' - తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి

'విమాన ప్రమాదంలో అజిత్ పవార్ మృతి చెందిన ఘటన నన్ను తీవ్రంగా కలచివేసింది. ఈ ప్రమాదంపై పూర్తిస్థాయి దర్యాప్తునకు ఆదేశిస్తున్నాం' - కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు

'అజిత్ పవార్ ఆకస్మిక మరణం విచారకరం. మహారాష్ట్రలో ఇది చీకటి రోజు. ప్రమాదం గురించి తెలియగానే ఆయన సురక్షితంగా ఉండాలని దేవుడిని ప్రార్థించాను. ఇంతటి ఘోరం జరుగుతుందనుకోలేదు. అజిత్ పవార్‌కు బారామతితో ఎంతో అనుబంధం ఉంది. అక్కడే ఆయన మరణించడం విషాదకరం. ఆయనకు ఇలా నివాళులు అర్పించాల్సి వస్తుందనుకోలేదు' - ఎంపీ సంజయ్ రౌత్

## అజిత్ విమాన ప్రమాదంలో కుట్ర కోణం

కోల్‌కతా(జనంసాక్షి):విమాన ప్రమాదంలో మహారాష్ట్ర ఉప ముఖ్యమంత్రి అజిత్‌పవార్ ప్రాణాలు కోల్పోయిన ఘటనపై పశ్చిమబెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ కీలక వ్యాఖ్యలు చేశారు. అజిత్ మృతిలో కుట్రకోణం ఉందనే అనుమానం వ్యక్తం చేశారు. ఈ ప్రమాదం దేశంలో రాజకీయ నాయకుల భద్రతపై ప్రశ్నలు లేవనెత్తుతోందన్నారు. ఈ ఘటనపై సుప్రీంకోర్టు పర్యవేక్షణలో దర్యాప్తు జరపాలని డిమాండ్ చేశారు. అజిత్ మృతి చెందిన వార్త తనను దిగ్భ్రాంరతికి గురిచేసిందని మీడియాతో మాట్లాడుతూ మమతా బెనర్జీ అన్నారు. బీజేపీని వీడాలని ఆయన ఆలోచిస్తున్నారని ఇటీవల జరిగిన ప్రచారాన్ని ప్రస్తావిస్తూ, రాజకీయ నాయకులకు సైతం భద్రత లేకుండా పోతోందన్నారు. ఈ ఘటన అనేక ప్రశ్నలకు తావిస్తోందన్నారు. సుప్రీంకోర్టు పర్యవేక్షణలో మాత్రమే దర్యాప్తు జరపాలని డిమాండ్ చేశారు. అత్యున్నత న్యాయస్థానం మీద మాత్రమే తమకు నమ్మకం ఉందని, మరో ఇతర దర్యాప్తు సంస్థలపైన విశ్వాసం లేదని, దర్యాప్తు సంస్థలు తమ స్వేచ్ఛ కోల్పోయాయని ఆరోపించారు. కాగా, బారామతి విమాన ప్రమాదంపై విచారణ జరిపించాలని పలువురు రాజకీయ నేతలు సైతం డిమాండ్ చేశారు. అజిత్ పవార్ మృతికి సంతాపం తెలుపుతూ ఇందుకు దారితీసిన ప్రమాద ఘనటపై పారదర్శకమైన దర్యాప్తు జరపాలని కాంగ్రెస్ ఎంపీ గౌరవ్ గొగోయ్, ఆర్జేడీ చీఫ్ లాలూ ప్రసాద్ యాదవ్, వంచిత్ బహుజన్ అఘాడి నేత ప్రకాష్ అంబేద్కర్ తదితరులు కోరారు.

## అది ప్రమాదమే.. రాజకీయం చేయొద్దు

ముంబై(జనంసాక్షి):మహారాష్ట్ర ఉప ముఖ్యమంత్రి అజిత్ పవార్ మరణంపై ఎన్సీపీ (ఎస్పీ) అధినేత శరద్ పవార్ స్పందించారు. విమాన దుర్ఘటన పూర్తిగా ప్రమాదమేనని.. దీన్ని రాజకీయం చేయొద్దని అన్నారు. విమాన ప్రమాదంపై పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ అనుమానాలు వ్యక్తం చేసిన నేపథ్యంలో తొలిసారి మీడియా ముందుకు వచ్చిన శరద్ పవార్.. అజిత్ మరణం తీవ్ర దుఃఖాన్ని మిగిల్చిందన్నారు. "అజిత్ పవార్ అకాల మరణం తీవ్రగ్భ్రాంతిని కలిగించింది. ఓ సమర్థుడైన నాయకుడిని రాష్ట్రం కోల్పోయింది. జరిగిన నష్టాన్ని పూడ్చలేం.. కానీ, ప్రతిదీ మన చేతుల్లో లేదు. ఈ ఘటనను రాజకీయం చేసేందుకు కొందరు ప్రయత్నిస్తున్నారు. ఇందులోకి రాజకీయాలు తీసుకురావద్దు. ఇది పూర్తిగా ప్రమాదమే. ఈ ఘటన నాతోపాటు రాష్ట్రం మొత్తానికి తీవ్ర దుఃఖాన్ని మిగిల్చింది. దయచేసి ఈ విషాదాన్ని రాజకీయం చేయొద్దు" అని శరద్ పవార్ విజ్ఞప్తి చేశారు.

## విజిబిలిటీ లేకపోవడం వల్లే ప్రమాదం

న్యూఢిల్లీ(జనంసాక్షి):మహారాష్ట్ర ఉప ముఖ్యమంత్రి అజిత్ పవార్ ప్రయాణిస్తున్న విమానం ప్రమాదానికి గురైన ఘటనపై పౌర విమానయానశాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు స్పందించారు. ప్రాథమిక సమాచారం మేరకు.. ప్రమాద సమయంలో బారామతి ఎయిర్‌పోర్టులో విజిబిలిటీ చాలా తక్కువగా ఉన్నట్లు తేలిందన్నారు. రన్‌వే కనిపిస్తుందా? లేదా అని పైలట్లను బారామతి ఏటీసీ అధికారులు అడిగారని, కనిపించడం లేదనే సమాధానం వచ్చిందన్నారు. దాంతో విమానం గాల్లో కొంతసేపు చక్కర్లు కొట్టినట్లు కేంద్ర మంత్రి వివరించారు.

## బంగారం మరింత ప్రియం

మరోసారి పుత్తడి ధరలు భారీగా పెరిగాయి. బుధవారం మధ్యాహ్నం రెండుగంటల సమయంలో హైదరాబాద్ బులియన్ మార్కెట్‌లో 10 గ్రాముల మేలిమి పసిడి రూ.1,70,447కు చేరింది. నిన్న నగరంలో 24క్యారెట్ల బంగారం ధర రూ.1,62,380 పలికింది. అంటే ఎనిమిది వేల మేర పెరిగింది. 22 క్యారెట్ల 10 గ్రాముల ధర రూ.1,51,400గా ఉంది. హైదరాబాద్‌లో కిలో వెండి రూ.3.75లక్షలుగా ఉందని బులియన్ వర్గాలు వెల్లడించాయి. మల్టీ కమొడిటీ ఎక్స్ఛేంజీలో మార్చి నెల డెలివరీలో కిలో వెండి ధర బుధవారం వెండి రికార్డు స్థాయికి చేరింది. రూ.26,821కి పెరిగి రూ.3.83 లక్షలు పలికింది. 10 గ్రాముల బంగారం రూ.1.62 లక్షలకు పెరిగింది. అంతర్జాతీయ మార్కెట్‌లో స్పాట్ గోల్డ్ ధర ఔన్సు 5296.79 డాలర్లకు చేరడంతో దేశీయంగా అదే స్థాయిలో బంగారం ధరలకు రెక్కలొచ్చాయి. మరోవైపు వెండి సైతం అంతర్జాతీయ మార్కెట్‌లో ఔన్సు 114 డాలర్లుగా ఉంది. డాలర్ బలహీనతలు ఈ లోహాల ధరల పెరుగుదలకు దోహదం చేస్తున్నాయి. డాలర్ విలువ నేడు నాలుగేళ్ల కనిష్ఠానికి పడిపోయింది. ఓ వైపు తమ కరెన్సీ గొప్పగా ఉందని ట్రంప్ చెప్తుండగా.. ఆ తర్వాత కూడా డాలర్ మరింత బలహీనపడటడం గమనార్హం.

## నేడు సారలమ్మ ఆగమనం

నిర్వహిస్తారు. అనంతరం భారీ భద్రత మధ్య సారలమ్మ గద్దెకు చేరుకుంటారు. గోవింద రాజు, పగిడిద్ద రాజులు కూడా గద్దెలకు చేరుకుంటారు. అలాగే గురువారం సాయంత్రం చిలకలగుట్ట నుంచి సమ్మక్క అమ్మవారు గద్దెపైకి వస్తారు. సమ్మక్క రాకతో జాతర పరిపూర్ణం కానుంది. మరుసటి రోజు అనగా శుక్రవారం(జనవరి 30) భక్తులు సమ్మక్క - సారలమ్మలను దర్శించుకుని మొక్కులు చెల్లించుకుంటారు. చివరి రోజైన శనివారంసాయంత్రం సమ్మక్క, సారలమ్మ, గోవింద రాజు, పగిడిద్ద రాజులు వన ప్రవేశం చేస్తారు. దీంతో జాతర పరిపూర్ణంగా ముగుస్తుంది. మేడారం మహా జాతర తెలంగాణ సంస్కృతి, గిరిజన సంప్రదాయాలకు ప్రతీకగా నిలుస్తుంది. మేడారంలో భక్తుల రద్దీ కొనసాగుతోంది. జంపన్నవాగులో పుణ్యస్నానాలు చేసి, వనదేవతలకు మొక్కులు చెల్లించుకుంటున్నారు భక్తులు. జనాల గుడారాలతో మేడారం కిటకిటలాడుతోంది. భక్తులు బెల్లం(బంగారం) సమర్పిస్తూ ఆచారాలు పాటిస్తున్నారు. మహాజాతరకు ప్రభుత్వం కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేపట్టింది. దాదాపు మూడు కోట్ల మంది భక్తులు హాజరవుతారని అంచనా. ప్రభుత్వం తాజాగా గద్దెలను పునర్నిర్మాణం చేసింది. అలాగే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా రవాణా, నీరు, వైద్యం, భద్రతా ఏర్పాట్లు చేశారు. మేడారం సమ్మక్క-సారలమ్మ మహాజాతర ప్రారంభం కావడంతో ములుగు జిల్లాలోని అడవులన్నీ భక్తజనసంద్రంగా మారాయి. ఆసియాలోనే అతిపెద్ద గిరిజన పండగగా పేరొందిన ఈ జాతరలో అత్యంత కీలకమైన ఘట్టం జంపన్న వాగులో పుణ్యస్నానాలు ఆచరించడం. సారలమ్మ గద్దెపైకి వస్తున్న తరుణంలో వేలాది మంది భక్తులు జంపన్న వాగు వద్దకు పోటెత్తడంతో ఆ ప్రాంతమంతా కిటకిటలాడుతోంది. చిన్నా పెద్దా అనే తేడా లేకుండా భక్తులందరూ బస్సుల ద్వారా, సొంత వాహనాల ద్వారా నేరుగా వాగు వద్దకు చేరుకుని తమ మొక్కులు చెల్లించుకుంటున్నారు. మేడారం వచ్చే ప్రతి భక్తుడు ముందుగా జంపన్న వాగును సందర్శించడం ఒక ఆచారంగా వస్తోంది.

## వికసిత్ భారత్ వైపు దేశం పయనిస్తోంది

ఉందని రాష్ట్రపతి వెల్లడించారు. దేశంలో స్పేస్ టూరిజం అభివృద్ధికి ఎన్నో అవకాశాలున్నాయని రాష్ట్రపతి అన్నారు. భవిష్యత్‌లో అంతరిక్షంలో భారత స్పేస్ స్టేషన్ ఏర్పాటు చేస్తామని, జమ్మూకశ్మీర్‌లో అత్యంత ఎత్తైన రైల్వే బ్రిడ్జి నిర్మించామని గుర్తు చేశారు. గత 11 ఏళ్లలో భారత ఆర్థిక వ్యవస్థ వేగంగా అభివృద్ధి చెందిందని రాష్ట్రపతి చెప్పారు. అవినీతి కట్టడితో ప్రభుత్వ ప్రజాధనాన్ని సద్వినియోగం చేస్తోంది. జీఎస్‌టి స్లాబ్‌ల తగ్గింపుతో దేశ ప్రజల కొనుగోలు శక్తి పెరిగింది. యూరోపియన్ యూనియన్‌తో ఫ్రీ ట్రేడ్ అగ్రిమెంట్ చేసుకున్నాం. రూ.12లక్షల వార్షిక ఆదాయం వరకు ఆదాయపు పన్ను లేకుండా చేశాం. స్మార్ట్‌ఫోన్ల ఎగుమతుల్లోనూ భారత్ దూసుకెళ్తోంది. భారత్ పవర్ టెక్నాలజీ హబ్‌గా రూపొందుతోంది. గ్రీన్ ఎనర్జీ రంగంలో భారత్‌ను పవర్ హౌస్‌గా తయారు చేస్తున్నాం. భవిష్యత్‌లో 100 గిగావాట్ల న్యూక్లియర్ ఎనర్జీ ఉత్పత్తి లక్ష్యం. 500 గిగావాట్ల గ్రీన్ ఎనర్జీ ఉత్పత్తికి చర్యలు. వికసిత్ భారత్‌లో రైతుకు అధిక ప్రాధాన్యత ఉంటుందని రాష్ట్రపతి స్పష్టం చేశారు. గ్రామీణ ఉపాధి కల్పన కోసం జీ రామ్ జీ చట్టం తీసుకొచ్చాం. దేశాభివృద్ధిలో మహిళలకు కీలక పాత్ర కల్పించాం. ఆపరేషన్ సిందూర్.. మన సైనికుల సత్తా చాటింది. భారత్‌పై దాడిచేస్తే ఏం జరుగుతుందో ప్రపంచం చూసింది. రక్షణరంగ ఉత్పత్తుల ఎగుమతి రికార్డు స్థాయిలో పెరిగింది. ఆపరేషన్ సిందూర్ తర్వాత భారత్ డిఫెన్స్ ఉత్పత్తులకు గిరాకీ పెరిగింది. నానో చిప్‌ల తయారీపైనా భారత్ దృష్టి సారించింది. మైక్రో చిప్‌ల తయారీలో స్వయంసమృద్ధి సాధించాలి. ఎలక్ట్రానిక్స్ పరిశ్రమలో 15లక్షల ఉద్యోగాలు సృష్టించగలిగాం. ముద్ర యోజన ద్వారా చిరువ్యాపారులకు భారీగా రుణాలు అందించాం. వంటి ఎన్నో ప్రభుత్వ కార్యక్రమాల్ని రాష్ట్రపతి తన ప్రసంగంలో వెల్లడించారు. పీఎం విశ్వకర్మ యోజనతో 20లక్షల మందికి శిక్షణ ఇస్తున్నామని రాష్ట్రపతి తెలిపారు. ఎన్డీఏ పదేళ్ల పాలనలో 25 కోట్ల మందికి పేదరికం నుంచి విముక్తి కల్పించినట్లు తెలిపారు. 100 కోట్లకు పైగా గ్యాస్ కనెక్షన్లు అందించామని.. ఆయుష్మాన్ భారత్ ద్వారా కోట్ల మందికి వైద్య సేవలు అందిస్తున్నామన్నారు. వికసిత్ భారత్‌లో రైతులకు ప్రథమ ప్రాధాన్యం ఇచ్చామన్నారు. వ్యవసాయ మౌలిక సదుపాయాలను మెరుగుపరుస్తున్నట్లు పేర్కొన్నారు. ఆత్మనిర్భర్ భారత్ సాధన కోసం కేంద్ర ప్రభుత్వం కృషి చేస్తోందని రాష్ట్రపతి పేర్కొన్నారు. భవిష్యత్తును దృష్టిలోపెట్టుకొని దేశం సంస్కరణల పథంలో దూసుకెళ్తోందన్నారు. పీఎల్ఐ పథకం కింద పారిశ్రామికోత్పత్తిని ప్రోత్సహిస్తున్నట్లు తెలిపారు. ఎలక్ట్రానిక్ ఉత్పత్తుల్లో గణనీయమైన ప్రగతి సాధించామన్నారు. సముద్ర వ్యాపారాన్ని మరింత పెంచేందుకు ప్రణాళికలు రచిస్తున్నట్లు వెల్లడించారు. అంతకుముందు పార్లమెంట్‌కు చేరిన రాష్ట్రపతికి స్పీకర్ ఓం బిర్లా, ఉపరాష్ట్రపతి రాధాకృష్ణన్, ప్రధాని మోడీ తదితరులు ఘనంగా స్వాగతం పలికారు. ఆమెను సాదరంగా పార్లమెంట్ భవనంలోకి తోడ్కొని వెళ్లారు.

## పురపోరులోనూ సత్తా చాటుతాం

విక్రమార్క కొన్ని కీలక మార్గదర్శకాలను విడుదల చేశారు. కేవలం రాజకీయ ప్రాధాన్యతలకు కాకుండా, క్షేత్రస్థాయిలో గెలిచే సామర్థ్యం ఉన్న అభ్యర్థులకే టికెట్లు కేటాయించాలని ఆదేశించారు. ముఖ్యంగా కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతాలను నమ్మిన వారు, ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి బలంగా తీసుకువెళ్లే అభ్యర్థులపై దృష్టి సారించాలని కోరారు. ప్రభుత్వం ఇప్పటికే అమలు చేస్తున్న 'ఆరు గ్యారెంటీలు' , ఇతర అభివృద్ధి పనులను ఓటర్లకు వివరించి, వారి మద్దతు పొందే నాయకులను గుర్తించడం ఈ ఎన్నికల్లో అత్యంత కీలమని ఆయన పునరుద్ఘాటించారు. మున్సిపల్ ఎన్నికల షెడ్యూల్ ప్రకారం, నామినేషన్ల స్వీకరణ ఇప్పటికే ప్రారంభమైన నేపథ్యంలో అభ్యర్థుల ఖరారు పక్రియను వేగవంతం చేయాలని భట్టి విక్రమార్క పిలుపునిచ్చారు. ఫిబ్రవరి 11న జరగనున్న పోలింగ్‌లో కాంగ్రెస్ అభ్యర్థులు మెజారిటీ స్థానాల్లో విజయం సాధించేలా ప్రణాళికలు సిద్ధం చేయాలన్నారు. జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు , మున్సిపాలిటీ బాధ్యులు తదేక దృష్టితో పనిచేసి, ఫిబ్రవరి 13న వెలువడే ఫలితాల్లో పార్టీ జెండా ఎగిరేలా కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వ విజయాలను ఆయుధంగా మలచుకుని, ప్రతిపక్షాలకు అవకాశం ఇవ్వకుండా మున్సిపల్ ఎన్నికల్లో క్లీన్ స్వీప్ చేయడమే లక్ష్యంగా ముందుకు సాగాలని పార్టీ శ్రేణులను ఆయన ఉత్సాహపరిచారు. మున్సిపల్ ఎన్నికల్లోనూ మెజారిటీ స్థానాలు గెలిచి రాష్ట్ర అభివృద్ధిని ముందుకు తీసుకెళామన్నారు.. నగరాల్లో మౌలిక సదుపాయాలకు పెద్దపీట వేస్తామని చెప్పారు. దేశంలోనే ఏ రాష్ట్రంలో లేని సంక్షేమ పథకాలను ప్రజా ప్రభుత్వం అమలు చేస్తుందన్నారు. ÷న్సిపల్ ఎన్నికల్లో పొత్తుల అంశం పీసీసీ చీఫ్ మహేష్ గౌడ్ నిర్ణయం తీసుకుంటారని చెప్పారు భట్టి. తమ కేబినెట్ అంతా ఉమ్మడి కుటుంబంలా పనిచేస్తుంది.. రాష్ట్ర భవిష్యత్తే తమ లక్ష్యమని అన్నారు. ప్యూర్, క్యూర్, రేర్ సమగ్ర విధానంతో తెలంగాణ రాష్ట్ర అభివృద్ధి కోసం 2047 విజన్ డాక్యుమెంట్ విడుదల చేశామన్నారు. సీఎం రేవంత్ రెడ్డి దే మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో తనకు కొన్ని సూచనలు చేశారని చెప్పారు. మంత్రులు తెలియజేసిన సమస్యలను తాను ముఖ్యమంత్రికి వివరించానని చెప్పారు. ప్రజాభవన్లో మంత్రుల భేటీపై కొందరు పిచ్చి భ్రమల్లో ఉండి పిచ్చి రాతలు రాస్తున్నారని ఫైర్ అయ్యారు భట్టి. మంత్రులు డిప్యూటీ సీఎంను కలవకపోతే ఇంకెవరిని కలుస్తారని ప్రశ్నించారు భట్టి. సిఎం లేనప్పుడు ప్రధాన సమస్యలను చర్చించేందుకు తనతో కలిసినట్లు వెల్లడించారు. ప్రజాభవన్ లో మంత్రుల భేటీపై కొందరు పిచ్చి రాతలు రాస్తున్నారని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ÷ర్ అయ్యా రు. సీఎం రేవంత్ దేశంలో లేనందున మున్సిపల్ ఎన్నికలపై తనకు కొన్ని సూచనలు చేశారని తెలిపారు. మంత్రులు వారి సమస్యలు తెలియజేశారని ఆ విషయాలను ముఖ్యమంత్రికి వివరించానని చెప్పా రు. మంత్రులు డిప్యూటీ సీఎంను కలవకపోతే రాసే వారితో చూపించే వారితో కలుస్తారా? అని ప్రశ్నించారు. తమ క్యాబినెట్ ఉమ్మడి కుటుంబంలా పనిచేస్తోందని, అభివృద్ధి, సంక్షేమం రాష్ట్ర భవిష్యత్తు తమ అందరి ఆలోచన లక్ష్యం అని స్పష్టం చేశారు. మున్సిపల్ ఎన్నికల్లో పొత్తులపై పీసీసీ చీఫ్ మహేశ్ గౌడ్ నిర్ణయం తీసుకుంటారని.. 'మున్సిపల్ ఎన్నికల్లో ఏ విధంగా ముందుకు వెళ్లాలి అనే అంశాన్ని ప్రజాభవంలో చర్చించాం. నిజామాబాద్ పార్లమెంట్, ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో కొన్నిచోట్ల సమస్య ఎదురైనందున అందుకు సంబంధించిన మంత్రులు నాతో సమావేశం అయ్యారు. ప్రజాధరణ ఎక్కువగా ఉన్న నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీ ద్వారా సేవ చేయాలని కోరుకునేవారు కొన్ని ప్రాంతాల్లో ఎక్కువమంది మున్సిప ల్ టికెట్లను ఆశిస్తారు అందులో తప్పులే దు. ఆ జిల్లా ఇన్చార్జి మంత్రులు స్థానిక శా సనసభ్యులు సమష్టిగా నిర్ణయం తీసుకొని గెలుపు అవకాశాలు ఉన్న వారికి టికెట్లు కేటాయిస్తరు. సింగరేణి టెండర్ల అంశంలో పూర్తి ఆధారాలతో స్పష్టత ఇచ్చాను. ఇంకా అందులోనే తిరుగుతాను అంటే వాళ్ల కర్మ. ఎన్నికల ముందు ఇచ్చిన హామీల్లో 90 శాతం అమలు చేశామన్నారు

## మున్సిపల్ ఎన్నికల్లో తెలంగాణ జాగృతి పోటీ

ప్రకటించిన ఏఐఎఫ్‌బి తెలంగాణ చైర్మన్ జావెద్ లతీఫ్ మున్సిపల్ ఎన్నికలతోపాటు భవిష్యత్‌లోనూ కలిసి పనిచేయాలని నిర్ణయం తీసుకున్నారు. బుధవారం సాయంత్రం ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ కార్యాలయంలో తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవితతో ఏఐఎఫ్‌బీ రాష్ట్ర చైర్మన్ జావెద్ లతీఫ్, కన్వీనర్ జోజిరెడ్డి, ఉపాధ్యక్షుడు బుచ్చిరెడ్డి, సెంట్రల్ కమిటీ సభ్యులు ఆర్‌వీఆర్ ప్రసాద్, కొండ దయానంద్, ప్రధాన కార్యదర్శి కోమటిరెడ్డి తేజ్‌దీప్‌రెడ్డి, ఫైనాన్స్ సెక్రటరీ కె.నరేందర్, నిజామాబాద్ జిల్లా ప్రధాన కార్యదర్శి రాజుగౌడ్, సిద్దిపేట జిల్లా ప్రధాన కార్యదర్శి బీరన్న, నల్గొండ ప్రధాన కార్యదర్శి రాము, ఐవైఎల్ స్టేట్ ప్రెసిడెంట్ ఆదిత్య, జనరల్ సెక్రటరీ కృష్ణమూర్తి సహా ముఖ్యనేతలు సమావేశం అయ్యారు. .

## ఈయూతో ట్రేడ్ డీల్ వల్ల భారత్‌కే లాభం

పలు దేశాలు తమ ఉత్పత్తుల కోసం ఇతర మార్కెట్ల వైపు చూస్తున్నాయన్నారు. ఈ నేపథ్యంలోనే ఈయూ.. భారత్‌తో వాణిజ్య ఒప్పందం కుదుర్చుకుందన్నారు.

## అందరికీ అందుబాటులోకి కొత్త ఆధార్ యాప్

అంకితం చేశారు. 2009లో ఇదే రోజున ఆధార్‌ను లాంచ్ చేశారు ఈ యాప్ ద్వారా వెంటనే ఆధార్ వెరిఫికేషన్ చేసుకోవచ్చు. చిరునామా, మొబైల్‌నంబర్‌ను అప్‌డేట్ చేసుకునే సౌలభ్యం ఉంది. ఆధార్ కాంటాక్ట్ కార్డ్ ద్వారా అత్యంత గోప్యంగా కాంటాక్ట్ వివరాలను పంచుకోవచ్చు. ఎవరికైనా షేర్ చేసినప్పుడు మొత్తం వివరాలు కాకుండా అవసరమైనవి మాత్రమే కనిపించేలా ఏర్పాటు. ఎలాంటి సంక్లిష్టత లేకుండా యూజర్లకు అందుబాటులోకి సేవలు. ఈ యాప్ ద్వారా ఐదుగురి వరకు ప్రొఫైల్ వివరాలు క్రియేట్ చేసుకోవచ్చు

జనంసాక్షి
www.janamsakshi.org
JANAMSAKSHI DAILY



# నేను బిఆర్ఎస్ పార్టీకి రాజీనామా చేయలేదు

- అఫిడవిట్‌లో స్పీకర్‌కు వివరించిన దానం నాగేందర్



హైదరాబాద్, జనవరి 28 (జనంసాక్షి) : తెలంగాణలో బీఆర్ఎస్ ఫిరాయింపు ఎమ్మెల్యే వ్యవహారంలో కొత్త పరిణామాలు చోటుచేసుకున్నాయి. ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్‌పై బీఆర్ఎస్ దాఖలు చేసిన అనర్హత పిటిషన్‌పై, ఆయన స్పీకర్ కు వినతిపత్రం అందజేశారు. పార్టీ ఫిరాయింపులకు పాల్పడ్డారన్న ఆరోపణలను దానం నాగేందర్ ఘాటుగా ఖండిస్తూ, ఆ పిటిషన్‌ను కొట్టి వేయాలని స్పీకర్‌ను కోరారు. అఫిడవిట్‌లో దానం నాగేందర్ తాను బీఆర్ఎస్ పార్టీకి రాజీనామా చేయలేదని, అలాగే పార్టీ తనను సస్పెండ్ చేసినట్లు సమాచారమూ అధికారికంగా తనకు అందలేదని స్పష్టం చేశారు. మార్చి 2024లో జరిగిన కాంగ్రెస్ సమావేశానికి హాజరైన విషయాన్ని అంగీకరించినప్పటికీ, అది పూర్తిగా వ్యక్తిగత హోదాలో జరిగినదేనని చెప్పారు. ఒక పార్టీ సమావేశానికి వ్యక్తిగతంగా హాజరవడమే ఫిరాయింపుగా పరిగణించడాన్ని ఆయన తప్పుబట్టారు. మీడియా కథనాల ఆధారంగా తాను పార్టీ మారినట్లు బీఆర్ఎస్ భావించడం అనుచితమని, ఆ నిర్ధారణకు చట్టపరమైన ఆధారాలు లేవని చెప్పారు. అనర్హత పిటిషన్ రాజకీయ ప్రయోజనాల కోసం దాఖలు చేయబడిందని వాదించిన దానం నాగేందర్, పిటిషన్‌లో బలం లేదని, అందువల్ల దానిని కొట్టి వేయాలని స్పీకర్ కోర్టును కోరుతూ తన అఫిడవిట్‌ను ముగించారు.

# టీడీపీ రాష్ట్ర నాయకుడు గట్టు ప్రసాద్ బాబు మృతి



స్టేషన్ ఘన్పూర్, జనవరి 28 ( జనం సాక్షి) : స్టేషన్ ఘన్పూర్ మున్సిపాలిటీ కేంద్రంలో టీడీపీ రాష్ట్ర సీనియర్ నాయకుడు, టిడిపి ఉమ్మడి వరంగల్ జిల్లా మాజీ అధ్యక్షుడు, కూడా మాజీ చైర్మన్ గట్టు ప్రసాద్ బాబు ఈ నెల 26 న మృతి చెందడం జరిగింది. విషయం తెలుసుకున్న తెలంగాణ తెలుగుదేశం పార్టీ మాజీ రాష్ట్ర అధ్యక్షుడు, పొలి ట్ బ్యూరో సభ్యులు బక్కని నర్సింహులు, టీడీపీ సీనియర్ నాయకులు, టీటీడీ బోర్డు సభ్యులు నన్నూరి నర్సిరెడ్డి బుధవా రం గట్టు ప్రసాద్ బాబు స్వగృహం కు వచ్చి వారి పార్థివ దేహానికి పూలమాల వేసి,పార్టీ కండువా కప్పి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా బక్కని నర్సింహులు , నన్నూరి నర్సిరెడ్డి మాట్లా డుతూ, టీడీపీ పార్టీ కోసం గట్టు ప్రసాద్ బాబు ఎంతో నిబద్ధత తో పని చేశారని, అలాంటి గొప్ప నాయకున్ని ఈరోజు మనం కోల్పోవడం చాలా బాధాకరమని అన్నారు.మేము వరంగల్లో పార్టీ కార్యక్రమాలకు ఎప్పుడు వచ్చినా కూడా ప్రసాద్ బాబు పార్టీ మీటింగుల్లో చాలా చురుకుగా ఉండే వారని,అలాంటి వ్యక్తి మన మధ్య లేకపోవడం వ్యక్తిగతంగా మాకు అటు టీడీపీ పార్టీకి తీరని లోటుగా భావిస్తున్నామని,ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని ఆ భగవంతున్ని ప్రార్థిస్తున్నామని అన్నారు. ఈ అంతిమయాత్రలలో స్టేషన్ ఘన పూర్ నియోజకవర్గ ఇన్చార్జ్ పుట్ట రజినీకాంత్, జాతీయ క్రమశిక్షణ కమిటీ సభ్యుడు బంటు వెంకటేశ్వర్లు, మాజీ రాష్ట్ర ఉపాధ్యక్షులు సామ భూపాల్ రెడ్డి , బండి పుల్లయ్య,బిసి సెల్ అధ్యక్షు డు శ్రీపతి సతీష్,ఎస్సీ సెల్ అధ్యక్షుడు పోలంపల్లి అశోక్ ,వరంగల్ పార్లమెంట్ కన్వీనర్ అర్చన పెల్లి విద్యాసాగర్ రావు,టిఎన్ యుఎస్ రాష్ట్ర అధ్య క్షుడు ముంజ వెంకట్రాజ్యం గౌడ్ , భువనగిరి పార్లమెంటుఅధ్యక్షుడు కృష్ణమాచారి, బాలకృష్ణ , జివిల్ శ్రీధర్, సురేఖ , రాష్ట్ర నాయకులు బైరపాక ప్రభాకర్, నరేష్ నాయక్, జయశంకర్, మండల పార్టీ అధ్యక్షుడు మాదిరెడ్డి ధర్మారెడ్డి, ఆరూరి రాజు, మేకల రమేష్ యాదవ్, కాసర్ల ఏలియా, కలకోట రమేష్, కొట్టే దామోదర్, అన్ని మండలా ల నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

# మరణంలోనూ వీడని బంధం

- ప్రమాదంలో తల్లీకూతుళ్లు మృతి





కౌటాల, జనవరి 28(జనం సాక్షి) : ట్రాక్టర్ అదుపుతప్పి పడిపోయిన ప్రమాదంలో తల్లి కూతుళ్లు మరణించిన చేదు ఘటన అందరిని కలచివేసింది. కొమరం భీం జిల్లా కౌటాల మండలం ముత్తంపేట్ గ్రామానికి చెందిన కస్తూరి రమేష్ కుటుంబ సభ్యులు కలిసి బస్సులో వారి బంధువుల ఇంటికి బొమ్మ పూర్ వెళ్ళారు . అక్కడ నుండి ట్రాక్టర్ లో 25మంది మేడారం జాతరకు బయలుదేరే క్రమంలో ముత్తరం మండలం కాటారం, మేడారం ప్రధాన రహదారిపై అటవీ ప్రాంతంలో రోడ్ పక్కన ట్రాక్టర్ దింపాడు, మళ్ళీ రోడ్ పై ఎక్కే క్రమంలో అదుపు తప్పి ట్రాలీ పల్టీ కొట్టింది.దాంతో తల్లి కస్తూరి సునీత (45) కూతురు అక్షిత (21)స్థలంలోనే మృతి చెందారు. తండ్రీ రమేష్ కు కాలు విరగటం తో హాస్పిటల్ లో చేర్పించారు. రమేష్ కుటుంబం కూలి పని చేసుకుంటూ కన్న కూతురు ఉన్నత చదువుల కోసం శ్రమించి జీవిస్తున్న సమయంలో కుటుంబాన్నీ విధి ప్రమాదం రూపంలో మార్చింది. రమేష్ కళ్ళ ముందే భార్య, కూతురు మృత్యువుతో పోరాడుతుంటే, కాలు విరిగి కాపాడు కోలేక తల్లాడిపోయాడు. కుటుంబాన్ని దూరం చేసుకొని ఒంటరి వాడుగా మిగిలి పోయానని కన్నీరు పెట్టుకున్నాడు.

### భవిష్యత్తులో ఎదగాలన్న కోరిక ఆమెది

కూతురు అక్షిత పాఠశాల స్థాయి నుండే చదువులో కృషి పట్టుదల ఎక్కువ,10వ తరగతి మయూరి ప్రయివేట్ పాఠశాలలో చదివి మండల టాపర్ గా నిలిచింది. ఇంటర్మీడియట్ వరంగల్ లో పూర్తి చేసి ప్రస్తుతం హైదరాబాద్ లో టి టీ సీ చదువుతుంది.ఆమె పెట్టుకున్న లక్ష్యం మద్యలోనే ఆగి పోయింది.ఎంతో భవిషత్తు ఉన్న అక్షిత ప్రమాదంలో మృతి చెందటం పట్ల తోటి స్నేహితులు, బంధువులు కంటతడి పెట్టుకున్నారు.

# ఎన్నికల కోడ్ తక్షణమే అమల్లోకి..

- ఆదిలాబాద్ కలెక్టర్ రాజర్షి షా



ఆదిలాబాద్ ప్రతినిది, (జనంసాక్షి): తెలంగాణ రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు 2026 సంవత్సరానికి గాను మున్సిపాలిటీలు, మున్సిపల్ కార్పొరేషన్ల 2వ సాధారణ ఎన్నికల షెడ్యూల్ విడుదలైన నేపథ్యంలో జిల్లా వ్యాప్తంగా ఎన్నికల ప్రవర్తనా నియమావళి తక్షణమే అమల్లోకి వచ్చిందని జిల్లా కలెక్టర్ రాజర్షి షా తెలిపారు. బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, రాష్ట్ర ఎన్నికల కమిషనర్ ఐ. రాణి కుముదిని జారీ చేసిన నోటిఫికేషన్‌తో ఎన్నికల ప్రక్రియ ప్రారంభమైందని చెప్పారు. జనవరి 28 నుండి ఉదయం 10:30 గంటల నుంచి నామినేషన్ల స్వీకరణ ప్రారంభమై, జనవరి 30 సాయంత్రం 5:00 గంటల వరకు కొనసాగుతుందని తెలిపారు. నామినేషన్ల పరిశీలన జనవరి 31న, అప్పీళ్లకు ఫిబ్రవరి 1 వరకు అవకాశం ఉందని, ఉపసంహరణకు ఫిబ్రవరి 3 మధ్యాహ్నం 3:00 గంటల వరకు గడువు విధించామని వివరించారు. పోలింగ్ ఫిబ్రవరి 11న ఉదయం 7:00 నుండి సాయంత్రం 5:00 గంటల వరకు జరుగుతుందని, ఓట్ల లెక్కింపు ఫిబ్రవరి 13న చేపడతామని తెలిపారు. ఎన్నికలను ప్రశాంతంగా, స్వేచ్ఛాయుతంగా, నిష్పక్షపాతంగా నిర్వహిం చేందుకు జిల్లా యంత్రాంగం అన్ని ఏర్పాట్లు పూర్తి చేసిందని, రాజకీయ పార్టీలు, అభ్యర్థులు, ప్రజలు ఎన్నికల నియమాలను కచ్చితంగా పాటించాలని ఆయన కోరారు. సమావేశంలో ఎస్పీ అఖిల్ మహాజన్, అదనపు కలెక్టర్లు శ్యామలాదేవి, రాజేశ్వర్, డిపిఆర్ఓ ఇ. విష్ణువర్ధన్, మున్సిపల్ కమిషనర్ రాజు తదితరులు పాల్గొన్నారు.

# జనసంద్రంగా మారిన జంపన్న వాగు

- జంపన్న వాగు లో భక్తుల పుణ్య స్నానాలు.



ములుగు బ్యూరో, జనవరి28 (జనం సాక్షి): ఆసియాలోనే అతిపెద్ద గిరిజన జాతర శ్రీ మేడారం సమ్మక్క సారలమ్మ మహా జాతరకు వచ్చే భక్తులు జంపన్న వాగు లో పుణ్య స్నానాలు ఆచరిస్తున్నారు. రెండు సంవత్సరాలకు ఒకసారి మాఘ శుద్ధ పౌర్ణమి రోజున జరిగే మహా జాతరకు వచ్చే భక్తులు జంపన్న వాగులో పుణ్య స్నానాలు ఆచరించడం అనవాయితీ గా వస్తుంది. వివిధ ప్రాంతాల నుండి వచ్చిన భక్తులు జంపన్న వాగులో ఇసుకతో వన దేవతల ప్రతిమలు ఏర్పాటు చేసి కొబ్బరి కాయ పసుపు కుంకుమతో ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు.శివ సత్తుల పునకాలతో జంపన్న వాగులో "పదివేల దండలే తల్లి అబ్బిస్సా అంటూ సమ్మక్క తల్లికి పబ్బతి పడుతూ పుణ్య స్నానాల ఆచరించి వన దేవతలకు ఒడి బియ్యం బంగారం సమర్పించి తమ మొక్కలను చెల్లించి తమ కోరిన కోర్కెలు తీర్చే కొంగు బంగారంగా ఇంటి ఇలవేల్పుగా ఆరాధిస్తున్నారు.

# మున్సిపల్ ఎన్నికల్లో తెలంగాణ రాజ్యాధికార పార్టీ పోటీ

- పార్టీ మేనిఫెస్టోను వివరించిన ఉమ్మడి కరీంనగర్ జిల్లా టీఆర్పీ ఇంచార్జి మాదం రజినీ కుమార్, మున్సిపల్ ఎన్నికల అబ్జర్వర్ అఖిల్ పాషా



కరీంనగర్ (జనంసాక్షి) : తెలంగాణ రాష్ట్రంలో జరగబోతున్న మున్సిపల్ ఎన్నికల్లో తెలంగాణ రాజ్యాధికార పార్టీ పూర్తి స్థాయిలో పోటీ చేయనున్నట్లు పార్టీ కరీంనగర్ జిల్లా ఇంచార్జి మాదం రజినీ కుమార్ స్పష్టం చేశారు. ఈ మేరకు కరీంనగర్ జిల్లాలో ఏర్పాటు చేసిన ప్రెస్ మీట్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. ఈ సందర్భంగా మాదం రజినీ కుమార్ మాట్లాడుతూ ప్రజలను పాలన రంగానికి దగ్గర చేసి వారు కట్టే ప్రతి పన్ను లెక్కను వారికి వివరించే విధంగా జవాబుదారీ పాలన అందివ్వడమే లక్ష్యంగా తెలంగాణ రాజ్యాధికార పార్టీ మున్సిపల్ ఎన్నికల మేనిఫెస్టోను రూపొందించినట్లు తెలిపారు. ప్రజలకు ఉపయోగపడే, అవినీతిరహిత పాలన దిశగా స్పష్టమైన కార్యాచరణతో మేనిఫెస్టో సిద్ధం చేశామని అన్నారు.మున్సిపాలిటీల్లో ప్రజల భాగస్వామ్యంతో పాలన సాగించే విధానాన్ని అమలు చేస్తామని ఈ సందర్భంగా వారు స్పష్టం చేశారు. ఇప్పటివరకు అధికారంలో ఉన్న పార్టీలు మున్సిపల్ పాలనను పూర్తిగా నిర్లక్ష్యం చేశాయని విమర్శించిన ఆయన, ప్రజలకు నిజమైన ప్రత్యామ్నాయంగా తెలంగాణ రాజ్యాధికార పార్టీ ముందుకు వస్తోందన్నారు. ప్రతి వార్డు, ప్రతి మున్సిపాలిటీలో బలమైన అభ్యర్థులను బరిలోకి దించి ప్రజల ఆశీర్వాదంతో విజయం సాధిస్తామని ధీమా వ్యక్తం చేశారు. ప్రజలు తమ హక్కుల కోసం, మెరుగైన పట్టణ పాలన కోసం తెలంగాణ రాజ్యాధికార పార్టీకి మద్దతు ఇవ్వాలని మాదం రజినీ కుమార్ పిలుపునిచ్చారు. ఈ ప్రెస్ మీట్‌లో రాష్ట్ర కార్యదర్శి, ఉమ్మడి కరీంనగర్ జిల్లా ఎన్నికల అబ్జర్వర్ అఖిల్ పాషా, జిల్లా అధ్యక్షులు గంగిపెల్లి అరుణ, వర్కింగ్ ప్రెసిడెంట్ షేక్ చాంద్ పాషా, జిల్లా మైనార్టీ అధ్యక్షులు మొహమ్మద్ వాజిత్, కరీంనగర్ టౌన్ ప్రెసిడెంట్ అర్షత్ బిన్ అలీ, పార్టీ నాయకులు చిగుర్ల మోహన్, శేఖర్, భోగ భాస్కర్, జడగల శ్రీనివాస్, అంకుషావలి, ఇశ్రత్ శావాలి, సాధేఖ బాను, నేహా అఫ్రీన్, జాహెర ఉన్నిసా బేగం, చిత్ర, అస్మా బేగం, విమల, రఫీ, సోషల్ మీడియా జిల్లా కన్వీనర్ మహబూబ్ అలీజ్, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# గనులు మూసివేయబడిన ప్రాంతాల అభివృద్ధిపై ప్రత్యేక చర్యలు



మంచిర్యాల, జనవరి 28 (జనంసాక్షి): బొగ్గు గనులు మూసి వేయబడిన ప్రాంతాల అభివృద్ధిపై ప్రత్యేక చర్యలు చేపట్టాలని కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డి అన్నారు. బుధవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా బొగ్గు గనులు సంబంధిత జిల్లాల కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, అన్ని బొగ్గు కంపెనీల జనరల్ మేనేజర్లతో మైన్స్ క్లోజింగ్ యాక్టివిటీలపై తీసుకోవలసిన చర్యల గురించి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కేంద్రమంత్రి మాట్లాడుతూ గనులు మూసివేసిన తర్వాత సంబంధిత ప్రాంతాలను స్థిరీకరించి సామాజిక అభివృద్ధి చర్యలు చేపట్టాలని తెలిపారు. మైన్స్ క్లోజింగ్ యాక్టివిటీ లలో భాగంగా పర్యాటక ప్రాంతాలుగా అభివృద్ధి చేయడం, క్రీడా ప్రాంగణాలు నిర్మించడం, పారిశ్రామిక పార్కులను అభివృద్ధి చేయడం వంటి చర్యలు తీసుకోవాలని, గనుల మూసివేతకు ముందు, తరువాతకు ఆయా ప్రాంతాలకు సంబంధించిన ఫోటోలు, వీడియోలు, ఎప్పటికప్పుడు సోషల్ మీడియాలో అప్ లోడ్ చేయాలని, మీడియా ద్వారా ప్రజలకు తెలియజేయాలని సూచించారు. జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ మాట్లాడుతూ జిల్లాలో మూసి వేయబడిన గనుల ప్రాంతంలో హాస్పటల్, స్కిల్ డెవలప్మెంట్ సెంటర్, ఇండస్ట్రియల్ పార్క్ వంటివి ఏర్పాటు చేయడానికి ప్రతిపాదనలు సిద్ధం చేయడం జరుగుతుందని తెలిపారు. జిల్లాలో మూసివేయబడిన గనుల పరిసర ప్రాంతాల్లో సామాజిక అభివృద్ధి కొరకు 115 కోట్ల రూపాయలు జిల్లాకు కేటాయించడం జరిగిందని, ఈ నిధులు గనులు మూసి వేయబడిన ప్రాంతాలలో వినియోగించి అభివృద్ధి కార్యక్రమాలు అమలు అయ్యేలా చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) పి.చంద్రయ్య, గనులు భూగర్భ శాఖ ఎ.డి. జగన్ మోహన్, సింగరేణి సంస్థ శ్రీరాంపూర్ ఏరియా ఇన్చార్జి జి.ఎం. సిహెచ్. వెంకటేశ్వర్లు, ఎస్టేట్స్ మేనేజర్లు వరలక్ష్మి, సింగరేణి పర్యావరణ విభాగం అడిషనల్ మేనేజర్ హనుమాన్ గౌడ్, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు

# కరీంనగర్ కార్పొరేషన్‌లో కాంగ్రెస్ జెండా ఎగరాలి

- అభ్యర్థుల ఎంపికకు సమర్థత ఆధారంగా సర్వే
- డిసిసి సమావేశంలో మంత్రి పొన్నం ప్రభాకర్



కరీంనగర్, జనవరి 28 (జనంసాక్షి) : కరీంనగర్ కార్పొరేషన్ లో కాంగ్రెస్ జెండా ఎగురవేయాలని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. కరీంనగర్ కార్పొరేషన్ లో అభ్యర్థుల ఎంపికకు 66 సీట్లలో సర్వే జరుగుతుందని.. ఎవరికివారు అంచనా వేసుకోండని ఆశావహులకు సూచించారు. బుధవారం కరీంనగర్ డీసీసీ ఆఫీసులో మున్సిపల్ ఎన్నికల్లో పోటీకి ఆశావహులతో జరిగిన సమావేశంలో మంత్రి పొన్నం ప్రభాకర్ పాల్గొన్నారు. ఈ సమావేశంలో మాట్లాడుతూ కీలక వ్యాఖ్యలు చేశారు పొన్నం ప్రభాకర్. ప్రజా పాలన ప్రభుత్వం లో సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో గ్రామాల వలె పట్టణాల అభివృద్ధికి సమగ్ర ప్రణాళికతో ముందుకు పోతున్నామని అన్నారు. ఇప్పటికే పట్టణాల్లో అభివృద్ధి కార్యక్రమాలు కొనసాగు తున్నాయని... రాష్ట్రంలో ఎక్కడికెళ్లినా ప్రజా పాలనపై ప్రజలు పాజిటివ్ గా ఉన్నారని.. కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు ప్రజల్లో వివరిస్తూ పార్టీ గెలుపు కోసం కృషి చేయాలని అన్నారు. ప్రభుత్వం ఏర్పడిన 48 గంటల్లో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం ప్రారంభించామని.. ఇప్పటి వరకు ప్రభుత్వం ఆర్టీసీకి 9 వేల కోట్లు చెల్లించిందని అన్నారు. 200 యూనిట్ల ఉచిత విద్యుత్,సన్న బియ్యం పంపిణీ,నూతన రేషన్ కార్డులు పంపిణీ, రైతులకు రైతు భరోసా, రైతు రుణమాఫీ, ఉద్యోగాల నియామకాలు , సన్న వడ్లు బోనస్, మహిళా సంఘాలకు వడ్డీలేని రుణాలు, నియోజకవర్గానికి 3, 500 ఇందిరమ్మ ఇళ్లు మంజూరు, లాంటి ఎన్నో పథకాలు అమలు చేస్తుందని అన్నారు. పోటీ చేసే ఆశావహులు వార్డుల్లో తిరుగుతూ బలోపేతం చేయాలని..టికెట్ ఎవరికి వచ్చినా..అందరూ కలిసి సమన్వయం చేసుకుంటూ గెలవాలని అన్నారు. రాజకీయాల్లో విశేష అనుభవం ఉన్న తుమ్మల నాగేశ్వరరావు కరీంనగర్ ఇంచార్జి గా ఉన్నారని..సెలెక్ట్ ఎలెక్ట్ ద్వారా మీకు మీరే వార్డుల్లో అభ్యర్థులను ఎంపిక చేసుకోవాలని అన్నారు. కరీంనగర్ కార్పొరేషన్ కాంగ్రెస్ కైవసం చేసుకునేలా కృషి చేయాలని పొన్నం ప్రభాకర్ అన్నారు.

# దామెరగుట్టపై చెలరేగిన మంటలు

- చాకచక్యంగా మంటలు అర్పిన ఫైర్ సిబ్బంది



వరంగల్ ఈస్ట్, జనవరి 28 (జనం సాక్షి) : వరంగల్ నగర సమీపంలోని అమ్మవారిపేట శ్రీ సమ్మక్క,సారలమ్మ జాతర లో భాగంగా బుధవారం రాత్రి సారలమ్మ అమ్మవారిని గద్దె మదికి తీసుకువచ్చు సమయంలో ఉత్సవ కమిటీ వారు టపాసులు కాల్చడం వల్ల పక్కనే ఉన్న దామెర గుట్టలో తారజువ్వాళ్ళు పడి అగ్నిప్రమాదం జరిగింది. ఇట్టి సమయములో పక్కనఉన్న ఫైర్ సిబ్బంది ఎంతో చాకచక్యంగా చాలా కష్టపడి పెద్ద ప్రమాదం కాకుండా ఆర్పివేశారు. ఫైర్ సిబ్బంది రవీందర్, వినోద్, వంశీ వారిని స్థానికంగా బందోబస్తుకు వచ్చిన పోలీసులు, ప్రజలు, భక్తులు అభినందించారు.


# మేడారంలో ఫస్ట్ రెస్పాండర్ 108 బైక్ అంబులెన్స్‌లు

- భక్తుల భద్రతకు 40 మొబైల్ అంబులెన్స్‌ల ఏర్పాటు

ములుగు, జనవరి28 (జనంసాక్షి) : శ్రీ సమ్మక్క–సారలమ్మ మేడారం మహాజాతర సందర్భంగా భక్తులకు తక్షణ వైద్య సహాయం అందించేందుకు జిల్లా యంత్రాంగం ఫస్ట్ రెస్పాండర్ 108 బైక్ అంబులెన్స్ సేవలను విస్తృతంగా ఏర్పాటు చేసింది. మేడారం జాతర ప్రాంతమంతటా మొత్తం 40 ఫస్ట్ రెస్పాండర్ 108 బైక్ అంబులెన్స్‌లను వివిధ కీలక ప్రాంతాల్లో మోహరించారు. భారీ రద్దీ ఉన్న ప్రాంతాల్లోనూ వేగంగా చేరుకుని వైద్య సహాయం అందించేందుకు వీలుగా ఈ బైక్ అంబులెన్స్‌లను ఏర్పాటు చేసినట్లు అధికారులు తెలిపారు. ఈ మొబైల్ 108 సేవల ద్వారా జ్వరం, తలనొప్పి, వాంతులు, అలసట వంటి స్వల్ప ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్న భక్తులకు తక్షణ ఫస్ట్ ఎయిడ్‌తో పాటు అవసరమైన ప్రాథమిక మందులు అందిస్తున్నారు. అలాగే, పరిస్థితి విషమంగా ఉన్న సందర్భాల్లో భక్తులను వెంటనే సమీప ఆసుపత్రులకు తరలించే ఏర్పాట్లు కూడా చేసినట్లు తెలిపారు. జాతర కాలమంతా ఈ సేవలు నిరంతరంగా అందుబాటులో ఉంటాయని అధికారులు వెల్లడించారు. భక్తుల భద్రత, ఆరోగ్య పరిరక్షణెళి లక్ష్యంగా జిల్లా యంత్రాంగం పగడ్బందీ చర్యలు చేపట్టింది.

# పేదల నోరు కొడుతున్న ప్రధాని మోడీ

- ఉపాధిని మార్చడంపై నిరసనలో మహేశ్ కుమార్



మెదక్, జనవరి28 (జనంసాక్షి) : ప్రధాని మోడీ పేదవాళ్ళ నోటికాడి ముద్దను లాక్కోవాలని చూస్తున్నాడని టీ పీసీసీ చీఫ్ అధ్యక్షులు మహేశ్ కుమార్ గౌడ్ ఫైర్ అయ్యారు. జాతీయ ఉపాధి హామీ చట్టం పథకం నుంచి మహాత్మా గాంధీ పేరును తొలగించడాన్ని ఖండిస్తూ మెదక్ జిల్లాలో నరేగా బచావో, బీజేపీ హటావో నినాదంతో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన.. మోడీ గరీబోళ్లను కష్ట డుతున్నారని అన్నారు. గరిబోళ్ళకోసం సోనియా గాంధీ అనంతపురం పర్యటనలో ఉన్నపుడు పనికి ఆహార పథకం తీసుకొచ్చారని చెప్పారు. అనంతరపురంలో అన్ని ఇళ్లకు తాళాలు ఉంటే...సోనియా గాంధీ మన్మోహన్ సింగ్ కు చెప్పి పనికి ఆహార పథకాన్ని మొదలు పెట్టారని చెప్పారు. గ్రామ జనం పటిష్టంగా ఉంటే గ్రామాలు సౌభాగ్యంగా ఉంటాయన్నారు. కానీ మోడీ, అదానీ, అంబానీల కోసం పనికి ఆహర పథకాన్ని తొలగించాలని చూస్తున్నారని విమర్శించారు. పనికి ఆహర పథకం కోసం సోనియా గాంధి, రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ పార్లమెంట్ లో పోరాటం చేస్తున్నారని చెప్పారు. ఫిబ్రవరి నాటికి గ్రామీణ ఉపాధీ హామీ పథకం తీసుకొచ్చి 20 ఏళ్లు పూర్తవుతుందన్నారు. కాంగ్రెస్ పార్టీ గరిబోళ్ల పార్టీ, ఎస్సీ,ఎస్టీ ,బీసీల వెనుక కాంగ్రెస్ పార్టీ ఉంటుంది. మోడీకి వ్యతిరేకంగా గ్రామాల్లో మహిళలు ముందుకు సాగాలని మహేహ్ కుమర్ పిలుపునిచ్చారు.

జనంసాక్షి
www.janamsakshi.org
గురువారం
29 జనవరి 2026

# ఈయూ-భారత్ వాణిజ్య ఒప్పందం

## ఎగుమతుల ఊపు.. అమెరికా ఆందోళన

యూరోపియన్ యూనియన్...భారత్ భారీ వాణిజ్య ఒప్పందం(ఫ్రీ ట్రేడ్ అగ్రిమెంట్ (ఎఫ్‌టిఏ) చర్చలు తిరిగి వేగం పుంజుకోవడం భారత్ ఆర్థిక, వ్యూహాత్మక దిశలో ఒక కీలక మలుపుగా కనిపిస్తోంది. ప్రపంచ వాణిజ్యంలో అనిశ్చితులు పెరుగుతున్న వేళ, బహుళ ధ్రువాల ప్రపంచంలో భారత్ తనకు అనుకూలమైన భాగస్వామ్యాలను వెతుక్కుంటోంది. ఈయూ-భారత్ ఒప్పందం అందించే అవకాశాలు ఒక వైపు ఆశాజనకంగా ఉంటే, మరో వైపు అమెరికాతో సంబంధాల్లో కొత్త ఒత్తిడులకు దారితీయవచ్చన్న అంచనాలు కూడా సమాంతరంగా ఉన్నాయి.



భారత్‌కు ఈ ఒప్పందం వల్ల కలిగే ప్రధాన ప్రయోజనం ఎగుమతుల విస్తరణ. ఈయూ ప్రపంచంలోనే అతిపెద్ద వినియోగ మార్కెట్లలో ఒకటి. భారత టెక్స్‌టైల్స్, ఔషధాలు, ఆటోమొబైల్ భాగాలు, ఐటీ సేవలు, వ్యవసాయ ఉత్పత్తులకు సుంకాల తగ్గింపు లేదా రద్దు జరిగితే, భారత ఎగుమతులకు భారీ ఊపొస్తుంది. ముఖ్యంగా చిన్న, మధ్య తరహా పరిశ్రమలకు ఇది కొత్త అవకాశాల ద్వారం అవుతుంది. ఇప్పటికే పోటీతో ఇబ్బంది పడుతున్న రంగాలకు యూరోపియన్ మార్కెట్‌లో ప్రవేశం లభిస్తే, ఉపాధి సృష్టి కూడా గణనీయంగా పెరుగుతుంది. 'మేక్ ఇన్ ఇండియా' లక్ష్యాలకు ఇది అనుకూలంగా మారవచ్చు.

విదేశీ పెట్టుబడుల పరంగా కూడా ఈ ఒప్పందం కీలకం. యూరోపియన్ కంపెనీలు భారత్‌ను ఉత్పత్తి కేంద్రంగా మార్చే ఆసక్తి చూపుతున్నాయి. సరఫరా గొలుసులను చైనా మీద ఆధారపడకుండా విభిన్నీకరించాలన్న యూరోపియన్ వ్యూహానికి భారత్ సరైన ప్రత్యామ్నాయం. ఈ నేపథ్యంలో ఈయూ పెట్టుబడులు భారత మౌలిక వసతులు, గ్రీన్ ఎనర్జీ, ఎలక్ట్రిక్ వాహనాలు, సెమీకండక్టర్లు వంటి రంగాల్లోకి రావచ్చు. ఇది కేవలం ఆర్థిక లాభం మాత్రమే కాదు; సాంకేతిక పరిజ్ఞానం, నైపుణ్యాభివృద్ధి పరంగానూ భారత్‌కు ఉపయోగపడుతుంది.

అయితే ఈ ఒప్పందం పూర్తిగా లాభాల పుస్తకమే కాదు. ఈయూ పెట్టే ప్రమాణాలు భారత్‌కు సవాళ్లుగా మారే అవకాశముంది. కార్మిక హక్కులు, పర్యావరణ ప్రమాణాలు, డేటా రక్షణ, కార్బన్ ఉద్గారాల నియంత్రణ వంటి అంశాల్లో యూరోపియన్ ప్రమాణాలు కఠినంగా ఉంటాయి. భారత పరిశ్రమలు, ముఖ్యంగా సంప్రదాయ తయారీ రంగాలు, ఈ ప్రమాణాలను పాటించడంలో అదనపు ఖర్చును భరించాల్సి వస్తుంది. కార్బన్ బోర్డర్ అడ్జస్ట్మెంట్ మెకానిజం వంటి విధానాలు భారత ఉత్పత్తుల పోటీ సామర్థ్యాన్ని కొంత మేర తగ్గించే ప్రమాదం కూడా ఉంది.

ఈ ఒప్పందం ప్రభావం కేవలం ఈయూ-భారత్ మధ్యే పరిమితం కాదన్నది మరో ముఖ్య అంశం. అమెరికా దృష్టిలో ఇది ఒక వ్యూహాత్మక పరిణామంగా మారవచ్చు. ఇప్పటివరకు భారత్...అమెరికా వాణిజ్య సంబంధాలు సహకారం, వివాదాల మిశ్రమంగా కొనసాగుతున్నాయి. వీసా విధానాలు, డిజిటల్ పన్నులు, వ్యవసాయ మార్కెట్ ప్రవేశం, ఔషధ ధరల నియంత్రణ వంటి అంశాల్లో అమెరికా ఇప్పటికే అసంతృప్తి వ్యక్తం చేసింది. ఈయూతో భారత్ లోతైన వాణిజ్య భాగస్వామ్యం కుదుర్చుకుంటే, అమెరికా తన మార్కెట్ ప్రాధాన్యత తగ్గుతోందన్న భావనకు లోనయ్యే అవకాశం ఉంది.

ప్రత్యేకించి టెక్నాలజీ, డిజిటల్ ఎకానమీ రంగాల్లో అమెరికా...యూరోప్ మధ్య ఉన్న అంతర్గత పోటీని భారత్ వినియోగించుకుంటే, అమెరికా ఒత్తిడి పెంచే అవకాశం ఉంది. వాణిజ్య పరిమితులు, సుంకాల పెంపు, లేదా భారత ఉత్పత్తులపై నాన్-టారిఫ్ బ్యారియర్లు విధించే ప్రయత్నాలు జరిగే ప్రమాదం పూర్తిగా తోసిపుచ్చలేం. గతంలో స్టీల్, అల్యూమినియం వంటి రంగాల్లో అమెరికా తీసుకున్న చర్యలు దీనికి ఉదాహరణలుగా నిలుస్తాయి. అయితే మరో కోణంలో చూస్తే, ఈయూ...భారత్ ఒప్పందం అమెరికాతో భారత్‌కు ఒక చర్చా బలాన్ని కూడా ఇస్తుంది. ఒకే దేశంపై ఆధారపడకుండా బహుళ భాగస్వామ్యాలు ఏర్పరుచుకోవడం భారత్ దీర్ఘకాలిక ప్రయోజనాలకు అనుకూలం. ప్రపంచ రాజకీయాలు వేగంగా మారుతున్న వేళ, వ్యూహాత్మక స్వయం ప్రతిపత్తి అన్న భావన కేవలం సైనిక రంగానికే పరిమితం కాకుండా వాణిజ్య, ఆర్థిక రంగాల్లోనూ కీలకంగా మారింది. ఈయూ ఒప్పందం భారత్‌కు ఆ స్వయం ప్రతిపత్తిని కొంత మేర బలపరుస్తుంది.

విమర్శనాత్మకంగా చూస్తే, అసలు ప్రశ్న ఒప్పందం ఉందా లేదా అన్నది కాదు; దాని నిబంధనలు ఎవరి ప్రయోజనాలకు ఎక్కువగా పనిచేస్తాయన్నదే. భారత్ తన వ్యవసాయ రంగాన్ని, చిన్న పరిశ్రమలను రక్షించుకుంటూనే, అంతర్జాతీయ మార్కెట్లకు తలుపులు తెరవాల్సిన సున్నిత సమతుల్యతను సాధించాలి. అతి ఆశావాదం గానీ, అతి భయపడటం గానీ కాకుండా, వాస్తవికంగా ప్రతి నిబంధనను విశ్లేషించి నిర్ణయాలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.

మొత్తానికి, ఈయూ...భారత్ భారీ వాణిజ్య ఒప్పందం భారత్‌కు ఒక పెద్ద అవకాశం. అదే సమయంలో ఇది అమెరికాతో సంబంధాల్లో కొత్త ప్రశ్నలను కూడా తెరపైకి తెస్తుంది. అవకాశాలను అందిపుచ్చుకుంటూ, భౌగోళిక రాజకీయ ఒత్తిడులను సమతుల్యం చేసే నైపుణ్యం భారత్‌కు ఎంతవరకు ఉందన్నదే ఈ ఒప్పందం నిజమైన ఫలితాన్ని నిర్ణయించ నుంది. ఆర్థిక లాభాలకే పరిమితం కాకుండా, దీర్ఘకాలిక వ్యూహాత్మక దృష్టితో ఈ ఒప్పందాన్ని చూసినప్పుడే భారత్‌కు నిజమైన విజయం సాధ్యమవుతుంది.



డాక్టర్ కోలాహలం
రామ్ కిశోర్
9849328496.



### యుద్ధం కాదిది..

ఇరుపక్షాలూ
ఒకే ఆయుధ
సంపత్తీ
సమాన
అవకాశాలూ..

కలిగి ఉన్నప్పుడు చేసిన యుద్ధమే
నిజమైన యుద్ధం..
అదే నిజమైన వీరత్వమూ..
నిజమైన గెలుపు కూడా..!
లా కానప్పుడు
ఏకాలంలో చేసినా..
ఎవరు చేసినా..
అది యుద్ధమూ కాదు
శౌర్యం అసలు కాదు..

ఎప్పటెప్పటి పురాణకాండ
గాథల్లో అయినా
ఇప్పటి కగారు మారణకాండలో
అయినా
అది ఫక్తు నీతి లేని దొంగ దాడే..!!

- డాక్టర్. ఇక్బాల్ పాషా
9440775732

# తెలుగు కవిత్వంలో "బాల్య" చిత్రణ

బాల్యం అనేది మానవ జీవితంలో అత్యంత కీలకమైన దశ. వ్యక్తిత్వ నిర్మాణానికి మూల బీజం బాల్యమే.సుఖదుఃఖాల మేళవింపుగా, అనుభూతుల నిధిగా, స్మృతుల కొలిమిగా బాల్యం మనిషి అంతర్మనసులో నిలిచిపోతుంది. తెలుగు కవిత్వంలో బాల్యం ఒక శక్తివంతమైన కవితా వస్తువుగా అవతరించింది.ప్రాచీన కాలం నుంచి ఆధునిక యుగం వరకు కవులు తమ అనుభవాలు, జ్ఞాపకాలు, సామాజిక అవగాహనలతో బాల్యాన్ని వివిధ కోణాల్లో ఆవిష్కరించారు.

**బాల్యం- భావనాత్మక నేపథ్యం**

బాల్యం అనేది కేవలం వయస్సుతో సంబంధం ఉన్న దశ కాదు. అది మనసుకు సంబంధించిన అనుభూతి స్థితి. జీవన పయనంలో ఎదురయ్యే సంఘర్షణల మధ్య మనిషి తిరిగి చేరుకోవాలనుకునే స్వచ్ఛమైన లోకం బాల్యమే. బాల్యంలో కనిపించే నిరాడంబరత, అమాయకత్వం, స్వచ్ఛత, ఆత్మీయతలు మానవ జీవనానికి మూల ఆధారాలుగా నిలుస్తాయి.తెలుగు సాహిత్యంలో బాల్య భావన ప్రాచీన కావ్యాల నుంచే కనబడుతుంది. అయితే ఆధునిక కవిత్వంలో బాల్యం ఒక స్వతంత్ర ఇతివృత్తంగా వికసించింది. ముఖ్యంగా సామాజిక అసమానతలు, పేదరికం, బాల కార్మిక వ్యవస్థ, బాల్యంపై జరిగిన దాడులు వంటి అంశాలు ఆధునిక కవులను గాఢంగా స్పందింపజేశాయి (రామకృష్ణ, "తెలుగు ఆధునిక కవిత్వంలో ఇతివృత్త పరిణామం", విశాలాంధ్ర సాహిత్య విమర్శ వ్యాసాలు).

లిదాశరథి కృష్ణమాచార్యుల బాల్య దృష్టి

దాశరథి కృష్ణమాచార్యులు బాల్యాన్ని శక్తి, సృజనాత్మకత, దైవిక స్వచ్ఛతతో కూడిన స్థితిగా భావిస్తారు. "బాలుడు చేసే పని దేవుడు కూడా చేయలేడు" అన్న వారి భావన బాల్యంలోని అప్రతిహత శక్తిని సూచిస్తుంది. ఇది బాలుడి అమాయకత్వంలో దాగిన అపార సామర్థ్యాన్ని ప్రతిబింబిస్తుంది. దాశరథి రచనలలో బాల్యం కేవలం జ్ఞాపకంగా మాత్రమే కాక సామాజిక చైతన్యానికి మూలంగా కూడా అవతరిస్తుంది. బాల్యంలోని నిర్భయత్వం, నిజాయితీ, ధైర్యం సమాజ పరివర్తనకు దోహదపడతాయన్న భావన ఆయన కవిత్వంలో పునఃపునః దర్శనమిస్తుంది.

**సినారె (సి. నారాయణరెడ్డి) - నాస్టాల్జిక్ బాల్యం**

సినారె కవిత్వంలో బాల్యం ఒక నాస్టాల్జిక్ ప్రపంచం.

"నా సర్వస్వం నీకూ ఇచ్చేస్తా.. నా బాల్యం నాకూ ఇచ్చే"

అన్న పంక్తులు బాల్య జ్ఞాపకాల పట్ల ఆయనకున్న గాఢమైన ఆకాంక్షను తెలియజేస్తాయి.ఇక్కడ బాల్యం అనేది మానవ జీవితంలో తిరిగి లభించని అమూల్య సంపదగా దర్శనమిస్తుంది. జీవన పోరాటాలలో అలసిపోయిన మనసు తిరిగి చేరుకోవాలనుకునే స్వచ్ఛమైన లోకం బాల్యమే. ఈ భావన ఆధునిక కవిత్వంలో బలంగా ప్రతిధ్వనిస్తుంది

**గోపీ - విమర్శాత్మక బాల్య భావన**

గోపీ గారి కవితలో బాల్యం ఒక ద్వంద్వాత్మక భావనగా వ్యక్తమవుతుంది. "బాల్యం కావాలా అని ఎవరైనా అడిగితే వద్దు వద్దని అంటాను మళ్ళీ దాన్ని దాటిఇక్కడికే గానీ రావలసింది" ఈ కవితలో బాల్యం పట్ల ఒక రకమైన నిరాకరణ కనిపించినా, అది జీవన అనుభవాల నుంచి పుట్టిన తాత్విక దృష్టి. బాల్యం అంటే అమాయకత్వం, కానీ అదే సమయంలో అనుభవాల లేమి. కవి జీవితంలోని కష్టసుఖాలను అనుభవించిన తర్వాత, తిరిగి బాల్యానికి వెళ్లడం అర్థరహితమని భావిస్తాడు. ఇది ఆధునిక కవిత్వంలోని యథార్థ దృష్టిని ప్రతిబింబిస్తుంది

**దేవులపల్లి కృష్ణశాస్త్రి - లాలిత్యభరిత బాల్యం**

దేవులపల్లి కృష్ణశాస్త్రి కవిత్వంలో బాల్యం లాలిత్యంతో, మృదుత్వంతో, సౌందర్యంతో పరిపుష్టమవుతుంది. ప్రకృతి, తల్లి ప్రేమ, పల్లెటూరి వాతావరణం, ఆటపాటల మాధుర్యం ఆయన కవితల్లో బాల్యాన్ని సుందరంగా చిత్రిస్తాయి.ఇక్కడ బాల్యం అనేది సామాజిక బాధలకన్నా వ్యక్తిగత అనుభూతుల లోకంగా ఆవిష్కృతమవుతుంది.

**ఆధునిక కవిత్వంలో బాల్య ఇతివృత్త పరిణామం**

సమకాలీన కవిత్వంలో బాల్యం కేవలం స్మృతిగా కాక సామాజిక సమస్యల ప్రతిబింబంగా మారింది. బాల కార్మికత్వం, పేదరికం, బాలికలపై జరుగుతున్న దాడులు వంటి అంశాలు బాల్య భావనను తీవ్రమైన సామాజిక విమర్శగా మలిచాయి.ఇది కవిత్వాన్ని వ్యక్తిగత స్థాయిలోనుంచి సామాజిక స్థాయికి తీసుకువచ్చిన పరిణామంగా గుర్తించవచ్చు.

**బాల్యం - అనుభూతి, అనుభవం, సంఘర్షణ**

బాల్యం అంటే సహజంగా ఆనందం, అమాయకత్వం, ఆటపాటలు అనే భావనలు మనకు గుర్తుకు వస్తాయి. అయితే సామాజిక వాస్తవికతలో బాల్యం అనేక సందర్భాలలో బాధ, ఆకలి, భయం, అనిశ్చితి, హింసలకు లోనవుతోంది. ఈ విరుద్ధతనే ఆధునిక కవులు తమ కవితా వస్తువుగా స్వీకరించారు.

**ముస్లిం పేదరికంలో బాల్యం -- మర్ఫా 'స్కైబాబా'**

మర్ఫా రాసిన స్కైబాబా కవిత ముస్లిం పేద కుటుంబాలలోని బాల్య జీవితాన్ని హృదయవిదారకంగా చిత్రిస్తుంది. మత గుర్తింపు, ఆర్థిక దారిద్ర్యం కలిసి బాల్యాన్ని ఎలా అణచివేస్తాయో ఈ కవితలో గాఢంగా ప్రతిఫలిస్తుంది. బాలుడు తన ఆకలిని, తన కలలను అణచుకొని జీవించాల్సిన పరిస్థితిని కవి తీవ్రమైన ప్రతీకల ద్వారా వ్యక్తపరుస్తాడు.

**మతహింస - బాల్యంపై మచ్చ: యాకూబ్ 'పౌరసత్వం పై మచ్చ'**

యాకూబ్ రాసిన పౌరసత్వం పై మచ్చ కవిత గుజరాత్ సంఘటనల నేపథ్యంలో బాల్యంపై పడిన మానసిక గాయాలను ప్రతిబింబిస్తుంది. మత ఘర్షణలలో చిన్నపిల్లలు ఎలా అనాథలవుతారో, వారి బాల్యం ఎలా కాలిపోతుందో కవి సూటిగా చిత్రించాడు.బాల్యం ఇక్కడ ఒక శాశ్వత గాయంగా మారుతుంది. ఈ కవిత ఆధునిక భారత సమాజంలోని సామాజిక అసమానతలను, మత రాజకీయాల క్రూరత్వాన్ని బయటపెడుతుంది

**ప్రపంచీకరణ ప్రభావం - వసీరా 'చూపు'**

వసీరా రాసిన చూపు కవిత ప్రపంచీకరణ నేపథ్యంలో బాల్య మనసుపై పడుతున్న ప్రభావాన్ని విశ్లేషిస్తుంది. వినియోగ సంస్కృతి, పోటీ ప్రపంచం, మార్కెట్ దృష్టి బాల్యాన్ని ఎలా యాంత్రికంగా మార్చుతున్నాయో ఈ కవితలో స్పష్టంగా కనిపిస్తుంది. బాలుడు ఇక ప్రకృతిలో ఆడుకునే వాడిగా కాక, వినియోగదారుడిగా మారుతున్న దుస్థితిని కవి ఆవేదనతో వ్యక్తం చేస్తాడు

**నిద్రిస్తున్న శిశువు - శిఖామణి 'వైశాలి నిద్ర'**

శిఖామణి రాసిన వైశాలి నిద్ర కవితలో నిద్రిస్తున్న శిశువు ప్రతీకగా మారుతుంది. ఆ నిద్రలో భవిష్యత్ కలలు, ఆశలు, భయాలు అన్నీ దాగి ఉంటాయి. ఈ కవితలో లాలిత్యంతో పాటు లోతైన తాత్వికత కనిపిస్తుంది. శిశువు నిద్ర సమాజపు నిర్లక్ష్యాన్ని కూడా సూచిస్తుంది. అలంకార పరంగా రూపకాలు, ప్రతీకలు ప్రధానంగా వినియోగించబడ్డాయి

**టీవీ ప్రభావం - ఆశారాజు 'ఉరితాడు'**

ఆశారాజు ఉరితాడు కవిత ఆధునిక మీడియా ముఖ్యంగా టీవీ బాల్యాన్ని ఎలా హింసిస్తున్నదో గాఢంగా చిత్రిస్తుంది. హింసాత్మక దృశ్యాలు, వినియోగ ప్రకటనలు బాల్య మనసును విషపూరితం చేస్తున్నాయని కవి సూచిస్తాడు. 'ఉరితాడు' అనే ప్రతీక ద్వారా మీడియా బాల్యాన్ని బంధిస్తున్న తీరును విశ్లేషించాడు.

**శిశుపై హింస - సిరా 'కబేళా'**

సిరా రాసిన కబేళా కవితలో పసికందును కుక్కలు పీక్కొని తినడం అనే భయానక దృశ్యాన్ని ఆధారంగా చేసుకొని సమాజంలోని నిర్లక్ష్యాన్ని, మానవత్వ పతనాన్ని తీవ్రంగా విమర్శిస్తాడు. బాల్యం ఇక్కడ పూర్తిగా నాశనం చేయబడిన స్థితిలో దర్శనమిస్తుంది. ఇది ఆధునిక కవిత్వంలోని అత్యంత శక్తివంతమైన సామాజిక విమర్శగా నిలుస్తుంది.

**బాల్య వ్యభిచారం - రవీంద్ర 'చీకట్లో సూర్యుడు'**

రవీంద్ర చీకట్లో సూర్యుడు కవిత బాల్య దశలోనే వ్యభిచారానికి బలవుతున్న బాలికల జీవితాన్ని హృదయవిదారకం గా చిత్రిస్తుంది. 'చీకట్లో సూర్యుడు' అనే ప్రతీక ద్వారా బాలికలలో మిగిలిన చిన్న ఆశకిరణాన్ని సూచిస్తాడు. ఈ కవిత సామాజిక వ్యవస్థపై తీవ్రమైన ప్రశ్నలు వేస్తుంది.

తరువాయి
మరో
సంచికలో...

డా. ఐ. చిదానందం
తెలుగు అధ్యాపకులు
చరవాణి - 8801444335



# కేంద్ర బడ్జెట్ : భారత ఆర్థిక చరిత్రలో కీలక

భారతదేశ ఆర్థిక చరిత్రలో కేంద్ర బడ్జెట్‌కు ప్రత్యేకమైన స్థానం ఉంది. స్వతంత్ర భారతం తన ఆర్థిక దిశను ప్రపంచానికి ప్రకటించే ప్రధాన పత్రం ఇదే. ఈ బడ్జెట్ ప్రయాణం కాలక్రమంలో ఎన్నో మార్పులు, రికార్డులు, విశేషాలతో ఒక కథలా రూపుదిద్దుకుంది.

స్వతంత్ర భారతదేశంలో తొలి కేంద్ర బడ్జెట్‌ను 1947 నవంబర్ 26న దేశ తొలి ఆర్థిక మంత్రి ఆర్.కె. షణ్ముఖం శెట్టి ప్రకటించారు. బ్రిటిష్ పాలన నుంచి బయటపడి, స్వతంత్ర ఆర్థిక వ్యవస్థను నిర్మించుకోవాల్సిన అత్యంత కీలక దశలో వచ్చిన ఆ బడ్జెట్ భారత ఆర్థిక విధానాలకు పునాది వేసింది. ఆదాయం--వ్యయం మధ్య సమతుల్యత, అభివృద్ధి లక్ష్యాలు, సామాజిక న్యాయం వంటి అంశాలు అప్పుడే చర్చలోకి వచ్చాయి.

కేంద్ర బడ్జెట్ చరిత్రలో అత్యధికసార్లు బడ్జెట్‌ను పార్లమెంట్‌లో ప్రవేశపెట్టిన ఆర్థిక మంత్రిగా మొరార్జీ దేశాయ్‌కు ప్రత్యేక గుర్తింపు ఉంది. జవహర్లాల్ నెహ్రూ, లాల్ బహదూర్ శాస్త్రి ప్రధాన మంత్రులుగా ఉన్న సమయంలో ఆయన ఆర్థిక మంత్రిగా పనిచేశారు. మొత్తం 10సార్లు కేంద్ర బడ్జెట్‌ను ఆయన ప్రవేశపెట్టారు. 1959 నుంచి 1964 మధ్య 6సార్లు, 1967 నుంచి 1969 మధ్య మరో 4సార్లు బడ్జెట్‌ను దేశాయ్ ప్రకటించారు. ఆయన తొలి బడ్జెట్‌ను 1959 ఫిబ్రవరి 28న ప్రవేశపెట్టారు. 1962లో ఒకసారి మధ్యంతర బడ్జెట్‌ను కూడా ఆయన తీసుకొచ్చారు. తర్వాతి కాలంలో 1987లో మరోసారి మధ్యంతర బడ్జెట్‌ను ప్రవేశపెట్టడం విశేషం. ఇలా భారత ఆర్థిక చరిత్రలో ఆయన పేరు చెరగని ముద్ర వేసింది.

ఆ తర్వాతి తరంలో బడ్జెట్ చరిత్రలో ముఖ్యమైన స్థానం దక్కించుకున్న మరో ఆర్థిక మంత్రి పీ.చిదంబరం. ఆయన మొత్తం 9సార్లు కేంద్ర బడ్జెట్‌ను ప్రవేశపెట్టారు. యునైటెడ్ ఫ్రంట్ ప్రభుత్వ హయాంలో హెచ్.డి.దేవేగౌడ ప్రధాన మంత్రిగా ఉన్నప్పుడు 1996--1998 మధ్య కాలంలో చిదంబరం తన తొలి బడ్జెట్‌ను ప్రవేశపెట్టారు. అనంతరం కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత 2004 నుంచి 2008 మధ్య వరుసగా బడ్జెట్‌లు ప్రవేశపెట్టారు. అలాగే 2013, 2014 సంవత్సరాల్లో మరో 2సార్లు బడ్జెట్‌ను పార్లమెంట్‌లో ఉంచారు. సంస్కరణలు, పన్ను విధాన మార్పులు, గ్లోబలైజేషన్‌కు అనుగుణమైన ఆర్థిక నిర్ణయాలతో చిదంబరం బడ్జెట్‌లు ప్రత్యేక గుర్తింపు పొందాయి.

ప్రణబ్ ముఖర్జీ కూడా కేంద్ర బడ్జెట్ చరిత్రలో కీలక వ్యక్తి. ఆయన మొత్తం 7సార్లు కేంద్ర బడ్జెట్‌ను ప్రవేశపెట్టారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో 1982 నుంచి 1984 మధ్య 2సార్లు, అలాగే 2009 నుంచి 2012 వరకు వరుసగా 5సార్లు బడ్జెట్‌ను ప్రకటించారు. ఆర్థిక స్థిరత్వం, సామాజిక సంక్షేమం, వృద్ధి మధ్య సమతుల్యత ఆయన బడ్జెట్‌లలో ప్రధాన లక్షణంగా కనిపించింది.

ఇక మన్మోహన్ సింగ్ ప్రధానమంత్రిగా మారే ముందు ఆర్థిక మంత్రిగా ఉన్న కాలం భారత ఆర్థిక చరిత్రలో మైలురాయి. 1991 నుంచి 1995 మధ్య కాలంలో ఆయన వరుసగా బడ్జెట్‌లను ప్రవేశపెట్టారు.

బడ్జెట్ ప్రసంగాల విషయానికి వస్తే కూడా చరిత్రలో ఆసక్తికరమైన ఘట్టాలు ఉన్నాయి. 2020 ఫిబ్రవరి 1న నిర్మలా సీతారామన్ లోక్‌సభలో బడ్జెట్‌ను ప్రవేశపెడుతూ 2 గంటల 40 నిమిషాల పాటు ప్రసంగించారు. ఇది ఇప్పటివరకు జరిగిన అత్యంత సుదీర్ఘ బడ్జెట్ ప్రసంగంగా రికార్డులకెక్కింది. మరోవైపు 1977లో హీరూభాయ్ ముల్జీభాయ్ పటేల్ ప్రవేశపెట్టిన మధ్యంతర బడ్జెట్ మాత్రం అత్యంత సంక్షిప్త ప్రసంగంగా చరిత్రలో నిలిచిపోయింది.ఈ విధంగా చూస్తే, కేంద్ర బడ్జెట్ కేవలం ఆర్థిక లెక్కల పత్రం మాత్రమే కాదు. అది కాలానుగుణంగా మారుతున్న రాజకీయ పరిస్థితులు, ఆర్థిక విధానాలు, ప్రజల ఆశలు-ఆకాంక్షలను ప్రతిబింబించే ఒక జీవంతమైన చరిత్ర. తొలి స్వతంత్ర బడ్జెట్ నుంచి నేటి డిజిటల్ యుగం వరకు సాగిన ఈ ప్రయాణం భారత ప్రజాస్వామ్య ఆర్థిక వ్యవస్థకు అద్దం పడుతోంది.




**సంప్రదాయాలు - మార్పుల వెనుక కథ:**

కేంద్ర బడ్జెట్ ప్రసంగాల విషయంలో సుదీర్ఘత ఎంత ముఖ్యమో, సంక్షిప్తత కూడా అంతే విశేషం. భారత బడ్జెట్ చరిత్రలో ఇప్పటివరకు అత్యంత స్వల్ప ప్రసంగం చేసిన ఆర్థిక మంత్రిగా హీరూభాయ్ ముల్జీభాయ్ పటేల్ గుర్తింపు పొందారు. ఆయన 1977లో ప్రవేశపెట్టిన మధ్యంతర బడ్జెట్‌ను కేవలం 800 పదాల్లోనే ముగించారు. ఇప్పటికీ ఇదే రికార్డుగా కొనసాగుతోంది. ఒకవైపు 2020లో నిర్మలా సీతారామన్ చేసిన 2 గంటల 40 నిమిషాల సుదీర్ఘ ప్రసంగం, మరోవైపు 800 పదాల్లో ముగిసిన ఈ ప్రసంగం-ఈ రెండూ భారత బడ్జెట్ చరిత్రలో ఆసక్తికరమైన విరుద్ధాలను చూపిస్తున్నాయి. సమయం విషయానికి వస్తే, స్వతంత్ర భారతదేశంలో చాలా కాలం పాటు కేంద్ర బడ్జెట్‌ను ఏటా ఫిబ్రవరి నెల చివరి రోజు, అంటే 28 లేదా 29 తేదీన, సాయంత్రం 5 గంటలకు పార్లమెంట్‌లో ప్రవేశపెట్టడం ఆనవాయితీగా ఉండేది. ఈ సంప్రదాయం పూర్తిగా బ్రిటిష్ పాలన ప్రభావంతో ఏర్పడింది. బ్రిటన్ వేసవి కాలమానం ప్రకారం ఆ దేశం కంటే భారత్ సుమారు 4:30 గంటలు ముందుంటుంది. అందువల్ల భారత్‌లో సాయంత్రం 5 గంటలంటే, బ్రిటన్‌లో అది మధ్యాహ్న సమయానికి సమానం అవుతుంది. బ్రిటిష్ పార్లమెంట్ బడ్జెట్ సమయానికి అనుగుణంగానే భారత్‌లోనూ ఈ సమయం కొనసాగింది. స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత కూడా అనేక సంవత్సరాల పాటు ఇదే పద్ధతి అమల్లో ఉండింది.

అయితే ఈ సంప్రదాయానికి 1988లో మార్పు వచ్చింది. అటల్ బిహారీ వాజపేయి ప్రభుత్వ హయాంలో అప్పటి ఆర్థిక మంత్రి యశ్వంత్ సిన్హా తొలిసారిగా కేంద్ర బడ్జెట్‌ను ఉదయం 11 గంటలకు పార్లమెంట్‌లో ప్రవేశపెట్టారు. ఈ మార్పు భారత కాలమానం, దేశీయ అవసరాలకు అనుగుణంగా తీసుకున్న నిర్ణయంగా భావించబడింది. అప్పటి నుంచి ఉదయం 11 గంటలకే బడ్జెట్ ప్రవేశపెట్టే విధానం కొనసాగుతోంది.తేదీ పరంగా కూడా కీలక మార్పు 2017లో జరిగింది. నరేంద్ర మోదీ నేతృత్వంలోని ప్రభుత్వం కేంద్ర బడ్జెట్ తేదీని ఫిబ్రవరి చివరి రోజు నుంచి ఫిబ్రవరి 1కి మార్చింది. ఈ నిర్ణయం వెనుక ప్రధాన కారణం బడ్జెట్ అమలు వేగవంతం చేయడమే. ఫిబ్రవరి 1న బడ్జెట్ ప్రవేశపెట్టడం వల్ల మార్చి చివర్లోగానే పార్లమెంట్ ఆమోద ప్రక్రియ పూర్తవుతోంది. ఫలితంగా ఏప్రిల్ 1 నుంచి ప్రారంభమయ్యే కొత్త ఆర్థిక సంవత్సరం నుంచే బడ్జెట్ అమలులోకి వస్తోంది. ఇది పాలనా పరంగా, ఆర్థిక నిర్వహణ పరంగా కీలకమైన మార్పుగా నిలిచింది.కేంద్ర బడ్జెట్‌కు ముందు నిర్వహించే మరో ముఖ్యమైన సంప్రదాయం హల్వా వేడుక. ఏటా బడ్జెట్‌కు ముందు కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ నార్త్ బ్లాక్‌లో ఈ వేడుక నిర్వహిస్తారు. న్యూఢిల్లీ, జనవరి 27న కూడా ఈ కార్యక్రమం జరిగింది. ఇందులో ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్, సహాయ ఆర్థిక మంత్రి పంకజ్ చౌదరి, ఆర్థిక శాఖ కార్యదర్శులు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. హల్వా వేడుక అనేది బడ్జెట్ కూర్పు చివరి దశకు చేరుకున్నదానికి సంకేతంగా భావిస్తారు.

**నయా ఉదారవాద ఆర్థిక విధానం:**

భారతదేశ ఆర్థిక పాలన గత కొన్ని దశాబ్దాలుగా ఒక నిర్దిష్ట దిశలో సాగుతోంది. ప్రజల సంక్షేమం కంటే ఆర్థిక క్రమశిక్షణ, ప్రభుత్వ లోటు నియంత్రణ, పెట్టుబడుల ఆకర్షణ వంటి అంశాలు కేంద్రంగా మారాయి. ఈ ఆలోచనా ధోరణినే నయా ఉదార బాధ విధానంగా చెప్పుకోవచ్చు. ఈ విధానంలో ప్రభుత్వం తన ఖర్చులను పరిమితం చేసుకుంటూ, సంక్షేమ కార్యక్రమాలపై వ్యయాన్ని కట్టడి చేస్తూ, మార్కెట్ శక్తులకు అధిక స్వేచ్ఛ ఇస్తుంది. ఈ విధానాన్ని అమలు చేసే ప్రధాన సాధనం కోశ విధానం. ఆ కోశ విధానానికి ప్రతిబింబమే ప్రతి సంవత్సరం ప్రవేశపెట్టే కేంద్ర వార్షిక బడ్జెట్. 2026 ఫిబ్రవరి 1న కేంద్ర ఆర్థిక మంత్రి ప్రవేశపెట్టబోయే బడ్జెట్ కూడా ఇదే ధోరణిని కొనసాగించే అవకాశాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి.

నయా ఉదార విధానం యొక్క ప్రధాన లక్ష్యం ప్రభుత్వ అప్పును, లోటు ఆదాయాన్ని నియంత్రించడం. భారతదేశంలో 2003లో అమలులోకి వచ్చిన ఆర్థిక బాధ్యత చట్టం తరువాత ఈ విధానం మరింత బలపడింది. 2023-24లో ప్రభుత్వ లోటు ఆదాయం జాతీయ ఆదాయంలో సుమారు 5.6%గా ఉండగా, మొదటిది లోటు ఆదాయం నియంత్రణ. రెండవది మౌలిక వసతుల నిర్మాణంపై భారీ ఖర్చు. మూడవది ప్రైవేటు పెట్టుబడులకు మరింత అనుకూల వాతావరణం కల్పించడం. ఈ మూడు లక్ష్యాల మధ్య సామాన్య మానవుడి అవసరాలు ఎక్కడ నిలుస్తాయన్నదే కీలక ప్రశ్న.

సామాన్య మానవుడి కోణంలో చూస్తే 2026 కేంద్ర బడ్జెట్ ప్రత్యక్షంగా పెద్ద ప్రయోజనాలను అందించే అవకాశాలు తక్కువగానే ఉన్నాయి. ఆహార ధాన్యాలు, ఇంధనం, ఎరువులు వంటి అవసరమైన వస్తువులపై ఇచ్చే సబ్సిడీలను జాతీయ ఆదాయంలో 1.2% నుండి 1.4% పరిధిలోనే పరిమితం చేయాలనే ధోరణి కొనసాగుతోంది. ధరల పెరుగుదల 5% నుండి 6% మధ్య కొనసాగుతున్న పరిస్థితుల్లో ఈ పరిమిత సబ్సిడీలు ప్రజల జీవన వ్యయాన్ని నియంత్రించలేక పోతున్నాయి. ఆరోగ్య రంగంపై ప్రభుత్వ వ్యయం జాతీయ ఆదాయంలో సుమారు 2.1% మాత్రమే ఉండగా, విద్యపై వ్యయం సుమారు 2.9% వద్దే ఉంది. ఇవి దేశ జనాభా అవసరాలకు సరిపడే స్థాయిలో లేవు. 2026 బడ్జెట్‌లో ఈ రంగాలకు గణనీయమైన పెంపు ఉంటుందన్న అంచనాలు బలంగా కనిపించడం లేదు.

ఉద్యోగస్తులు, ముఖ్యంగా మధ్యతరగతి వర్గం ఈ బడ్జెట్‌పై పెద్ద ఆశలు పెట్టుకోవడం కష్టం. పన్ను విధానంలో స్వల్ప మార్పులు, కొంతమేర మినహాయింపులు ఉండవచ్చు గానీ, అవి జీవన వ్యయాల పెరుగుదల్ని పూర్తిగా సమతుల్యం చేయలేవు. ధరల పెరుగుదల కొనసాగుతుండగా వేతనాల వాస్తవ పెరుగుదల తక్కువగానే ఉంది. ఈ పరిస్థితుల్లో ఉద్యోగస్తులపై ఉన్న ఆర్థిక ఒత్తిడి 2026 బడ్జెట్ తర్వాత కూడా కొనసాగుతుందని చెప్పవచ్చు.


నిరుద్యోగ సమస్య భారతదేశంలో అత్యంత తీవ్రమైన సామాజిక సమస్యగా మారింది. యువతలో నిరుద్యోగం 15% నుండి 18% మధ్య కొనసాగుతున్నా, ఉపాధి హామీ కార్యక్రమాలకు కేటాయింపులు పరిమితంగానే ఉంటాయి. గ్రామీణ ఉపాధి పథకానికి జాతీయ ఆదాయంలో 0.4% కన్నా తక్కువ నిధులు మాత్రమే కేటాయించే అవకాశం ఉంది. ఇవి తాత్కాలిక ఉపశమనమే తప్ప, శాశ్వత ఉపాధి భద్రతను కల్పించలేవు.

మొత్తంగా పరిశీలిస్తే 2026 కేంద్ర వార్షిక బడ్జెట్ ప్రజా కేంద్రిత కోశ విధానంగా కాకుండా, పెట్టుబడిదారులకు అనుకూలమైన నయా ఉదార బాధ విధానంగా కొనసాగే అవకాశాలే ఎక్కువగా ఉన్నాయి. ఆర్థిక వృద్ధి సంఖ్యల్లో కనిపించినా, ఆ వృద్ధి ఫలాలు సమానంగా పంచుకోబడకపోతే సామాన్య మానవుడి జీవితంలో మార్పు కనిపించదు. నిజమైన అభివృద్ధి అంటే ప్రజల ఆదాయం పెరగడం, ఉపాధి భద్రత కలగడం, సామాజిక అసమానతలు తగ్గడం. ఈ దిశగా 2026 కేంద్ర బడ్జెట్ అడుగులు వేయకపోతే, అది అభివృద్ధి పత్రంగా కాకుండా బాధ పత్రంగానే మిగిలిపోతుంది.

పరిశీలిస్తే 2026 కేంద్ర వార్షిక బడ్జెట్ భారతదేశ ఆర్థిక ప్రయాణంలో ఒక సాధారణ వార్షిక పత్రం కాదని స్పష్టంగా తెలుస్తుంది. ఇది గత కొన్ని దశాబ్దాలుగా కొనసాగుతున్న నయా ఉదార బాధ విధానానికి కొనసాగింపుగా నిలిచే విధాన పత్రంగా అవతరిస్తోంది. ఈ బడ్జెట్ ద్వారా ప్రభుత్వం ఏ దిశలో ఆలోచిస్తోంది, ఎవరి ప్రయోజనాలు కేంద్రంగా ఉన్నాయి, ఎవరి జీవితాలపై భారం మోపబడుతోంది అన్నది లోతుగా అర్థమవుతుంది. అభివృద్ధి అనే పదాన్ని ముందుంచుకొని తీసుకుంటున్న నిర్ణయా లు వాస్తవంగా ప్రజల జీవితాలను మెరుగుపరు స్తున్నాయా లేదా అన్న ప్రశ్న ఇక్కడ అత్యంత ప్రాముఖ్యతను సంతరించుకుంటుంది.

ప్రభుత్వం ఆర్థిక క్రమశిక్షణను ప్రధాన లక్ష్యంగా ప్రకటించడం ఒకవైపు అవసరమే అయినా, అది ప్రజల సంక్షేమాన్ని త్యాగం చేసి సాధించాల్సిన లక్ష్యంగా మారితే సమస్యలు తీవ్రమవుతాయి. లోటు ఆదాయం నియంత్రణ పేరుతో ఆరోగ్యం, విద్య, ఆహారం, ఉపాధి వంటి మౌలిక అవసరాలపై ఖర్చును తగ్గించడం ప్రజల జీవన ప్రమాణాలను దిగజార్చే ప్రమాదాన్ని కలిగిస్తుంది. 2026 బడ్జెట్‌లో కూడా ఈ ధోరణి కొనసాగితే, అభివృద్ధి గణాంకాల్లో కనిపించినా, ప్రజల అనుభవంలో కనిపించని పరిస్థితి ఏర్పడుతుంది. సామాన్య మానవుడి దృష్టిలో బడ్జెట్ అంటే తన రోజువారీ జీవితంపై పడే ప్రభావం. ధరలు తగ్గుతాయా, ఆదాయం పెరుగుతుందా, ఉపాధి భద్రత ఉంటుందా, ఆరోగ్య ఖర్చులు తగ్గుతాయా, విద్యా వ్యయం తగ్గుతుందా అనే ప్రశ్నలకు సమాధానం ఇవ్వగలిగినప్పుడే బడ్జెట్ ప్రజల బడ్జెట్ అవుతుంది. కానీ 2026 కేంద్ర బడ్జెట్ ఈ ప్రశ్నలకు స్పష్టమైన సానుకూల సమాధానాలు ఇస్తుందన్న నమ్మకం బలంగా కనిపించడం లేదు. ధరల పెరుగుదల కొనసాగుతున్న నేపథ్యంలో పరిమిత సబ్సిడీలు, స్వల్ప పన్ను మార్పులు ప్రజలపై ఉన్న ఆర్థిక ఒత్తిడిని తగ్గించలేవు.

ఉద్యోగస్తుల విషయానికి వస్తే, వారు దేశ ఆర్థిక వ్యవస్థకు వెన్నెముకలుగా ఉన్నప్పటికీ, వారి సమస్యలు బడ్జెట్ కేంద్రంలోకి రావడం అరుదుగా మారింది. వేతనాల వాస్తవ విలువ తగ్గుతున్న పరిస్థితుల్లో జీవన వ్యయాలు పెరుగుతున్నాయి. ఈ పరిస్థితిలో ఉద్యోగస్తులకు గణనీయమైన ఊరట ఇచ్చే విధానాలు అవసరం.



డాక్టర్ రక్కిరెడ్డి ఆదిరెడ్డి
కాకతీయ విశ్వవిద్యాలయం

# హామీలు అమలు చేయని కాంగ్రెస్ ఓట్ల కోసం వస్తే తరిమికొట్టండి

- మాజీ శాసనసభ్యులు గువ్వల బాలరాజు జిల్లా అధ్యక్షులు డి.నారాయణ



**వనపర్తి బ్యూరో, జనవరి 28 (జనంసాక్షి) :** హామీలు అమలు చేయని కాంగ్రెస్, ఓట్ల కోసం వస్తే తరిమి కొట్టండని,మాజీ శాసనసభ్యులు గువ్వల బాలరాజు జిల్లా అధ్యక్షులు డి.నారాయణ అన్నారు.బుధవారం వనపర్తి మున్సిపాలిటీలో బిజెపి రాష్ట్ర నాయకులు మాజీ శాసనసభ్యులు గువ్వల బాలరాజు పర్యటించారు.మున్సిపాలిటీ 13 వ వార్డులో కొండోజు గోపీనాథ్ నామినేషన్ సందర్భంగా పెద్ద ఎత్తున స్వచ్ఛందంగా తరలివచ్చిన మహిళల ఉద్దేశించి మాజీ శాసనసభ్యులు గువ్వల బాలరాజు మాట్లాడుతూ అబద్ధపు గ్యారంటీలు అమలుకు సాధ్యం కానీ హామీలతో అధికారంలోకి వచ్చిన రేవంత్ రెడ్డి, గ్రామ పంచాయతీ, మున్సిపాలిటీలకు ఒక్క రూపాయి నిధులు ఇవ్వలేని నిస్సహాయ పరిస్థితుల్లో ఉన్నాడని ఎన్నికల ముందు లంకె బిందెలు ఉన్నాయి. తెలంగాణ రాష్ట్రాన్ని అభివృద్ధి చేసి చూపిస్తానని ప్రగల్ బాలు పలికి నేడు నా బట్టలిప్పి కొట్టిన రూపాయి అప్పు పుట్టడం లేదు బ్యాంకుల ముందుకు వెళితే చెప్పులు ఎత్తుకుపోయే దొంగల చూస్తున్నారని, పాలనను చేతులెత్తేశాడని, గ్రామ పంచాయతీలకు కేంద్ర ప్రభుత్వం ఇచ్చే 3500 కోట్ల నిధుల కోసమే తాజాగా గ్రామపంచాయతీ ఎన్నికలు జరిపించారని, ఇప్పుడు కూడా అర్బన్ లోకల్ బాడీలకు కేంద్ర ప్రభుత్వం ఇచ్చే నిధుల కోసమే హడావిడిగా నిన్న నోటిఫికేషన్ వచ్చి నేడే నామినేషన్ అనడం అనుమానాలకు దారితీస్తుందని, ఏది ఏమైనా గ్రామపంచాయతీలు మున్సిపాలిటీలకు కేంద్రం ఇస్తే తప్ప ఒక్క రూపాయి నిధులు కూడా రాష్ట్ర ప్రభుత్వం ఇవ్వలేదని విమర్శిస్తూ గత మున్సిపల్ ఎన్నికల్లో 13వ వార్డులో స్వల్ప ఓట్ల తేడాతో ఓటమి చెందిన మధుసూదన్ రెడ్డి తనకు అనుకూలంగా రిజర్వేషన్ రాకపోయినా బీసీ సోదరుని కోసం ముందుండి గెలిపించడానికి, ప్రతిన భూనడం అంటే బిజెపి పార్టీకే ఇది సాధ్యమని ఫిబ్రవరి 11న జరిగే ఎన్నికల్లో వనపర్తి మున్సిపాలిటీలో బిజెపి జెండా ఎగురవేయబోతుందని, సర్వేలు చెబుతున్నాయని విజ్ఞులైన వనపర్తి ప్రజలంతా, బిజెపికి ప్రధానమంత్రి నరేంద్ర మోడీ కి మద్దతుగా కమలం పువ్వు గుర్తుకు ఓటు వేసి పెద్ద మెజార్టీతో బిజెపి అభ్యర్థులను గెలిపించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బిజెపి జిల్లా అధ్యక్షులు డి.నారాయణ మున్సిపల్ ఎన్నికల కన్వీనర్ ఆర్. లోకనాథ్ రెడ్డి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అయ్యగారి ప్రభాకర్ రెడ్డి, సబిరెడ్డి వెంకటరెడ్డి, సీనియర్ నాయకులు అశ్విని నందకుమార్, జిల్లా ప్రధాన కార్యదర్శిలు శ్రీనివాస్ గౌడ్, పెద్దిరాజు ,మున్సిపల్ ఎన్నికల కోకన్వీనర్ కేతూరి బుడ్డన్న, జిల్లా కార్యవర్గ సభ్యులు బత్తిని మధుసూదన్ రెడ్డి, మైనార్టీ మోర్చా జిల్లా అధ్యక్షులు ఎండి. ఖలీల్, ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షులు గంధం ప్రవీణ్, పెద్దమందడి మండల అధ్యక్షులు ముప్పూరు చెన్నయ్య, తదితరులు పాల్గొన్నారు.

## జనంసాక్షి క్యాలెండర్ ఆవిష్కరణ



**అబ్దుల్లాపూర్మేట్, జనవరి 28 (జనం సాక్షి) :** హైదరాబాద్ జనం సాక్షి నూతన సంవత్సర క్యాలెండర్ ఆవిష్కరణ కార్యక్రమం శుక్రవారం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా తాజా మాజీ కౌన్సిలర్ గ్యారల శ్రీనివాస్ గౌడ్ హాజరై క్యాలెండర్ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా గ్యారల శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ, జనం సాక్షి పత్రిక ప్రజా సమస్యలను నిస్పక్షపాతంగా వెలుగులోకి తీసుకువస్తూ, సమాజంలో చైతన్యం తీసుకురావడంలో కీలక పాత్ర పోషిస్తోందని ప్రశంసించారు. భవిష్యత్తులోనూ పత్రిక మరింత విజయవంతంగా ముందుకు సాగాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో జయప్రకాశ్ కాలనీ మాజీ అధ్యక్షులు షేక్ లాలు మహ్మద్, జనం సాక్షి రిపోర్టర్ శివకుమార్, చెవుల మణి కిరణ్ తదితరులు పాల్గొని క్యాలెండర్ బృందానికి శుభాకాంక్షలు తెలిపారు.

## మహిళా సాధికారతకు కృషి



**కేశంపేట, జనవరి 28 (జనం సాక్షి) :** కాంగ్రెస్ ప్రభుత్వం మహిళా సాధికారతకు కృషి చేస్తుందని సర్పంచ్ ఎగిరే నాగేశ్వర్ అన్నారు. మండల పరిధిలోని భోధునం పల్లి గ్రామంలో ఎన్ఆర్ఈజీఎస్ నిధులు 10 లక్షలతో మంజూరైన మహిళా సమాఖ్య నూతన భవన నిర్మాణానికి ఎంపీడీవో రవిచంద్ర కుమార్ రెడ్డితో కలిసి సర్పంచ్ నాగేశ్వర్ భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా నాగేశ్వర్ మాట్లాడుతూ.. ప్రభుత్వం మహిళల అభ్యున్నతి కోసం కృషి చేస్తుందన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాష్ట్రంలో ఉన్న మహిళలు ఆర్థికంగా రాణించాలనే ఉద్దేశంతో అనేక అభివృద్ధి సంక్షేమ పథకాలను ప్రవేశ పెట్టడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ హరిశ్వర్ రెడ్డి, పంచాయతీ కార్యదర్శి సాయి ప్రసాద్ రెడ్డి, వార్డ్ సభ్యులు ఎదిరే బీరప్ప, పిప్పళ్ల నరేందర్, మహిళా సంఘము అధ్యక్షురాలు పిప్పళ్ళ సుజాత, సభ్యులు పిప్పళ్ళ మంజుల, పిచకుంట్ల సుజాత, గ్రామస్తులు పిప్పళ్ళ అశోక్, ఎదిరే అంజయ్య, మెలిగిరి యాదగిరి, ఎదిరే మల్లయ్య, చాకలి నర్సింహా, దోమ యాదయ్య, కత్ర మల్లేష్, ఎదిరే వెంకటేష్ పాల్గొన్నారు.

# దుండిగల్ సర్కిల్ పరిధిలో అక్రమ నిర్మాణాల కూల్చివేతలు

**నిజాంపేట్, జనవరి 28 (జనం సాక్షి) :** గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్, కుత్బుల్లాపూర్ జోన్, దుండిగల్ సర్కిల్ నం.59 పరిధిలో జిహెచ్ఎంసి చట్టం, 1955 లోని సెక్షన్ 461- ఏ ప్రకారం దుండిగల్ టౌన్ ప్లానింగ్ ఏసిపి విదేశాల మేరకు అక్రమ నిర్మాణాలపై సీజింగ్ చర్యలు చేపట్టారు. అక్రమ నిర్మాణంలో భాగంగా వివరాలు ఈ క్రిందివిధంగా ఉన్నాయి: (1) జి. ప్రవీణ్, ప్లాట్ నం. 6/ పి సర్వే నంబర్లు 179, 180, 212, 214, 215 ‌ 216, డి. పోచంపల్లి గ్రామం, టాజ్జా టిఫిన్స్ సమీపంలో, అనుమతించిన స్టిల్ ‌ 2 పై అంతస్తులుకి మించి సెల్లార్ ‌ గ్రౌండ్ ‌ నాలుగు పై అంతస్తులు అక్రమంగా నిర్మించడంతో భవనం సీల్ చేయబడింది; (2) వానం రాములు, ప్లాట్ నం. 8, సర్వే నం. 62/1/ూ, బావర్చి (వెనుక వైపు)



సమీపంలో, అనుమతించిన స్టిల్ ‌ 2 పై అంతస్తులుకి మించి స్టిల్ 5పై అంతస్తులు అక్రమంగా నిర్మించడంతో సీలింగ్ చర్యలు చేపట్టబడినవి; (3) శ్రీమతి గుర్రం పద్మజ, సర్వే నం. 132/2, డి. పోచంపల్లి గ్రామం, అనుమతి లేకుండా వాణిజ్య షెడ్ / గోదాం నిర్మించినందున సీల్ చేయబడింది. ప్రజలు భవన నిబంధనలు, నియమావళి మరియు అనుమతించిన ప్లాన్?లను కచ్చితంగా పాటించాలని జిహెచ్ఎంసి విజ్ఞప్తి చేస్తోంది. నిబంధనలకు విరుద్ధంగా అక్రమ నిర్మాణాలు చేపడితే చట్టప్రకారం సీలింగ్, కూల్చివేత తదితర కఠిన చర్యలు తీసుకుంటామని సర్కిల్ 59 దుండిగల్ ఉప కమిషనర్ తెలియ చేశారు.

## నోడల్ అధికారులు నిబద్ధత తో ఎన్నికల విధులు నిర్వర్తించాలి



**సంగారెడ్డి ప్రతినిధి, జనవరి 28 (జనం సాక్షి) :** జిల్లాలో మున్సిపల్ ఎన్నికలను పారదర్శకంగా, సమర్థవంతంగా నిర్వహించేందుకు ఆయా నోడల్ అధికారులు సమన్వయంతో తమకు కేటాయించిన విధులను బాధ్యతాయుతంగా నిర్వర్తించాలని జిల్లా ఎన్నికల సాధారణ పరిశీలకులు ఉదయ్ కుమార్, ఐఏఎస్ సూచించారు. బుధవారం కలెక్టరేట్లోని మినీ సమావేశ మందిరంలో జిల్లా ఎన్నికల సాధారణ పరిశీలకులు ఉదయ్ కుమార్ నోడల్ అధికారులతో సమావేశమై, జిల్లాలో జరుగనున్న మున్సిపల్ ఎన్నికల నిర్వహణ ఏర్పాట్లపై సమీక్ష నిర్వహించారు. సమావేశంలో అడిషనల్ కలెక్టర్ పాండు, నోడల్ అధికారులు జానకి రెడ్డి, వెంకటేశ్వర్లు, ఎస్.బి. రామాచారి, అఖిలేష్ రెడ్డి, అరుణ, తులచ్య నాయక్, జగదీష్, కిరణ్ కుమార్, చలపతిరావు, బాల్ రాజ్, విజయలక్ష్మి, స్వప్న, ఎన్నికల విభాగపు అధికారులు పాల్గొన్నారు.

## రోటరీ క్లబ్ సహకారంతో భూ పోరాట కేంద్రంలో వెలుగులు



**అబ్దుల్లాపూర్మేట్, జనవరి 28 (జనం సాక్షి) :** హైదరాబాద్కి కూతవేటు దూరంలో గత నాలుగేళ్లుగా కొన్ని వేల కుటుంబాలు చిమ్మ చీకట్లో జీవనం సాగిస్తున్నారు.అనేక మంది పిల్లలు ఆ చీకట్లోనే తమ చదువులను సైతం కొనసాగిస్తున్నారు.విషయం తెలుసుకొని రోటరీ క్లబ్ అఫ్ హైదరాబాద్ సౌజన్యం వారు దాతల సహకారంతో భూ పోరాట కేంద్రంలో ఏర్పాటు చేయటానికి కొన్ని వందల సోలార్ లైట్లని అందించారు.భూ పోరాట కేంద్రంలో ఏర్పాటు చేసిన ఆ లైట్లని మరియు భూ పోరాట కేంద్రాన్ని రోటరీ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ సంస్థ అధ్యక్షులు సురేష్ బాబు,కార్యదర్శి మాధవి,మాజీ అధ్యక్షులు వాణ శ్రీ,మాజీ కార్యదర్శి అజయ్ కుమార్,మరియు రవి,రష్మీ,రమ ప్రసాద్, శ్రీనివాస్ రావు, సుబ్బారావు గార్ల బృందం బుధవారం నాడు పరిశీలించారు.కొన్ని వేల మంది నిరుపేద ప్రజలు కనీస సదుపాయాలు లేకుండా ఇన్నేళ్లుగా కారు చీకట్లో జీవనం గడపటం మరియు అనేక మంది పాఠశాల విద్య నుండి మొదలు ఉన్నత స్థాయి విద్యను అభ్యసించే వాళ్ళు ఈ గుడిసెల్లో నివసించటం చూసి ఆశ్చర్యపోయారు.తమ సంస్థ నుండి అందించిన సోలార్ లైట్ల వెలుతురులో స్కూల్ పిల్లలు చదువుకోవటం మరియు ఆడుకోవటం చూసి వాళ్ళు సంతోష పడ్డారు.ఇలాంటి పేద ప్రజల కోసం భవిష్యత్తులో కూడా అనేక సహాయ సహకారాలు అందించటానికి తాము సిద్ధంగా ఉన్నామని హామీ ఇచ్చారు.ఈ సందర్భంగా సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అందోజు రవీంద్ర చారీ మరియు రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు ముత్యాల యాదిరెడ్డి గార్లు మాట్లాడుతూ మానవతా దృక్పతంతో నీరుపేద ప్రజల పట్ల ప్రేమతో భూ పోరాట కేంద్రం గుడిసెల్లో వెలుగులు నింపిన రోటరీ క్లబ్ అఫ్ హైదరాబాద్ సౌజన్యం వారికి శాలువాలు కప్పి సన్మానించిన పేద ప్రజలందరి తరుపున ప్రత్యేకమైన ధన్యవాదాలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో సిపిఐ అబ్దుల్లాపూర్ మెట్ మండల ప్రధాన కార్యదర్శి అజ్మీరా హరిసింగ్ నాయక్,సహాయ కార్యదర్శి కేతరాజు నర్సింహా,నాయకులు దాసరి ప్రసాద్,అరుణ,నవనీత,సైదులు ముదిరాజ్, ఆవుల యాదగిరి, వినోద్ నాయక్,మరియు తదితరులు పాల్గొన్నారు.

## ఎల్లలు దాటేలా ఏడుపాయల జాతర జరగాలి




**మెదక్ జిల్లా బ్యూరో, జనవరి 28 (జనం సాక్షి) :** పవిత్ర ఏడుపాయల వరదుర్గా మాత జాతర ఎల్లలు దాటేలా ఘనంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ అధికారులను ఆదేశించారు. స్థానిక కలెక్టర్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో గురువారం జిల్లా అదనపు ఎస్పీ మహేందర్, జిల్లా అదనపు కలెక్టర్ నగేష్, నర్సాపూర్ ఆర్డీవో మైపాల్ రెడ్డి, డీఎస్పీ ప్రసన్నకుమార్, వివిధ శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ మాట్లాడుతూ.. పవిత్ర ఏడుపాయల వనదుర్గా మాత జాతరను ఘనంగా నిర్వహించాలని, జాతరలో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని, పార్కింగ్, విద్యుత్ ,తాగునీరు బార్కెట్స్లను ఏర్పాటు చేయాలన్నారు. జాతర పరిసరాలు పరిశుభ్రంగా ఉండాలని, మరుగుదొడ్లు, చిత్త సేకరణ, బ్లీచింగ్ పౌడర్ , దోమల నివారణకు ఫాగు లాంటివి ఎప్పటికప్పుడు నిర్వహించాలన్నారు. వివిధ సైన్ బోర్డులు, అంబులెన్స్, మందులు, అంటూ వ్యాధులు రాకుండా చర్యలు, కోవిడ్ 19 కు ముందస్తు చర్యలు చేపట్టాలన్నారు. రవాణా, బస్సులు, వాహనాలు, గజ ఈతగాళ్లు, అన్ని చోట్ల సీసీ కెమెరాలు, పోలీస్ కంట్రోల్ రూమ్, వివిధ స్టాల్స్, పకడ్బందీగా దర్శనానికి క్యూలైన్ ఏర్పాటు, అగ్ని ప్రమాదాల నివారణకు అగ్నిమాపక యంత్రాలు, స్వయం సహాయక మహిళల ఉత్పత్తుల కోసం ప్రత్యేక స్టాల్స్ లను ఏర్పాటు చేసి భక్తులకు అన్ని సౌకర్యాలు కల్పించాలన్నారు. అధికారులు క్షేత్రస్థాయిలో ఏడుపాయలకు వెళ్లి శనివారం వరకు జాతరకు సంబంధించి యాక్షన్ ప్లాన్ తయారుచేసి ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికారులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## నోడల్ అధికారులకు కేటాయించిన బాధ్యతలు పకడ్బందీగా నిర్వహించాలి



**గద్వాల నడిగడ్డ, జనవరి 28 (జనం సాక్షి) :** మున్సిపాలిటీ ఎన్నికల్లో నోడల్ అధికారులకు కేటాయించిన బాధ్యతలు పక్కాగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ బి. ఎం. సంతోష్ అన్నారు. బుధవారం ఐడీఓసీ కాన్ఫరెన్స్ హాల్లో మున్సిపాలిటీ ఎన్నికలకు సంబంధించి నోడల్ అధికారులకు వివిధ బాధ్యతల నిర్వహణపై కలెక్టర్ తగు సూచనలు చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి నోడల్ అధికారి తమకు కేటాయించిన బాధ్యతలపై పూర్తి అవగాహనతో సమయపాలన పాటిస్తూ పని చేయాలన్నారు. మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ అమలు,ఎన్నికల ఖర్చుల లెక్కల పర్యవేక్షణ,పోస్టల్ బ్యాలెట్ పేపర్ల నిర్వహణ తదితర అంశాలను జాగ్రత్తగా నిర్వహించాలన్నారు. ఎన్నికల విధుల్లో అత్యధికంగా విద్యాశాఖ సిబ్బంది విధులు నిర్వహిస్తున్నందున మ్యాన్ పవర్ నిర్వహణ బాధ్యతలు విద్యాశాఖ అధికారులు చూసుకోవాలన్నారు. ఎన్నికల విధుల్లో పాల్గొనే సిబ్బందికి సమగ్ర శిక్షణ కార్యక్రమాలు నిర్వహించాలని,బ్యాలెట్ విధానాలపై పూర్తి అవగాహన కల్పించాలని శిక్షణ అధికారికి తెలిపారు.బ్యాలెట్ బాక్సుల నిర్వహణ పక్కాగా చేయాలని డీ.ఎల్.పి.ఓ కు ఆదేశించారు. పోలింగ్ సిబ్బంది,బ్యాలెట్ బాక్సులు, ఎన్నికల సామగ్రి రవాణా సజావుగా జరిగేలా వాహనాల కేటాయింపు చేయాలని రవాణా శాఖ తెలిపారు.ఎన్నికలకు అవసరమైన మెటీరియల్ మేనేజ్?మెంట్,భద్రత, పంపిణీ పకడ్బందీగా చేపట్టాలని,ఎన్నికల ఖర్చుల పర్యవేక్షణ నిబంధనల ప్రకారం నిర్వహించాలన్నారు. బ్యాలెట్ పేపర్ ముద్రణ విషయంలో అత్యంత జాగ్రత్తగా వ్యవహరించాలని ఆదేశించారు. రిపోర్ట్లు, రిటర్న్లను సకాలంలో సమర్పించాలని డీపీఎంకు ఆదేశించారు.ఎన్నికల హెల్ప్లైన్ నిర్వహణతో పాటు ప్రజల నుండి వచ్చే ఫిర్యాదులను వేగంగా పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని ఉపాధి శాఖకు ఆదేశించారు. జిల్లాలో మున్సిపాలిటీ ఎన్నికలు సజావుగా, ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు సహకరించాలని అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ నర్సింగ రావు,హౌసింగ్ పీడీ శ్రీనివాసరావు,జడ్పి డిప్యూటీ సీఈఓ నాగేంద్రం,నోడల్ అధికారులు,తదితరులు పాల్గొన్నారు.

## జగద్గిరిగుట్టలో ప్రభుత్వ భూములను కాపాడండి



**కుత్బుల్లాపూర్, జనవరి 28 (జనం సాక్షి) :** కుత్బుల్లాపూర్ మండలం గాజులరామారం రెవెన్యూ డివిజన్లోని జగద్గిరిగుట్ట శ్రీవెంకటేశ్వరస్వామి ఆలయం సంబంధించి భూములలో అక్రమ నిర్మాణాలు జరుగుతున్నాయని వాటిని వెంటనే అడ్డుకొని ప్రభుత్వ భూమిని కాపాడాలని బుధవారం కుత్బుల్లాపూర్ మండల రెవెన్యూ అధికారి కార్యాలయంలో ఆర్ ఐ కరీముల్లా కు సిపిఐ నాయకులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సిపిఐ కార్యదర్శి ఉమా మహేష్ మాట్లాడుతూ కుత్బుల్లాపూర్ మండలంలో హైడ్రా అధికారులు సర్వే నిర్వహించి హెచ్చరించినప్పటికీ ప్రభుత్వ భూములు అన్యాక్రాంతమవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు.అధికారులు కబ్జాలు చేస్తున్న వారి పేర్లు తెలిసినప్పటికీ వారి పైన చట్టపరమైన చర్యలు తీసుకోకపోవడం కబ్జాలు పునరావృతం అవుతున్నాయని అన్నారు. ప్రభుత్వ భూములను అన్యాక్రాంతం చేస్తున్నారని సిపిఐ ఇచ్చిన ప్రభుత్వ భూములను కాపాడాలని లేనిపక్షంలో వచ్చే వారం ఎమ్మార్వో కార్యాలయం ఎదురుగా రిలే నిరాహార దీక్షలను ప్రారంభిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి ఉమామహేష్ సహాయ కార్యదర్శులు హరినాథ్ రావు, రాములు ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి శ్రీనివాస్ మండల కోశాధికారి సదానంద్ సిపిఐ నాయకులు ఇమామ్, వంశీ తదితరులు పాల్గొనడం జరిగింది.

# గ్రామీణ మహిళల ఆరోగ్య రక్షణే ప్రభుత్వ లక్ష్యం

- సెర్ప్ సీఈఓ దివ్య దేవరాజన్
- పీహెచ్సీలలో, మొబైల్ క్యాంపులతో మహిళలకు వైద్య సేవలు
- జిల్లా కలెక్టర్ పి. ప్రావీణ్య




**సంగారెడ్డి ప్రతినిధి, జనవరి 28 (జనం సాక్షి) :** గ్రామీణ ప్రాంతాల్లో మహిళలకు వచ్చే రొమ్ము క్యాన్సర్, సర్వైకల్ క్యాన్సర్?ను తొలి దశలోనే గుర్తించి ప్రాణాలను కాపాడడమే లక్ష్యంగా తెలంగాణ ప్రభుత్వం కీలక ముందడుగు వేసిందని సెర్ఫ్ సీఈఓ దివ్య దేవరాజన్ అన్నారు. తెలంగాణ ప్రభుత్వం సొసైటీ ఫర్ ఎలిమినేషన్ ఆఫ్ రూరల్ పావర్టీ గ్రాన్యూల్స్ ఇండియా లిమిటెడ్ సంయుక్త ఆధ్వర్యంలోబుధవారం సంగారెడ్డి లోని ఎస్ ఎస్ గార్డెన్లో నిర్వహించిన అవగాహన కార్యక్రమానికి సెర్ఫ్ సీఈవో దివ్య దేవరాజన్తో పాటు జిల్లా కలెక్టర్ పి.ప్రావీణ్య పాల్గొన్నారు. ఈ సందర్భంగా సెర్ఫ్ సీఈఓ దివ్య దేవరాజన్ మాట్లాడుతూ... మహిళా స్వయం సహాయక సంఘాల ద్వారా గ్రామ స్థాయిలో విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించి, ఉచిత స్క్రీనింగ్ పరీక్షలు, వైద్య సలహాలు అందిస్తామని తెలిపారు. క్యాన్సర్?పై ఉన్న భయాలు, అపోహలను తొలగించి మహిళల్లో ధైర్యం నింపడమే ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని పేర్కొన్నారు . గ్రామీణ మహిళలు తమ ఆరోగ్యాన్ని పక్కన పెట్టి కుటుంబం కోసం ఎక్కువగా శ్రద్ధ చూపుతారని, దీనివల్ల అనేక ఆరోగ్య సమస్యలు తలెత్తుతాయని అన్నారు. మహిళలకు ప్రధానంగా వచ్చే క్యాన్సర్లు రొమ్ము క్యాన్సర్, సర్వైకల్ క్యాన్సర్ అని, వీటిని తొలి దశలోనే గుర్తిస్తే పూర్తిగా అరికట్టే అవకాశం ఉందన్నారు. ఇందిరా మహిళా శక్తి, మహిళల కు ముందుగా అవగాహన కల్పించి వారి ద్వారా మహిళలందరికీ విస్తృత అవగాహన కల్పించడంతో క్యాన్సర్ ను అరికట్టవచ్చని అన్నారు. మహిళలు తప్పనిసరిగా తమ ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని, అలాగే అంగన్వాడీ కేంద్రాల్లో ఎత్తు, బరువు తక్కువ పిల్లలను గుర్తించి పౌష్టికాహారం అందించాలని అన్నారు. ఎన్ ఆర్ .ఇ జి ఎస్ కార్యక్రమం ద్వారా న్యూట్రిషన్ గార్డెన్లు ఏర్పాటు చేయాలని సూచించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ పి.ప్రావీణ్య మాట్లాడుతూ ...జిల్లాలో ఆరోగ్య మహిళ కార్యక్రమంలో భాగంగా 13 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను ఆరోగ్య మహిళ పీహెచ్సీలుగా గుర్తించామని తెలిపారు. అక్కడ మహిళలకు వైద్య పరీక్షలు నిర్వహించి, ఆరోగ్యంపై అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు. జిల్లాలో మహిళా ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధతో మొబైల్ మెడికల్ క్యాంపులు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఏసీ బస్సులతో కూడిన ఈ మొబైల్ క్యాంపుల్లో ఆధునిక వైద్య పరికరాలు, వైద్యులు, సిబ్బంది అందుబాటులో ఉంటారని తెలిపారు. మేజర్ జీపీలలో, మండల కేంద్రాలలో ఈ మొబైల్ క్యాంపులు నిర్వహిస్తున్నామని చుట్టుపక్కల ప్రాంతాల మహిళలు మొబైల్ క్యాంపులను వినియోగించుకోవాలని సూచించారు. మహిళలు సంకోచం విడిచిపెట్టి రొమ్ము క్యాన్సర్, సర్వైకల్ క్యాన్సర్? నిర్ధారణ పరీక్షలు చేయించుకోవాలని కోరారు.జిల్లాలో ప్రతి గ్రామానికి ఈ అవగాహన కార్యక్రమం చేరేలా చర్యలు తీసుకోవాలని మహిళాసంఘాలకు సూచించారు. అవసరమైన మహిళలకు మెరుగైన వైద్య చికిత్స అందేలా జిల్లా యంత్రాంగం సమన్వయంతో పని చేస్తుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో గ్రాన్యూల్స్ ఇండియా ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఉమా చిగురుపాటి, ఏఐజి హాస్పిటల్ అంకాలాజిస్ట్ ఆంకో--ప్లాస్టిక్ సర్జన్ మరియు యూసీ బ్రెస్ట్ ఫౌండేషన్ వ్యవస్థాపకురాలు డాక్టర్ ప్రజ్ఞ చిగురుపాటి నగ్రా, జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ అధికారులు , ఎస్ హెచ్ జి గ్రూప్ మహిళా సభ్యులు ,తదితరులు పాల్గొన్నారు.

# జడ్చర్ల ప్రజల దశాబ్దాల కల సాకారం

- బైపాస్ రోడ్డుకు మోక్షం
- మార్చిలోగా కొలిక్కి రానున్న డీపీఆర్
- బైపాస్ పూర్తయితే తీరనున్న ట్రాఫిక్ కష్టాలు
- బైపాస్ ఏర్పాటుకు ఎమ్మెల్యే అనిరుద్ రెడ్డి,
- ఎంపీ డీకే అరుణల ప్రత్యేక శ్రద్ధ




**జడ్చర్ల, జనవరి 28 (జనంసాక్షి) :** జడ్చర్ల పట్టణ వాసుల చిరకాల కోరిక నెరవేరబోతోంది. పట్టణ విస్తరణకు, ట్రాఫిక్ సమస్యల పరిష్కారానికి ప్రధాన అడ్డంకిగా మారిన బైపాస్ రోడ్డు నిర్మాణానికి ఎట్టకేలకు అడుగులు పడ్డాయి. ఈ ప్రాజెక్టుకు సంబంధించి డిటైల్డ్ ప్రాజెక్ట్ రిపోర్ట్ (డీపీఆర్) పనులు ప్రస్తుతం వేగంగా కొనసాగుతున్నాయి. మార్చి నెల చివరి నాటికి డీపీఆర్ ప్రక్రియ ఒక కొలిక్కి వచ్చే అవకాశం ఉందని అధికారిక వర్గాలు వెల్లడించాయి.

### నరకప్రాయంగా పట్టణ ప్రయాణం

జడ్చర్ల పట్టణం మీదుగా హైదరాబాద్, బెంగళూరు జాతీయ రహదారి (44), కర్నూలు-రాయచూరు మార్గం (167) వెళుండటంతో నిత్యం వేల సంఖ్యలో భారీ వాహనాలు పట్టణ మధ్యలో నుంచే ప్రయాణిస్తున్నాయి. ముఖ్యంగా సిగ్నల్?గడ్డ సమీపంలోని సింగిల్ బ్రిడ్జి వద్ద గంటల తరబడి ట్రాఫిక్ జామ్ ఏర్పడి ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గత రెండు దశాబ్దాలుగా బైపాస్ నిర్మాణంపై ప్రతిపాదనలు ఉన్నప్పటికీ, ఇప్పుడు జడ్చర్ల ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్ రెడ్డి ప్రత్యేక చొరవతో దీనికి మోక్షం లభించింది.

### మార్చిలోగా డీపీఆర్

కన్సల్టెన్సీ సంస్థ సర్వే పనులను ముమ్మరం చేసింది. మార్చి నాటికి నివేదిక సిద్ధమైతే నిధుల కేటాయింపు సులభం కానుంది. ఎంపీ డీకే అరుణ, ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి కేంద్ర రోడ్డు రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరీని కలిసి ఈ ప్రాజెక్టు ఆవశ్యకతను వివరించడంతో పనులు వేగవంతం అయ్యాయి. కన్సల్టెన్సీ సంస్థ ప్రతిపాదిత మార్గాల్లో సర్వే పూర్తి చేస్తోంది. మార్చిలోగా డీపీఆర్ తుది నివేదిక అందితే, వెంటనే భూసేకరణ, నిధుల కేటాయింపు ప్రక్రియ మొదలుకానుంది.

### బైపాస్ రోడ్డు నమూనా ఇలా..

ప్రతిపాదిత బైపాస్ రోడ్డు నక్కలబండ తండా నుంచి ప్రారంభమై మల్లెబోయినపల్లి, చిట్టెబోయినపల్లి గ్రామాల మధ్య నుంచి జాతీయ రహదారి 44ను కలుపుతూ వెళ్లనుంది. అక్కడి నుంచి మరికల్, నాగసాల గ్రామాల మీదుగా చర్లపల్లి, అల్వాన్?పల్లి, గంగాపూర్ పరిసరాల్లో మళ్లీ ఎన్?హెచ్ 167లో కలిసేలా ప్రణాళికలు సిద్ధం చేశారు. నక్కలబండ తండా, మల్లెబోయినపల్లి, చిట్టెబోయినపల్లి మీదుగా సాగే ఈ బైపాస్ ద్వారా పట్టణంపై ట్రాఫిక్ ఒత్తిడి పూర్తిగా తగ్గుతుంది.

### అభివృద్ధికి బాటలు..

బైపాస్ అందుబాటులోకి వస్తే పట్టణంలో ట్రాఫిక్ తగ్గడమే కాకుండా, చుట్టుపక్కల ప్రాంతాల్లో రియల్ ఎస్టేట్, పారిశ్రామిక అభివృద్ధి ఊపందుకుంటుంది. జడ్చర్ల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని ఈ బైపాస్ రోడ్డును అత్యంత ప్రాధాన్యత కలిగిన ప్రాజెక్టుగా తీసుకున్న జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి, ఎంపీ డీకే అరుణ సహకారంతో బైపాస్ రోడ్డు ఏర్పాటుకు భూసేకరణ, నిర్మాణ పనులు ప్రారంభం అయ్యేలా ప్రత్యేక చొరవ చేపట్టారు. అన్ని సవ్యంగా సాగి బైపాస్ రోడ్డు నిర్మాణ పనులు పూర్తయితే జడ్చర్ల పట్టణ ముఖచిత్రం మారిపోవడమే కాకుండా ప్రయాణికులకు సమయం ఆదా అవుతుంది. ఈ ప్రాంతం మరింత అభివృద్ధి చెందుతుంది.

## దృష్టి లోపాలపైన ప్రత్యేక శ్రద్ధ వహించాలి

- శ్రీ చైత్ర ఆప్టికల్‌ను ప్రారంభించిన మాజీ ఎమ్మెల్యే



**బిజినపల్లి, జనవరి 28 (జనంసాక్షి) :** మానవ శరీరంలో అన్ని అవయవాలలో ప్రధానమైనది నేత్రాలేనని నేత్రాలపైన ప్రజలు ప్రత్యేక శ్రద్ధ వహించాలని నాగర్ కర్నూల్ మాజీ శాసనసభ్యులు మర్రి జనార్దన్ రెడ్డి కోరారు. మండల పరిధిలోని బోయాపూర్ గ్రామ సర్పంచ్ ప్రణీత శ్రీకాంతు మండల కేంద్రంలో నూతనంగా ఏర్పాటు చేసిన ఆప్టికల్ ను బుధవారం నాగర్ కర్నూల్ మాజీ శాసనసభ్యులు మర్రి జనార్దన్ రెడ్డి ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆప్టికల్ ను పరిశీలించి తగు సూచనలు చేశారు. దృష్టి లోపాలు లేకుండా ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ శ్రీ చైత్ర ఆప్టికల్ ను అభివృద్ధి చేయాలని నిర్వాహకులకు కోరారు. అనంతరం మహాదేవుని పేట గ్రామానికి చెందిన మాజీసర్పంచ్ జుర్రు కృష్ణయ్య సోదరుడి కుమారుడు రోడ్డు ప్రమాదంలో గత వారం రోజుల క్రితం మరణించడంతో విషయం తెలుసుకున్న నాగర్ కర్నూల్ మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్దన్ రెడ్డి బుధవారం కుటుంబాన్ని పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఆయన వెంట మాజీ మండల రైతు సమితి అధ్యక్షులు నెలికంటి మహేశ్వర్ రెడ్డి, శేఖర్ రావు, తిరుపతిరెడ్డి, మహదేవన్ పేట తిరుపతిరెడ్డి, చిన్నారెడ్డి, తిరుపతిరెడ్డి, తుమ్మల అల్లోజి, కరిగళ్ళ సుదర్శన్, సట్ల కృష్ణయ్య, శ్రీను, మైబు, బాలమసయ్య, గఫూర్, మహమ్మద్ రిజ్వాన్‌తో పాటు తదితరులు ఉన్నారు.

## మున్సిపాలిటీ నామినేషన్ కేంద్రం వద్ద పటిష్ట బందోబస్తు ఏర్పాటు

- మక్తల్ సీఐ రామ్ లాల్



**మక్తల్, జనవరి 28 (జనంసాక్షి) :** మక్తల్ పట్టణంలోని మున్సిపాలిటీ కేంద్రంలో జరుగుతున్న మున్సిపల్ ఎన్నికల నామినేషన్ ప్రక్రియ సందర్భంగా పటిష్ట పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేసినట్లు మక్తల్ సీఐ రామ్ లాల్ తెలిపారు. మక్తల్ మున్సిపాలిటీ పరిధిలోని 16 వార్డులకు సంబంధించి నామినేషన్లు స్వీకరిస్తున్న నేపథ్యంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తు చర్యలు చేపట్టినట్లు తెలిపారు. ఈ సందర్భంగా సీఐ రామ్ లాల్ మాట్లాడుతూ నామినేషన్ కేంద్రం పరిసరాల్లో 144 సెక్షన్ అమల్లో ఉందని, 200 మీటర్ల పరిధిలో గుంపులు గుంపులుగా ఉండరాదని స్పష్టం చేశారు. నామినేషన్ కేంద్రానికి అభ్యర్థితో పాటు ఒకరు లేదా ఇద్దరు ప్రతిపాదకులకు మాత్రమే అనుమతి ఉంటుందని పేర్కొన్నారు. ఎన్నికల నియమావళిని అభ్యర్థులు, రాజకీయ పార్టీల నాయకులు, వారి అనుచరులు తప్పనిసరిగా పాటించాలని సూచించారు. ముందస్తు అనుమతి లేకుండా ర్యాలీలు, సభలు, మైక్ వినియోగం చేయరాదని తెలిపారు. నిబంధనలను ఉల్లంఘించిన వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. నామినేషన్ కేంద్రం వద్ద సీసీటీవీ కెమెరాల పర్యవేక్షణ, బారికేడ్లు, ట్రాఫిక్ నియంత్రణ వంటి భద్రతా చర్యలు అమలు చేసినట్లు తెలిపారు. ప్రజలు ఎలాంటి సమస్యలు ఎదుర్కొన్నా వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. మక్తల్ మున్సిపాలిటీ ఎన్నికలు శాంతియుతంగా, స్వేచ్ఛాయుతంగా, నిష్పక్షపాతంగా జరిగేలా పోలీస్ శాఖ పూర్తిగా కట్టుబడి ఉందని, ఇందుకు ప్రజలంతా సహకరించాలని సీఐ విజ్ఞప్తి చేశారు. బందోబస్తులో ఎస్సై లు భాగ్యలక్ష్మి రెడ్డి, రమేష్, రేవతి, పోలీస్ సిబ్బంది ఉన్నారు.

## బాలల హక్కుల రక్షణ చట్టాలపై అవగాహన



**రేవల్లి, జనవరి 28 (జనంసాక్షి) :** వనపర్తి జిల్లా మహిళాభివృద్ధి శిశు సంక్షేమ శాఖ పరిధిలో ఉన్న జిల్లా బాలల పరిరక్షణ విభాగం వారి ఆధ్వర్యంలో బాల్యవివాహాల నిర్మూలకై తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కార్యక్రమము రేవల్లి మండలంలోని తల్పునూర్ జెడ్పిహెచ్ఎస్ పాఠశాల నందు నిర్వహించారు. ఈ యొక్క సమావేశానికి జిల్లా బాలల పరిరక్షణ అధికారి హాజరై మాట్లాడుతూ వనపర్తి జిల్లాను బాల్య వివాహ రహిత జిల్లాగా మార్చడంలో ప్రతి ఒక్కరు కృషి చేయాలని, అమ్మాయికి 18 సంవత్సరాలు నిండిన తర్వాత, అబ్బాయికి 21 సంవత్సరాలు నిండిన తర్వాత వివాహాలు చేసుకోవాలన్నారు. ఒకవేళ అలా కాని పక్షంలో ముందుగా తల్లిదండ్రులు గాని, మిగతా ఎవరైనా చేయాలని ప్రోత్సహించిన వెంటనే చైల్డ్ హెల్ప్ లైన్ టోల్ ఫ్రీ నెంబర్ 1098 కు సమాచారం అందించాలని కోరారు. ఆడపిల్లలు బాల్య వివాహాలు చేసుకోవడం ద్వారా తొందరగా గర్భం దాల్చడం, రక్తహీనత, కుటుంబ వివరాల నిర్వహణ సక్రమంగా చూసుకోకపోవడం, ఆర్థికంగా వెనుకబాటుతనం, ఇవన్నీ సమస్యలు కూడా బాలవివాహాల వల్ల జరుగుతాయని అన్నారు. వీటిని అధిగమించుకోవాలంటే ప్రతి ఒక్కరు కూడా మంచిగా చదువుకొని ఉన్నత శిఖరాలకు ఎదగాలని, మీ తల్లిదండ్రులు పడిన కష్టాన్ని వృధా కాకుండా చూసుకోవాలని ఈ సందర్భంగా విద్యార్థులకు సూచించారు. దానితోపాటు సేఫ్ టచ్ అన్సేఫ్ టచ్ బాలల న్యాయ చట్టం ఫోక్సా ఆక్ట్ 2012 వాటిపై కూడా అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో బాలల సంక్షేమ సమితి సభ్యులు శ్రీ విష్ణు, పిఓఎస్ఐసి సురేందర్, ఐసిడిఎస్ సూపర్వైజర్ సుజాత, ఆపరేషన్ స్మైల్ ఎస్ఐ రాము, చైల్డ్ లైన్ సిబ్బంది రవిరాజు, ఆర్డీఎస్ సిబ్బంది మోబినా బేగం, పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

## మున్సిపల్ ఎన్నికల్లో నోడల్ అధికారుల పాత్ర క్రియాశీలకం


- జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి ఆదర్శ్ సురభి




**వనపర్తి బ్యూరో, జనవరి 28 (జనంసాక్షి) :** మున్సిపల్ ఎన్నికలను నిష్పక్షపాతంగా, పారదర్శకంగా నిర్వహించడంలో నోడల్ అధికారుల పాత్ర అత్యంత కీలకమని జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి ఆదర్శ్ సురభి స్పష్టం చేశారు. బుధవారం జిల్లా కలెక్టరేట్?లోని కాన్ఫరెన్స్ హాల్లో జిల్లా కలెక్టర్ అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు యాదయ్య తో కలిసి ఎన్నికల నోడల్ అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా కలెక్టర్ నోడల్ అధికారులకు పలు సూచనలు చేశారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో మున్సిపల్ ఎన్నికల మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ అమల్లోకి వచ్చిందని, దీనిని అధికారులు కచ్చితంగా అమలు చేయాలని ఆదేశించారు. అధికారులందరూ తమ తమ బాధ్యతల్ని ఎలాంటి తప్పులు లేకుండా పక్కాగా నిర్వహించాలన్నారు. ఎన్నికల ప్రవర్తన నియమావళి అమలులో ఎలాంటి ఇబ్బందులు లేకుండా పక్కాగా అమలు చేసేలా నోడల్ అధికారిగా డిఆర్డిఓ ఉమాదేవి చర్యలు తీసుకోవాలని సూచించారు. ఎప్పటికప్పుడు నివేదికలు పంపాల్సి ఉంటుందని సూచించారు. బ్యాలెట్ పేపర్ల ప్రింటింగ్ అనంతరం వాటిని పోలీసు రక్షణలో తీసుకువచ్చే బాధ్యత ను సంబంధిత నోడల్ అధికారి మత్స్యశాఖ అధికారికి అప్పగించారు. నోడల్ అధికారులు అందరూ తమకు కేటాయించిన విభాగాలపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని, ఎన్నికల నిబంధనలను క్షుణ్ణంగా చదువుకోవాలని సూచించారు. ఏవైనా సందేహాలు ఉంటే వెంటనే నివృత్తి చేసుకోవాలని ఆదేశించారు. ఎన్నికల విధుల్లో పాల్గొనే సిబ్బందికి సకాలంలో ఉత్తర్వులను అందజేయాలని జిల్లా విద్యాశాఖ అధికారికి ఆదేశించారు. ఎఫ్ ఎస్టి, ఎస్ఎస్టి బృందాలకు వాహనాలతో పాటు, ఎన్నికల సామాగ్రి తరలించేందుకు కావలసిన రవాణా సౌకర్యాలను చూసుకోవాలని జిల్లా రవాణా అధికారికి సూచించారు. అదేవిధంగా నోడల్ అధికారులు తమ తమ కార్యాలయాల్లో ఎలాంటి రాజకీయ సంబంధిత చిహ్నాలు పోస్టర్లు లేకుండా తొలగించాలని సూచించారు. రాజకీయ పార్టీల విషయంలో జోక్యం చేసుకోకుండా తమ సిబ్బందికి సూచించాలని కలెక్టర్ నోడల్ అధికారులకు తెలియజేశారు. ఈ సమావేశంలో డిఆర్డిఓ ఉమాదేవి, మత్స్యశాఖ అధికారి లక్ష్మప్ప, డిప్యూటీ సీఈవో రామమహేశ్వర్, డిపిఆర్ఓ సీతారాం, జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ అధికారి అఫ్జాలుద్దీన్, డిటిఓ మానస, తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధి పథకం పేరు మార్చడం మోడీ ప్రభుత్వానికి తగదు

- ఏఐసీసీ ఇన్చార్జ్ మీనాక్షి నటరాజన్




**చిన్నశంకరంపేట, జనవరి 28 (జనం సాక్షి) :** మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం పేరును కేంద్ర ప్రభుత్వం మోడీ మార్చడం తగదని కాంగ్రెస్ పార్టీ ఏఐసీసీ ఇంచార్జ్ మీనాక్షి నటరాజన్ అన్నారు. బుధవారం చిన్న శంకరంపేట మండలం కోర్వి పల్లి గ్రామంలో ఉపాధి హామీ పథకం పేరు మార్చడం పట్ల నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమానికి ఏఐసీసీ తెలంగాణ ఇంచార్జ్ మీనాక్షి నటరాజ్, తెలంగాణ రాష్ట్ర పిసిసి అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్, జిల్లా అధ్యక్షులు ఆంజనేయులు గౌడ్, మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ పాల్గొనగా, ఆమె మాట్లాడుతూ 2005 సంవత్సరంలో కేంద్ర ప్రభుత్వం మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం కేంద్రంలో ప్రవేశపెట్టిందని తెలిపారు. పేద బడుగు బలహీన వర్గాల కోసం ఉపాధి హామీని తీసుకొచ్చినట్లు తెలిపారు.. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు మాజీ పిసిసి అధ్యక్షులు వి. హనుమంతరావు, పిసిసి అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్, పిసిసి ప్రతినిధి అనిల్, పీసీసీ ప్రతినిధి ముబాకర్ అలీ ఖాన్, దండాలయ్య చైర్మన్ సుహాసిని, దుబ్బాక ఇన్చార్జి శ్రీనివాస్ రెడ్డి, సర్పంచుల పో రం జిల్లా అధ్యక్షుడు గోపాల్ రెడ్డి, సర్పంచుల పోరం మండల అధ్యక్షుడు అలావత్ మోహన్ నాయక్, మాజీ ఎంపీపీ అరుణ ప్రభాకర్, కోర్విపల్లి సర్పంచ్ పుల్లారావు తోపాటు కాంగ్రెస్ సీనియర్ నాయకులు కార్యకర్తలు ప్రజలు పాల్గొన్నారు.

## ఎన్నికలు సజావుగా సాగేందుకు రాజకీయ పార్టీలు సహకరించాలి

- రాజకీయ పార్టీలు ఎన్నికల ప్రవర్తన
- నియమావళికి కట్టుబడి ఉండాలి
- జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి



**వనపర్తి బ్యూరో, జనవరి 28 (జనం సాక్షి) :** మునిసిపల్ ఎన్నికలకు రాష్ట్ర ఎన్నికల సంఘం షెడ్యూల్ విడుదల చేసిన నేపథ్యంలో, ప్రవర్తన నియమావళి అమల్లోకి వచ్చిందని రాజకీయ పార్టీలు నియమావళి, నిబంధనలకు కట్టుబడి ఉండాలని జిల్లా ఎన్నికల అథారిటీ ఆదర్శ్ సురభి సూచించారు. బుధవారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో ఎన్నికల ప్రవర్తన నియమావళి, ఎన్నికల నిబంధనల పై అవగాహన కల్పించేందుకు గుర్తింపు పొందిన వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో జిల్లా కలెక్టర్ సమావేశం నిర్వహించారు. జిల్లాలోని 5 మున్సిపాలిటీల పరిధిలో 80 వార్డులకు ఎన్నికలు నిర్వహించనున్నట్లు తెలియజేశారు. మున్సిపాలిటీ ఎన్నికల్లో పోటీ చేయబోయే అభ్యర్థులు జనవరి 28 నుండి 30వ తేదీ వరకు నామినేషన్లు వేసుకోవచ్చని, ఉదయం 10-30 నుండి సాయంత్రం 5.00 గంటల వరకు నిర్దేశించిన రిటర్నింగ్ అధికారి కార్యాలయంలో నామినేషన్లు వేసుకోవాల్సిందిగా సూచించారు. నామినేషన్లు వేయడానికి చివరి తేదీ జనవరి 30, సాయంత్రం 5:00 గంటల వరకు మాత్రమే అని తెలిపారు. నామినేషన్ దాఖలు చేసే సమయంలో రిటర్నింగ్ అధికారి గదిలోకి అభ్యర్థితో పాటు గరిష్టంగా ముగ్గురు సభ్యులకు మాత్రమే అనుమతి ఉంటుందన్నారు. అభ్యర్థిని ప్రతిపాదించే వ్యక్తి తప్పనిసరిగా అదే వార్డుకు చెందిన ఓటరై ఉండాలని, పోటీ చేసే అభ్యర్థి సదరు మున్సిపాలిటీ పరిధిలోని ఏ వార్డు ఓటరైనా అయి ఉండవచ్చని తెలిపారు. జనవరి 31న నామినేషన్ల పరిశీలన ప్రక్రియ జరుగుతుందని తెలిపారు. ఫిబ్రవరి 11న పోలింగ్ జరుగుతుందని, ఫిబ్రవరి 13న ఓట్ల లెక్కింపు నిర్వహించబడుతుందని తెలియజేసారు. వార్డు స్థానాలకు పోటీ చేయు అభ్యర్థులు నామినేషన్ వేయడానికి జనరల్ అభ్యర్థి కి రూ.2500, ఎస్సీ, ఎస్టీ, బీసీ అభ్యర్థులు రూ.1,250 డిపాజిట్ చేయాల్సి ఉంటుంది. పోటీ చేసే అభ్యర్థులు ఏదైనా రిజిస్టర్డ్ బ్యాంకులో కొత్తగా బ్యాంక్ అకౌంట్ ఓపెన్ చేసి ఆ ఖాతా నుంచి మాత్రమే ఖర్చు చేయాల్సి ఉంటుందన్నారు. ఎన్నికలు ప్రశాంతంగా, పారదర్శకంగా జరిగేందుకు రాజకీయ పార్టీలన్నీ సహకరించాలని కలెక్టర్ కోరారు. ఎన్నికల ప్రచారం కోసం సంబంధిత పార్టీల అభ్యర్థులు ముందస్తుగా తహసిల్దార్ నుంచి అనుమతులు తీసుకోవాలని సూచించారు. సంబంధిత రాజకీయ పార్టీల అభ్యర్థులు నామినేషన్ విత్ డ్రా చేసుకునే నాటి కల్లా ఫామ్ బి సమర్పించేలా చూసుకోవాలన్నారు. ప్రతి ఒక్కరూ ఎన్నికల ప్రవర్తన నియమావళిని పాటించాలని సూచించారు. అదనపు కలెక్టర్ లోకల్ బాడీస్ యాదయ్య, ఆర్డీఓ సుబ్రమణ్యం, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

## బాలల హక్కులపై అవగాహన




**మహబూబ్‌నగర్ బ్యూరో, జనవరి 28 (జనం సాక్షి) :** బుధవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలోని వి.సి సమావేశ మందిరంలో మున్సిపల్ ఎన్నికలపై నిర్వహించిన అఖిలపక్ష సమావేశంలో జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి,ఎస్.పి.డి.జానకి లతో కలిసి పాల్గొన్నారు. రాష్ట్ర ఎన్నికల సంఘం మున్సిపల్ ఎన్నికల నిర్వహణకు మంగళవారం షెడ్యూల్ జారీ చేసిందని, జనవరి 28 నుండి 30 వరకు నామినేషన్ లు స్వీకరించడం జరుగుతుందని అన్నారు. అభ్యర్థులు నామినేషన్ దాఖలు చేసేటప్పుడు చెక్ లిస్ట్ ప్రకారం అన్ని డాక్యుమెంట్‌లు జత చేయాలని అన్నారు. మోడల్ కోడ్ పాటించాలని కోరారు. ప్రజలకు ఇబ్బంది లేకుండా ర్యాలీ లు,సమావేశాలు నిర్వహించాలని అన్నారు . ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు జిల్లాలో భూత్పూర్,దేవరకద్ర మున్సిపాలిటీలు, మహబూబ్ నగర్ మున్సిపల్ కార్పొరేషన్ కు ఎన్నికలను నిర్వహించడం జరుగుతుందని, వార్డు సభ్యులకు నిర్వహించే ఎన్నికల సందర్భంగా బుధవారం అన్ని మున్సిపాలిటీలలో ఎన్నికల నోటిఫికేషన్ ప్రచురించడం జరిగిందని తెలిపారు. ఈనెల 28 నుండి 30 వరకు నామినేషన్లు దాఖలు చేయవచ్చని,ఈ నెల 31న నామినేషన్ల పరిశీలన, చెల్లు బాటు నామినేషన్‌లు ప్రదర్శన,ఫిబ్రవరి 1 న నామినేషన్ల తిరస్కరణపై అప్పీల్, ఫిబ్రవరి 3న నామినేషన్ల ఉపసంహరణ అదే రోజు పోటీలో ఉన్న అభ్యర్థుల జాబితాను ప్రచురించడం జరుగుతుందని, ఫిబ్రవరి 11 న ఉదయం 7 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు మున్సిపల్ ఎన్నికల పోలింగ్ ఉంటుందని, ఫిబ్రవరి 13 న ఉదయం 8 గంటల నుండి ఓట్ల లెక్కింపు ఉంటుందని తెలిపారు. మున్సిపల్ ఎన్నికల సందర్భంగా నామినేషన్ల స్వీకరణకు ప్రతి మున్సిపాలిటీలో నామినేషన్ కేంద్రాలు ఏర్పాటు చేయడం జరిగిందని, మహబూబ్ నగర్ కార్పొరేషన్ భూత్పూర్, దేవరకద్రకు రిటర్నింగ్ అధికారులను నియమించామని, ప్రతి ఆర్ ఓ కు మూడు వార్డులు వస్తాయని ,అన్ని నామినేషన్ కేంద్రాలలో హెల్ప్ డెస్క్ లు ఏర్పాటు చేశామని, మున్సిపల్ ఎన్నికలలో బ్యాలెట్ పేపర్ ద్వారా ఓటు వేయడం జరుగుతుందని, బ్యాలెట్ పేపర్ ముద్రణ ,ఇతర అన్ని చర్యలు తీసుకున్నట్లు వెల్లడించారు. అభ్యర్థులు నామినేషన్ వేసిన రోజు నుండి ఎన్నికల ఖర్చు బుక్ చేయడం జరుగుతుందని, నామినేషన్లు వేసే సమయంలో అభ్యర్థితో పాటు, మరో ఇద్దరిని నామినేషన్ వేసే ఆర్ ఓ గదిలోకి అనుమతించడం జరుగుతుందని, అలాగే రెండు వాహనాలకు అనుమతి ఉంటుందని తెలిపారు. ఎన్నికలకు సంబంధించి ఫిర్యాదులు ఉన్నట్లయితే జిల్లా స్థాయిలో కలెక్టర్ కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేయడం జరిగిందని, కంట్రోల్ రూమ్ నెంబర్ 08542 241165 కు తెలియజేయాలని కలెక్టర్ కోరారు. జిల్లా ఎస్పీ డి జానకి మాట్లాడుతూ ఎన్నికలను శాంతియుతంగా, స్వేచ్ఛగా నిర్వహించడంలో రాజకీయ పార్టీల సహకారం ఎంతో అవసరమని, ఎన్నికల సందర్భంగా రాజకీయ పార్టీలు నామినేషన్ మొదలుకొని, కౌంటింగ్ వరకు అన్ని నియమ, నిబంధనలు తప్పకుండా పాటించాలని, ప్రచారానికి ముందస్తు అనుమతులు తీసుకోవాలని, ర్యాలీలలో పాల్గొనేవారి సంఖ్య ,రూట్ ను ముందే పోలీసులకు తెలియజేయాలని, సామాజిక మాధ్యమాల్లో వచ్చే అసత్య వార్తలు నమ్మవద్దని, వ్యక్తిగత,రెచ్చ గొట్టే పోస్ట్ లు పెట్ట వద్దని,ఎన్నికలు స్వేచ్ఛగా నిర్వహించేలా సహకరించాలని కోరారు. ఈ సందర్భంగా వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు మాట్లాడుతూ ప్రాపర్టీ టాక్స్ నో డ్యూస్ సర్టిఫికెట్ త్వరగా ఇప్పించాలని కోరారు. సమావేశంలో స్థానిక సంస్థల అధనపు కలెక్టర్ శివేంద్ర ప్రతాప్, జిల్లా ఎన్నికల వ్యయ పరిశీలకులు శ్రీనివాస్ బాబు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజల సమస్యలు పరిష్కరిస్తాం

- సర్పంచ్ సాయప్ప హామీ



**మద్దూరు, జనవరి 28 (జనం సాక్షి) :** మద్దూర్ మండలం ఖాజీపూర్ గ్రామంలో గ్రామపంచాయతీ కార్యాలయంలో గ్రామ సభ సమావేశం శాంతియుతంగా జరిగింది. ఈ సమావేశానికి గ్రామ సర్పంచ్ ఎం.సాయప్ప అధ్యక్షత వహించారు. గ్రామంలోని తాగునీటి సమస్య, వీధిలైట్ల ఏర్పాటు, డ్రైనేజీ సదుపాయం, అంతర్గత రోడ్ల అభివృద్ధి, పారిశుధ్యం వంటి అంశాలపై గ్రామస్తులు తమ సమస్యలను సభలో ప్రస్తావించారు. వాటిని శ్రద్ధగా విన్న సర్పంచ్ సాయప్ప మాట్లాడుతూ ప్రజల సమస్యలను దశలవారీగా పరిష్కరిస్తామని గ్రామాభివృద్ధే తమ ప్రధాన లక్ష్యమని తెలిపారు. గ్రామాభివృద్ధి పనుల్లో ప్రజల భాగస్వామ్యం ఎంతో అవసరమని పేర్కొన్న ఆయన, ప్రతి ఒక్కరూ సహకరించాలని గ్రామ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి యండి.షాజిల్, ఉపసర్పంచ్ భీమమ్మ, వార్డు సభ్యులు శాంత్ కుమార్, నవీన్ కుమార్, పద్మమ్మ, జి.పద్మమ్మ, కే.గోవిందు, అనసుజా, బాలకృష్ణ, గ్రామ పెద్దలు, మహిళలు, యువకులు యండి.ఖాజా, పి.కృష్ణ, కె.లాలప్ప, ప్రభు, ఆశ వర్కర్లు, విఓఏలు అంగన్వాడి టీచర్, మరియు వివిధ శాఖల అధికారులు, పెద్ద సంఖ్యలో గ్రామస్తులు పాల్గొన్నారు.

# జాతరలో అభివృద్ధి పనులు ప్రారంభం

- దర్శనం చేసుకున్న ఎంఎల్‌ఏ కడియం, ప్రజాప్రతినిధులు



**స్టేషన్ ఘన్ పూర్, జనవరి 28 (జనంసాక్షి) :** స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గ పరిధిలోని వేలేరు మండలం పీచర, చిల్పూర్ మండలం శ్రీపతిపల్లి–కొండాపూర్, లింగంపల్లి, గార్లగడ్డ తండా– ఫతేపూర్, స్టేషన్ ఘనపూర్ మండలం జిట్టేగూడెం–తాటికొండ, ఇప్పగూడెంలలో ప్రారంభం అయిన శ్రీ సమ్మక్క- సారాలమ్మ మినీ జాతరలకు వచ్చే భక్తుల కోసం మౌలిక వసతుల కల్పనకు 89.50 లక్షలతో చేపట్టిన తాగునీటి సరఫరా సౌకర్యాల ను, తాత్కాలిక మరుగుదొడ్లు, పారిశుధ్యం, రోడ్ల మరమ్మతులు, హై మాస్ ఫ్లడ్ లైట్లను ఎమ్మెల్యే కడియం శ్రీహరి బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కడియం శ్రీహరి అమ్మవార్లను దర్శించుకొని ఎత్తుబంగారం మొక్కును చెల్లించారు. సారాలమ్మ గద్దె పైకి రాగానే భక్తులు పెద్ద ఎత్తున మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కడియం శ్రీహరి మాట్లాడుతూ భక్తుల సౌకర్యమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యం అని, జాతరలకు వచ్చే లక్షలాది భక్తులకు ఎలాంటిఇబ్బందులు కలగకుం డా త్రాగునీరు, విద్యుత్ వంటి మౌలిక వసతుల ను మరింత బలోపేతం చేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో చిల్పూర్ గుట్ట ఆలయ కమిటీ చైర్మన్ పొట్లపల్లి శ్రీధర్ రావు, సర్పంచ్ లు గుగులోతు లక్ష్మీ ఉమ్లా నాయక్, మారపాక సుజనా శ్రీనివాస్, బానోతు బాలు నాయక్, నవీన్ నాయక్, తాటికొండ , జిట్టె గూడెం జాతర గౌరవ అధ్యక్షుడు, మాజీ వైస్ ఎంపీపీ చల్లా సుధీర్ రెడ్డి, లింగంపల్లి చైర్మన్ కండ్లకోలు శ్రీనివాస్, రాపోలు మధుసూదన్ రెడ్డి, కండ్లకో లు బాలరాజు, తాటికొండ ఉప సర్పంచ్ ఎడమ కట్టమల్లు,జిట్టగూడెం ఉపసర్పంచ్ లునా వత్ రజిత రవీందర్, భూక్యా సంజీవ, రవీందర్, బొమ్మిశెట్టి బాలరాజు, గడ్డమీద సురేష్, మాజీ సర్పంచ్ బానోత్ రూప్లానాయక్, వెంకటేశ్వర్లు, చాడ రాజకుమార్, బోళ్ల రాజు, బొంకూరి యాదగి రి, బాలరాజు, పంచాయతీ రాజ్, విద్యుత్, రూరల్ వాటర్ సప్లై, ఎండోమెంట్, రెవిన్యూ, పోలీస్ శాఖ ల అధికారులు,జాతర కమిటీల చైర్మన్లు,డైరెక్టర్లు, సర్పంచులు, స్థానిక నాయకు లు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# మల్లన్న గండి వద్ద గద్దెకు చేరిన సారలమ్మ

- మొక్కులు చెల్లించుకున్న భక్తులు



**స్టేషన్ ఘన్ పూర్,జనవరి 28 ( జనం సాక్షి ) :** మండలంలోని తాటికొండ, జిట్టెగూడెం గ్రామ పంచాయతీ ల పరిధిలో మల్లన్న గండి రిజర్వా యర్ వద్ద ఉన్న సమ్మక్క సారలమ్మ జాతర ప్రారంభం అయినది. బుధవారం జాతర గౌరవ అధ్యక్షుడు చల్లా సుధీర్ రెడ్డి, తాటికొండ, జిట్టె గూడెం సర్పంచ్ లు మారపాక సుజనా శ్రీనివాస్, బానోతు బాలు నాయక్, ఉప సర్పంచ్ లు ఎడమ కట్టమల్లు,లునావత్ రజిత రవీందర్ ఆధ్వర్యంలో కోయా పూజారులు అత్యంత వైభవంగా వనం నుండి శ్రీ సారలమ్మ దేవతను గద్దె మీదకు తీసు కువచ్చి పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు అధిక సంఖ్యలో హాజరై మొక్కులు తీర్చు కున్నారు. జాతర ప్రాంగణం నుంచి మల్లన్న గండి రిజర్వాయర్ వరకు భక్తులు పెద్దసంఖ్యలో గుడా రాలు వేసుకొని అక్కడే వంటలు చేసుకుంటున్నా రు. భక్తుల సౌకర్యార్థం వివిధ రకాల దుకాణాలు జాతరప్రాంగణంలో వెలిసాయి. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా అన్నిసౌకర్యాలు కల్పిం చారు. ఈ కార్యక్రమంలో రాపోలు మధుసూదన్ రెడ్డి, చల్లా రాజిరెడ్డి, బొంకూరి యాదగిరి, రాజు, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# మున్సిపల్ ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించాలి

**జిల్లా అదనపు కలెక్టర్ పింకేష్ కుమార్**



**జనగామ ప్రతినిధి జనవరి 28 (జనంసాక్షి) :** జనగామ జిల్లాలో మున్సిపల్ ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించాలని జిల్లా అదనపు కలెక్టర్ పింకేష్ కుమార్ అన్నారు. మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల సాధారణ పరిశీలకులు (అబ్జర్వర్) ఎ.నర్సింహారెడ్డి, వ్యయ పరిశీలకులు ఎస్.జయశ్రీలు బుధవారం కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్ పింకేష్ కుమార్‌తో కలిసిన ఎన్నికల నిర్వహణపై చర్చించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ మున్సిపల్ ఎన్నిలు సజావుగా, ప్రశాంతంగా నిర్వహించేందుకు ఎన్నికల్లో మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ అమలు చేస్తున్నామని తెలిపారు. పోలింగ్ నిర్వహణకు తీసుకుంటున్న ముందస్తు చర్యలపై అబ్జర్వర్లకు వివరించారు. పకడ్బందీ ఏనిప్రట్లు చేస్తున్నామని, ఎలాంటి సమస్యలు ఉత్పన్నం కాకుండా ప్రశాంతంగా నిర్వహించనున్నామని తెలిపారు. ఇప్పటికే ఎన్నికల అనుభవమున్న 16 మంది రిటర్నింగ్ అధికారులను నియమించామని, వారు ఇప్పటికే క్షేత్రస్థాయిలో పర్యటించారని తలిపారు. బ్యాలెట్ పేపర్ల ప్రింటింగ్ తదితర అంశాలపై చర్చించారు. రిటర్నింగ్ అధికారులతో మరోసారి సమావేశం ఏర్పాటు చేసి కూలంకుశంగా చర్చిస్తామని అబ్జర్వర్లు తెలిపారు. సాధారణ పరిశీలకులు ఎ.నర్సింహారెడ్డికి ప్రాజెక్టు డైరెక్టర్ మాత్రునాయక్ నోడ్ ఆఫీసర్‌గా అలాగే వ్యయపరిశీలకులు ఎస్.జయశ్రీకి డీసీవో కోడండరాం నోడల్ ఆఫీసర్లుగా నియమించామని తెలిపారు.

# నామినేషన్ల ప్రక్రియలో అప్రమత్తంగా ఉండాలి

- మంచిర్యాల జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కుమార్ దీపక్



**బెల్లంపల్లి, జనవరి 28, (జనంసాక్షి) :** 2వ సాధారణ మున్సిపల్ ఎన్నికలలో భాగంగా నామినేషన్ల ప్రక్రియలో అప్రమత్తంగా ఉండాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. బుధవారం బెల్లంపల్లి మున్సిపల్ పరిధిలో ఏర్పాటు చేసిన నామినేషన్ల స్వీకరణ కేంద్రాన్ని మున్సిపల్ కమిషనర్ జె సంపత్ తో కలిసి సందర్శించి నామినేషన్ల ప్రక్రియతీరును పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కుమార్ దీపక్ మాట్లాడుతూ 2వ సాధారణ మున్సిపల్ ఎన్నికలలో భాగంగా ఈ నెల 30వ తేదీ వరకు నామినేషన్లు స్వీకరించాలని, బెల్లంపల్లి మున్సిపల్ పరిధిలోని 34 వార్డులకు సంబంధించి అభ్యర్థుల నుండి నామినేషన్లు స్వీకరించేందుకు చర్యలు చేపట్టామన్నారు. అభ్యర్థుల నామినేషన్ పత్రాలను ఎన్నికల సంఘం నిబంధనలకు లోబడి నిర్ణీత సమయంలోగా స్వీకరించాలన్నారు. 30వ తేదీ సాయంత్రం 5 గంటలలోగా నామినేషన్ స్వీకరణ కేంద్రంలో ఉన్నవారి నుంచి నామినేషన్లు స్వీకరిస్తామని అన్నారు. సమయం ముగిసిన తర్వాత వచ్చిన వారి నుండి స్వీకరించడం జరగదని వివరించారు. నామినేషన్ల స్వీకరణ కోసం టేబుళ్లు ఏర్పాటు చేశామని, 100 మీటర్ల నిబంధన అమలు చేయడం జరుగుతుందన్నారు. నామినేషన్ దరఖాస్తులు నింపడం, జతపరచవలసిన పత్రాలు, ఇతర వివరాల కొరకు హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈనెల 31న నామినేషన్లు పరిశీలించి అర్హత గల అభ్యర్థుల జాబితా ప్రకటన, ఫిబ్రవరి 1న నామినేషన్లపై అభ్యంతరాలు, ఫిర్యాదుల స్వీకరణ, 2న అభ్యంతరాలు, ఫిర్యాదుల పరిష్కారం, 3న నామినేషన్ల ఉపసంహరణ అనంతరం పోటీలో ఉండే అభ్యర్థుల తుది జాబితా ప్రకటిస్తామని తెలిపారు. ఫిబ్రవరి 11న పోలింగ్, 12న రీపోలింగ్ (ఏమైనా ఉన్నట్లయితే), 13న ఓట్ల లెక్కింపు ప్రక్రియ చేపట్టి గెలుపొందిన అభ్యర్థుల ప్రకటన జరుగుతుందన్నారు. మున్సిపల్ ఎన్నికల నిర్వహణలో భాగంగా జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలో కంట్రోల్ రూమ్ నం.08736-250501 ఏర్పాటు చేశామని, ఎన్నికల సంబంధించిన సమాచారం, ఎన్నికల ప్రవర్తన నియమావళి ఉల్లంఘనపై ఫిర్యాదుల కోసం సంప్రదించవచ్చన్నారు. సమాచారం అందించిన వారి వివరాలు గోప్యంగా ఉంచడం జరుగుతుందన్నారు. జిల్లాలో ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించేందుకు ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారం అధికారుల సమన్వయంతో చర్యలు తీసుకుంటారన్నారు. ఆయన వెంట సంబంధిత అధికారులు ఉన్నారు.

# చారిత్రక ఆలయాల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి

- వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్యశారద..
- వరంగల్ కోటలో నూతన పురావస్తు మ్యూజియం అభివృద్ధిపై సమీక్ష



**వరంగల్ ప్రతినిధి, జనవరి 28 (జనం సాక్షి):** వరంగల్ లోని చారిత్రక దేవాలయాల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టిని సారించినట్లు జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద అన్నారు. బుధవారం వరంగల్ కోటలో నూతనంగా ఏర్పాటు చేయనున్న పురావస్తు మ్యూజియం అభివృద్ధి పనులపై కుడా కార్యాలయ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ డాక్టర్ సత్య శారద, పురావస్తు శాఖ డైరెక్టర్ అర్జున్ రావు, ఇతర అధికారులతో కలిసి మ్యూజియం అభివృద్ధి, వారసత్వ సంపద పరిరక్షణకు సంబంధించిన వివిధ అంశాలపై చర్చించారు. ఈ సమావేశంలో కాకతీయ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (కుడా) వైస్ చైర్పర్సన్ చాహత్ బాజ్‌పాయ్, సీపీవో అజిత్ రెడ్డి, పురావస్తు శాఖ అధికారులు, టీమ్ ఆఫ్ రీసెర్చ్ ఆన్ కల్చర్ అండ్ హెరిటేజ్ కార్యదర్శి అరవింద్ ఆర్య, తదితరులు పాల్గొని, వరంగల్‌ను టూరిజం హబ్‌గా తీర్చిదిద్దే దిశగా చేపట్టాల్సిన చర్యలపై కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా పురావస్తు శాఖ డైరెక్టర్ అర్జున్ రావు మాట్లాడుతూ ప్రస్తుతం ఉన్న వరంగల్ పురావస్తు మ్యూజియంను వరంగల్ కోటలో నూతనంగా నిర్మించిన భవనానికి తరలించే దిశగా చర్యలు చేపట్టాలని సూచించారు. వరంగల్ కోటతో పాటు పరిసర వారసత్వ ప్రాంతాల్లో చేపట్టవలసిన మరమ్మత్తులు, అభివృద్ధి పనుల అంచనాల కోసం కుడా ఇంజనీరింగ్ విభాగం, హెరిటేజ్ శాఖలు సంయుక్తంగా త్వరలోనే స్థల పరిశీలన చేపట్టనున్నట్లు తెలిపారు. వరంగల్ కోటలోని మ్యూజియం అభివృద్ధి లో భాగంగా కాంపౌండ్ వాల్ నిర్మాణం, ల్యాండ్ స్కేపింగ్, విద్యుత్ సదుపాయాల కల్పన వంటి అంశాలపై విస్తృతంగా చర్చించారు. అలాగే మొగిలిచర్లలోని ఏకవీర దేవాలయ పునరుద్ధరణ, శాయంపేటలోని పాంచాలరాయ ఆలయ అభివృద్ధి, వరంగల్ కోటలోని శంభుని గుడి పునరుద్ధరణ అంశాలపై ప్రత్యేక దృష్టి సారించనున్నట్లు తెలిపారు. వరంగల్ నగరానికి ఉన్న చారిత్రక, సాంస్కృతిక ప్రాముఖ్యతను దృష్టిలో ఉంచుకుని, వారసత్వ పరిరక్షణతో పాటు పర్యాటకాభివృద్ధికి దోహదపడే విధంగా పనులు చేపట్టాలని జిల్లా కలెక్టర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో వరంగల్ ఆర్డీవో సుమ, యూత్ వెల్ఫేర్ ఆఫీసర్, ఇంచార్జ్ టూరిజం ఆఫీసర్ అనిల్ కుమార్, తహసిల్దార్ శ్రీకాంత్, ఇంజినీరింగ్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# అభివృద్ధిని అడ్డుకుంటే సహించేది లేదు

- హనుమకొండ చౌరస్తాలో బహిరంగ చర్చకు సిద్ధమా కేటీఆర్
- బీఆర్ఎస్,బీజేపీ డిపాజిట్ల కోసం ఆరాటం
- మీడియా సమావేశంలో ఎమ్మెల్యే నాయిని



**హనుమకొండ ప్రతినిధి, జనవరి 28 (జనం సాక్షి) :** హనుమకొండ జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో వరంగల్ పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి మీడియా సమావేశం ఏర్పాటు చేయడం జరిగింది మీడియా సమావేశంలో వారు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో అభివృద్ధి చేయకపోవడమే కాకుండా, ప్రస్తుతం జరుగుతున్న అభివృద్ధి పనులను చూసి ఓర్వలేక అడ్డుకుంటున్నారని బీఆర్ఎస్ నేతలపై ఆయన తీవ్ర ఆరోపణలు చేశారు. సెంట్రల్ జైలు ఎదురుగా ఉన్న కల్పత సూపర్ బజార్ సహా పలు విభాగాల్లో భారీ అవినీతి జరిగిందని ఎమ్మెల్యే ఆరోపించారు. కల్పత సూపర్ మార్కెట్ ద్వారా నెలకు సుమారు రూ.1.20 లక్షల చూన 24 నెలలు 28,80000 ల నిధులను భినామి పేర్లతో పనిచేయకున్నా చేసినట్టు దుర్వినియోగం చేసుకున్నారు. ఆ నిధులను దోచుకుని ప్రజలకు ఉపయోగపడే పనులకు ఖర్చు చేయలేదని మండిపడ్డారు. గత పాలకుల కనుసన్నల్లో అవినీతి జరిగిందని ఎమ్మెల్యే నాయిని తెలిపారు. పని చేసే సిబ్బంది లేకపోయినా జీతాలు డ్రా చేశారని, పెట్రోల్ బిల్లులను డ్రైవర్ పేరిట సుమారు 9,65,000 లను , సభ్యత్వాల పేరిట కలిపి మొత్తంగా సుమారు రూ 50లక్షల నిధుల దుర్వినియోగం జరిగిందని తెలిపారు. ఈ వ్యవహారాన్ని తాను స్వయంగా పరిశీలించినప్పుడు అనేక అక్రమాలు బయటపడ్డాయని, సంబంధిత కమిటీలకు చట్టబద్ధత కూడా లేదని అన్నారు. ఈ అక్రమాల్లో బీఆర్ఎస్ నాయకులు భాగస్వాములుగా ఉన్నారని స్పష్టం చేశారు. మాడ వీధుల అభివృద్ధి పేరుతో గతంలో గుడిసె వాసులను ఇబ్బంది పెట్టింది మీరు కాదా అని ప్రశ్నించిన ఎమ్మెల్యే నాయిని.. నేడు కాంగ్రెస్ ప్రభుత్వం అభివృద్ధి పనులు చేపడితే రెచ్చగొట్టే ప్రయత్నాలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. తాను ఎమ్మెల్యే గా గెలిచిన వెంటనే ప్రభుత్వంలో మెప్పించి నిధులు వెంటనే మంజూరు చేసుకుని వచ్చి అభివృద్ధి చేస్తుంటే కులమతాలను రెచ్చగొట్టడం ఎందుకు అని,ఇంకా ఎన్ని రోజులు కులాలు,మతాలు పేరుతో రాజకీయ పబ్బం గడుపుతావని,వరంగల్ పశ్చిమ నియోజకవర్గ ప్రజల తరపున హనుమకొండ చౌరస్తాలో బహిరంగ చర్చకు రావాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు సవాల్ విసిరారు. గత పదేళ్లలో తీసుకొచ్చిన నిధులు, ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో వచ్చిన నిధులపై బహిరంగంగా చర్చిద్దామని అన్నారు. ఈ సమావేశంలో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి ఈవి శ్రీనివాస్ రావు,ఫ్లోర్ లీడర్ తోట వెంకటేశ్వర్లు, కార్పొరేటర్లు జక్కుల రవీందర్,విజయ శ్రీ,బ్లాక్ అధ్యక్షులు నాయిని లక్ష్మా రెడ్డి,బంక సంపత్,అంబేద్కర్ రాజు,అనుబంధ సంఘాల చైర్మన్‌కు పెరుమాండ్ల రామకృష్ణ,రాజ్ కుమార్,శ్రవణ్,సీనియర్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# భూకంపం వచ్చినా భూపాలపల్లి జిల్లా పోదు

- అబద్ధాలు చెప్పడం వారికి అలవాటే
- మున్సిపాలిటీని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తా
- ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు



**జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, (జనంసాక్షి):** భూకంపం వచ్చినా భూపాలపల్లి జిల్లా పోదు అని, అబద్ధాలు చెప్పడం ఆ పార్టీ నాయకులకు అలవాటేనని బీఆర్ఎస్ నేతలు నుద్దేశించి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు అన్నారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో సిపిఐ, సిపిఎం పార్టీ నాయకులతో కలిసి బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు మాట్లాడుతూ అబద్ధాలు కేసీఆర్ ఇంట్లోనే పుట్టాయని, ఆ పార్టీ నేతలు కూడా అబద్ధాలు చెప్పి ప్రజలను నమ్మించే ప్రయత్నం చేస్తున్నారని అన్నారు. అలాంటి అబద్ధాలను నమ్మవద్దన్నారు. శరవేగంగా అభివృద్ధి చెందుతున్న జిల్లాల్లో భూపాలపల్లి ముందు ఉందని, భూమి ఉన్నంతవరకు భూపాలపల్లి ఉంటుందన్నారు. జిల్లా పోతే తాను వచ్చే ఎన్నికల్లో పోటీ చేయనని ఈ సందర్భంగా చెప్పారు. భూపాలపల్లి మున్సిపాలిటీని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తున్నట్లు చెప్పారు. రాష్ట్రంలోనే భూపాలపల్లి మున్సిపాలిటీని మొదటి స్థానంలో ఉంచాలనే దృఢ సంకల్పంతో ముందుకు వెళుతున్నట్లు తెలియజేశారు. ఇప్పటికే మునిసిపాలిటీ పరిధిలో అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టినట్లు చెప్పారు. కోట్లాది రూపాయలతో రోడ్లు, భవనాలు, త్రాగునీరు, విద్యుత్ తదితర సౌకర్యాలు కల్పించినట్లు తెలిపారు. రానున్న రోజుల్లో మరిన్ని నిధులు మంజూరు చేయించి, అభివృద్ధి చేస్తానని హామీ ఇచ్చారు. భూపాలపల్లికి నాలుగు లైన్ల రోడ్డు, బైపాస్ రోడ్డుకు నిధులు మంజూరు చేయించడం జరిగిందని, జంక్షన్ల అభివృద్ధికి కూడా నిధులు మంజూరయ్యాయని రెండేళ్లలోపు అభివృద్ధి పనులన్నీ పూర్తి చేయిస్తామని ఎమ్మెల్యే చెప్పారు. మున్సిపాలిటీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ కౌన్సిలర్ అభ్యర్థులతో పాటు తమతో కలిసి వస్తున్న సిపిఐ, సిపిఎం పార్టీ అభ్యర్థులను కూడా గెలిపించాలని పిలుపునిచ్చారు. ప్రజల ఆశీర్వాదంతో భూపాలపల్లి మున్సిపల్ చైర్మన్ కైవసం చేసుకొని అభివృద్ధికి కృషి చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు బట్టు కర్ణాకర్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ కోట రాజబాబు, కాంగ్రెస్ పార్టీ లీడర్లు చల్లూరి మధు, బుర్ర కొమురయ్య, సిపిఐ, సిపిఎం నాయకులు పాల్గొన్నారు.

# భక్తులకు మెరుగైన వైద్య సేవలందించాలి

- రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ డైరెక్టర్ డాక్టర్ బి.రవీంద్ర నాయక్




**ఆత్మకూరు, జనవరి 28 (జనం సాక్షి):** శ్రీ మేడారం సమ్మక్క సారలమ్మ జాతర, అగ్రం పహాడ్ జాతర వెళ్లే భక్తులకు ఎలాంటి వైద్య పరమైన సహాయం అవసరమైనా అందించడం మన బాధ్యత అని , చికిత్సకు అవసరమైన అన్ని మందులు అందుబాటులో ఉంచుకోవడంతో పాటు వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ డైరెక్టర్ డాక్టర్ బి.రవీంద్ర నాయక్ సూచించారు. బుధవారం రోజు ఆయన జాతర కోసం ప్రత్యేకంగా కటాక్ష పూర్ లోలఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరమును సందర్శించి ఆత్మకూరు వైద్యాధికారి డాక్టర్ స్పందనతో క్యాంపుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. అలాగే మేడారం ప్రధాన రహదారిలో ఉన్న ఆత్మకూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో 24/7 సేవలు అందించాలని ,108 ఇతర లైన్ డిపార్ట్మెంట్స్ తో సమన్వయంతో పనిచేయాలన్నారు. హనుమకొండ జిల్లాలోని మినీ సమ్మక్క సారలమ్మ జాతరతో పాటు బస్ స్టేషన్ రైల్వే స్టేషన్లలో ఏర్పాటు చేసిన 22 వైద్య శిబిరాలలో భక్తులకు మెరుగైన సేవలం దించాలన్నారు. స్థానిక శాసనసభ్యులు రేవూరి ప్రకాష్ రెడ్డి , జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ సూచన లకు అనుగుణంగా అన్ని చర్యలు తీసుకున్నట్లు డాక్టర్ స్పందన తెలియజేశారు. జిల్లా వైద్యాధికారి డాక్టర్ అప్పయ్య అగ్రం పహాడ్ జాతరను సందర్శించి తగు సూచనలు అందించినట్లు అలాగే బుధవారం రోజు డిప్యూటీ డిఎంహెచ్వో డాక్టర్ ప్రదీప్ రెడ్డి ఆత్మకూరు మండలంలోని 6 వైద్య శిబిరాలను సందర్శించినట్లు డైరెక్టర్ కి తెలియజేయడం జరిగింది. డి ఎం హెచ్ ఓ ఆదేశాల మేరకు జాతరలో తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి భక్తులకు సూచనలు ఫ్లెక్సీల ద్వారా ప్రదర్శించినట్లు అలాగే అగ్రంపాడు ప్రధాన వైద్యశాలలో 10 పడకలు అన్ని అత్యవసర మందులతో పాటు ప్రజలకు అవగాహన కలిగించేందుకు ఆరోగ్య ప్రదర్శనశాల ఏర్పాటు చేసినట్లు తెలిపారు. డాక్టర్ నర్సింగరావు,జిల్లా మాస్ మీడియా అధికారి వి అశోక్ రెడ్డి , కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ టీ మాధవరెడ్డి ,జునేడి, హెచ్ ఈ ఓ కే.సంపత్ లు కావలసిన ఏర్పాట్లలో పాల్గొన్నారు.

# పోతరాజు అశోక్‌కు కాంస్య పతకం

**పరకాల, జనవరి 28 (జనం సాక్షి):** హనుమకొండ జిల్లా పరకాల మండలం నాగారం గ్రామానికి చెందిన పోతురాజు అశోక్ ఉదయ్‌పూర్‌లో నిర్వహించిన ఆల్ ఇండియా ఫైర్ సర్వీస్ కంట్రోల్ బోర్డు మీట్–2026లో 5 కిలోమీటర్ల పరుగు పందెం లో కాంస్య పతకం సాధించారు. దేశవ్యాప్తంగా జరిగిన ఈ ప్రతిష్ఠాత్మక పోటీలో అశోక్ మెడల్ సాధించడం పట్ల గ్రామస్తులు, స్నేహితులు హర్షం వ్యక్తం చేశారు.ప్రస్తుతం మట్టేవాడ ఫైర్ స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న అశోక్ సాధించిన ఈ విజయం యువతకు ప్రేరణగా నిలుస్తుందని పలువురు అభినందనలు తెలిపారు.

# తొలి రోజు నాలుగు నామినేషన్లు

**జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, (జనంసాక్షి):** భూపాలపల్లి మున్సిపాలిటీలో మొదటి రోజు నాలుగు నామినేషన్లు దాఖలు అయినట్లు మున్సిపల్ కమిషనర్ జోన తెలిపారు. రెండవ సాధారణ మున్సిపల్ ఎన్నికలను పురస్కరించుకొని బుధవారం నామినేషన్ల ప్రక్రియ ప్రారంభమైంది. ఇందులో భాగంగా తొలి రోజు నాలుగు నామినేషన్లు దాఖలు కాగా, అందులో 7వ వార్డులో బిజెపి అభ్యర్థి ఒక నామినేషన్, 9వ వార్డులో బీఆర్ఎస్ అభ్యర్థి 2 నామినేషన్లు, 28వ వార్డులో సీపీఐ అభ్యర్థి ఒక నామినేషన్ దాఖలు చేసినట్లు కమీషనర్ జోన తెలిపారు.

# పరకాలలో తొలిరోజు ఐదు నామినేషన్లు..



**హనుమకొండ ప్రతినిధి జనవరి 28 (జనం సాక్షి) :** హనుమకొండ జిల్లాపరకాల పురపాలక సంఘంలో 22 వార్డులకు నామినేషన్ల పర్వం బుధవారం ప్రారంభమైంది. 22 వార్డులకు గాను అభ్యర్థుల నుండి నామినేషన్లను స్వీకరించేందుకు ఏడు కౌంటర్లను ఏర్పాటు చేయగా రిటర్నింగ్, అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులు నామినేషన్లను స్వీకరించారు. తొలి రోజు 7,11,16,18,20 వార్డులకు ఒక్కో నామినేషన్ చొప్పున ఐదు నామినేషన్లు దాఖలయ్యాయి. నామినేషన్ల స్వీకరణ ప్రక్రియను హనుమకొండ జిల్లా అదనపు కలెక్టర్ ఎన్. రవి, పరకాల ఆర్డీఓ డాక్టర్ కన్నం నారాయణ, పురపాలక కమిషనర్ అంజయ్య, తహసీల్దార్ విజయలక్ష్మి పరిశీలించారు. నామినేషన్ల స్వీకరణ ప్రక్రియలో అధికారులు అప్రమత్తంగా ఉండాలని రిటర్నింగ్, అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులకు జిల్లా అదనపు కలెక్టర్ సూచించారు.

# మున్సిపల్ ఎన్నికలలో మూడు నామినేషన్లు

**ఖానాపూర్ జనవరి 28 (జనం సాక్షి) :** మునిసిపల్ ఎన్నికల నామినేషన్ ల ప్రక్రియ ప్రారంభం అయిన మొదటి రోజు మూడు నామినేషన్లు దాఖలు అయ్యాయి. బుధవారం మున్సిపల్ ఎన్నికల నామినేషన్లు స్వీకరిస్తున్న సందర్భంగా పట్టణంలోని 12 వార్డులో 07,09, 11వ వార్డులలో ఒక్కోటి చొప్పున నామినేషన్లు దాఖలు అయినట్లు అధికారులు ప్రకటించారు.

జనంసాక్షి
www.janamsakshi.org
గురువారం
29 జనవరి 2026

# మున్సిపాలిటీల్లోనూ అత్యధిక స్థానాలు గెలుస్తాం

- డిప్యూటీ సీఎం మల్లు బట్టి విక్రమార్క



**మధిర, జనవరి 28 (జనం సాక్షి) :** సర్పంచ్ ఎన్నికల్లో ఈ విధంగా అయితే అత్యధిక స్థానాలు గెలుపొందేమో మున్సిపాలిటీలో సైతం అదే విధంగా పెద్ద సంఖ్యలో స్థానాలు గెలుచుకొని రాష్ట్ర అభివృద్ధిని ముందుకు తీసుకుపోతామని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు అన్నారు. బుధవారం ఆయన మధిర నియోజకవర్గం కేంద్రంలో మీడియాతో మాట్లాడారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో భాగంగా మున్సిపాలిటీల ఎన్నికలకు తెరలేచిన నేపథ్యంలో మంత్రులు, ఎమ్మెల్యేలు, సీనియర్ నేతలు, పట్టణ ఇన్చార్జులు అంతా సమిష్టిగా ఆలోచన చేసి కాంగ్రెస్ పార్టీ గెలవడానికి అవకాశం ఉన్న అభ్యర్థులు, కాంగ్రెస్ భావజాలం తెలిసిన, రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకు వెళ్ళగలిగే వారిని గుర్తించి ప్రాధాన్యత ఇవ్వాలని డిప్యూటీ సీఎం సూచించారు. ఎమ్మెల్యే లందరూ ఈ అంశాన్ని సీరియస్ గా తీసుకొని మున్సిపాలిటీలోని పార్టీ ఇన్చార్జిలను సమన్వయం చేసుకొని ముందుకు వెళ్లాలని తెలిపారు. సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలోని యావత్ క్యాబినెట్ ప్రజా ప్రభుత్వం, ప్రజల ప్రభుత్వం ప్రజా సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకొని నగరాల అభివృద్ధి కోసం విశేషంగా కృషి చేస్తుందని ప్రధానంగా ఆరోగ్యం, విద్య పైన దృష్టి కేంద్రీకరించి ముందుకు వెళుతుందని తెలిపారు. తెలంగాణ పునాది, భవిష్యత్తు అంతా విద్య పైనే ఆధారపడి ఉందని క్యాబినెట్ మొత్తం భావిస్తుందని తెలిపారు. దేశంలో ఎక్కడా లేని రీతిలో ఎన్నికల ముందు ఇచ్చిన హామీల మేరకు సంక్షేమ పథకాలను అభివృద్ధి చేస్తున్నామని వివరించారు. సన్న బియ్యం, మహిళలను మహాలక్ష్మి లుగా భావిస్తూ రాష్ట్రవ్యాప్తంగా మహిళలు ఆర్టీసీలో ఉచితంగా ప్రయాణించే సౌకర్యం, ఎన్నికల ముందు ఇచ్చిన హామీల్లో 90 శాతం అమలు చేశామని డిప్యూటీ సీఎం స్పష్టం చేశారు. ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి ఐదు లక్షలు చొప్పున వెచ్చిస్తున్నామని, ఆరోగ్యశ్రీ పరిమితిని ఐదు లక్షల నుంచి 10 లక్షల పెంచామని పేద కుటుంబాల్లో భరోసా నింపామని తెలిపారు. గత ప్రభుత్వం పది సంవత్సరాల్లో ఒక్కసారి కూడా నిర్వహించని గ్రూప్ వన్ పరీక్ష ను ప్రజా ప్రభుత్వం నిర్వహించడమే కాదు ఫలితాలు సైతం వెల్లడించి ఉద్యోగాలు ఇచ్చామని తెలిపారు. అదేవిధంగా గ్రూప్ 2 సైతం పరీక్ష నిర్వహించి ఉద్యోగాలు భర్తీ చేశామని తెలిపారు. తెలంగాణ తలరాత విద్య పైనే ఆధారపడి ఉందని నిర్ణయించి ప్రపంచస్థాయి ప్రమాణాలతో కూడిన యంగ్ ఇండియా ఇంటర్నేషనల్ స్కూల్స్ ను ప్రతి నియోజకవర్గంలో ఒకటి చొప్పున నిర్మిస్తున్నామని తెలిపారు. 25 ఎకరాల విస్తీర్ణంలో 200 కోట్ల పెట్టుబడితో ఒక్కో పాఠశాలను సకల సౌకర్యాలతో నిర్మిస్తున్నామని వివరించారు. నగరాల్లో మౌలిక సదుపాయాలకు ప్రజా ప్రభుత్వం పెద్దపీట వేసిందని భారీ మొత్తంలో నిధులు ఖర్చు చేసిందని తెలిపారు. రేర్, క్యూర్ ప్యూర్ సమగ్ర విధానంతో తెలంగాణ రాష్ట్ర అభివృద్ధి కోసం గ్లోబల్ సమ్మిట్ లో 2047 విజన్ డాక్యుమెంట్ విడుదల చేశామని తెలిపారు. గ్లోబల్ సమ్మిట్ కు ప్రపంచవ్యాప్తంగా ప్రముఖులు విచ్చేసి విజయం డాక్యుమెంట్ ను అభినందించారని తెలిపారు. కోర్ అర్బన్ రీజనల్ ఎకానమీలో సేవల రంగాన్ని అభివృద్ధి చేస్తున్నామని, ప్యూర్ వెరీ అర్బన్ రీజినల్ ఎకానమీలో అన్ని మున్సిపాలిటీలను అభివృద్ధి చేసేందుకు ప్రణాళికలు రూపొందించామని తెలిపారు. రేర్ రూరల్ అగ్రికల్చర్ ఎకానమీలో గ్రామీణ ప్రాంతాల్లో వ్యవసాయ ఆధారిత పరిశ్రమలు ఏర్పాటు చేయడం, రైతులు ఉత్పత్తి చేసిన వస్తువులకు విలువలను జోడించడం ఈ విధానం ప్రధాన లక్ష్యం అని తెలిపారు. మున్సిపల్ ఎన్నికల్లో ఇతర పార్టీలతో పొత్తులకు సంబంధించిన అంశాన్ని పిసిసి అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ నాయకత్వంలో ఆలోచన చేసి నిర్ణయం తీసుకుంటారని తెలిపారు. సింగరేణిలో టెండర్లకు సంబంధించిన అంశంపై స్పష్టంగా పూర్తి ఆధారాలతో రాష్ట్ర ప్రజలందరికీ వివరించారు అయినా వారు అందులోనే తిరుగుతాను అంటే ఇక వాళ్ళ కర్మ అని డిప్యూటీ సీఎం అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దేశంలో లేరు కాబట్టి మున్సిపల్ ఎన్నికలకు సంబంధించి వారు నాకు కొన్ని సూచనలు చేశారు, మంత్రులు ఆయా ప్రాంతాల్లో మున్సిపల్ ఎన్నికల సందర్భంగా ఎదురైన సమస్యలను నాతో పంచుకున్నారు ఈ నేపథ్యంలో ప్రజాభవన్లో కొందరు మంత్రులతో నేను సమావేశం అయ్యాను అని తెలిపారు. మా మంత్రులు నాతో సమావేశం కాకుండా పిచ్చి రాతలు రాసేవారితో, చూపించే వారితో వెళతారా అని ప్రశ్నించారు. రాష్ట్ర క్యాబినెట్ ఉమ్మడి కుటుంబంలా ఎలాంటి అరామరికాలు లేకుండా పనిచేస్తుంది, రాష్ట్ర అభివృద్ధి, సంక్షేమం రాష్ట్ర భవిష్యత్తు మా అందరి ఆలోచన లక్ష్యం అని తెలిపారు. మున్సిపల్ ఎన్నికల్లో ఏ విధంగా ముందుకు వెళ్లాలి అనే అంశాన్ని ప్రజాభవంలో చర్చించాం. నిజాంబాద్ పార్లమెంట్, ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో కొన్నిచోట్ల సమస్య ఎదురైనందున అందుకు సంబంధించిన మంత్రులు నాతో సమావేశం అయ్యారని తెలిపారు. ప్రజాధరణ ఎక్కువగా ఉన్న నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీ ద్వారా సేవ చేయాలి అని కోరుకునేవారు కొన్ని ప్రాంతాల్లో ఎక్కువమంది మున్సిపల్ టికెట్లను ఆశిస్తారు అందులో తప్పులేదు ఆ జిల్లా ఇన్చార్జి మంత్రులు స్థానిక శాసనసభ్యులు సమిష్టిగా నిర్ణయం తీసుకొని గెలుపు అవకాశాలు ఉన్న వారికి టికెట్లు కేటాయిస్తారని తెలిపారు.

## తహసీల్దార్ కార్యాలయాన్ని సందర్శించిన సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్



**పెనుబల్లి, జనవరి 28 (జనం సాక్షి) :** కల్లూరు డివిజన్ సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్ బుధవారం పెనుబల్లి తాసిల్దార్ కార్యాలయాన్ని సందర్శించారు. ఈసందర్భంగా కార్యాలయంలో సాదా బైనమా ఫైల్లతో పాటు, ఇతర ఫైళ్లను పరిశీలించారు. తాసిల్దార్ కార్యాలయంలో రిజిస్ట్రేషన్లు వేగవంతం పై రైతులను అడిగి తెలుసుకున్నారు. నూతన తహసిల్దార్ వీరభద్ర నాయక్ రిజిస్ట్రేషన్ల ప్రక్రియను వేగవంతంగా నిర్వహిస్తున్నారని సబ్ కలెక్టర్ కు రైతులు వివరించారు. రిజిస్ట్రేషన్ ప్రక్రియతో పాటు పెండింగ్ ఫైళ్ల నిర్వహణ సక్రమంగా నిర్వహించాలని తాసిల్దార్, సిబ్బంది ని ఆదేశించారు.

## మున్సిపల్ ఎన్నికల నామినేషన్లకు శ్రీకారం




**భూదాన్ పోచంపల్లి, జనవరి 28 (జనం సాక్షి) :** రెండవ దశ మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో భూదాన్ పోచంపల్లి మున్సిపాలిటీలో నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ బుధవారం ప్రారంభమైంది. రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు మున్సిపాలిటీ పరిధిలోని 13 వార్డులకు గాను స్థానిక వినోబాభావే మందిరాన్ని నామినేషన్ల కేంద్రంగా ఏర్పాటు చేసి, నాలుగు రిటర్నింగ్ అధికారులను నియమించారు. మొదటి రోజే వివిధ రాజకీయ పార్టీల అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేయగా, బీఆర్ఎస్ పార్టీ నుంచి 5వ వార్డుకు బాత్క లింగస్వామి, బీజేపీ పార్టీ నుంచి 9వ వార్డుకు వలందాస్ మాధవి మహేందర్ నామినేషన్లు వేశారు. ఈ కార్యక్రమంలో సహాయ ఎన్నికల అధికారి అంజన్ రెడ్డి, రిటర్నింగ్ అధికారులు శ్రీనివాస్ రెడ్డి, భాస్కర్, మజీద్, దామోదర్ రెడ్డి, మున్సిపల్ మేనేజర్ నిర్మల, సీనియర్ అసిస్టెంట్ రాజేష్, ఆదిత్య తదితరులు పాల్గొన్నారు.

## జిల్లాలో మున్సిపల్ ఎన్నికల ఏర్పాట్లు పూర్తి

- జిల్లా ఎన్నికల అధికారి



**నల్గొండ, జనవరి 28 (జనం సాక్షి) :** రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు జిల్లాలోని అన్ని మున్సిపాలిటీలలో మున్సిపల్ ఎన్నికలను సక్రమంగా నిర్వహించేందుకు అవసరమైన ఏర్పాట్లు పూర్తయ్యాయని జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి బి. చంద్రశేఖర్ తెలిపారు. బుధవారం హాలియా మున్సిపాలిటీలో ఎన్నికల ఏర్పాట్లను, నామినేషన్ కేంద్రాన్ని పరిశీలించారు. మున్సిపల్ కార్యాలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన నామినేషన్ కేంద్రం, సహాయ కేంద్రం, రిటర్నింగ్ అధికారి గది, ఎన్నికల పంపిణీ కేంద్రం, స్వీకరణ కేంద్రం, ఓట్ల లెక్కింపు కేంద్రాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా నామినేషన్ల స్వీకరణ, ఓట్ల లెక్కింపు సందర్భంగా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సంబంధిత అధికారులకు సూచనలు చేశారు. నామినేషన్ల సమయంలో వీడియోగ్రఫీ నిర్వహించాలని, దినసరి నామినేషన్ వివరాలను టిపోల్?లో అప్లోడ్ చేయాలని ఆదేశించారు. తరువాత మీడియాతో మాట్లాడుతూ హాలియా మున్సిపాలిటీలో 12 వార్డులపై రిజర్వేషన్ల ప్రకారం ఎన్నికల నిర్వహణకు చర్యలు చేసినట్లు తెలిపారు. జిల్లావ్యాప్తంగా మూడు లక్షల తొమ్మిది వేల తొంభై ఏడు మంది ఓటర్లు ఉన్నారని, అన్ని పోలింగ్ కేంద్రాలలో ఏర్పాట్లు పూర్తయ్యాయని పేర్కొన్నారు. ఎన్నికల సంఘం మున్సిపల్ ఎన్నికల షెడ్యూల్ విడుదల చేసినందున ప్రవర్తనా నియమావళి అమలులోకి వచ్చిందన్నారు. ఎన్నికలు ప్రశాంతంగా జరగడానికై అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులు సహకరించాలని కోరారు. నామినేషన్ల స్వీకరణ కోసం అన్ని మున్సిపాలిటీలలో సహాయ కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఎన్నికలను సక్రమంగా నిర్వహించేందుకు అన్ని చర్యలు చేపట్టినట్లు వివరించారు. పరిశీలనలో గృహ నిర్మాణ శాఖ పి.డి. రాజ్?కుమార్, మున్సిపల్ కమిషనర్ ఏ. శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## పీఓఈఎంతో అకాలేసియా కార్డియా బాధితురాలికి ఉపశమనం

- మలక్‌పేట యశోద ఆసుపత్రి వైద్య బృందం విజయం



సూర్యాపేట, జనవరి 28 (జనంసాక్షి) : అత్యాధునిక పీఓఈఎంతో అకాలేసియా కార్డియా బాధితులకు ఉపశమనం కలుగుతుందని మలక్ పేట యశోద సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ కన్సల్టెంట్ గ్యాస్ట్రోఎంటరాలజిస్ట్ అండ్ హెపటాలజిస్ట్ డాక్టర్ కిషన్ నున్సవత, యశోద హాస్పిటల్ అసోసియేట్ వైస్ ప్రెసిడెంట్ శ్రీనివాస్ చిదుర తెలిపారు. బుధవారం జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ ఆహారం మింగలేని అరుదైన వ్యాధి అయిన అకాలేసియా కార్డియాతో బాధపడుతున్న సూర్యాపేట జిల్లా తిరుమలగిరికి చెందిన 63 ఏళ్ల మహిళకు మలక్?పేట యశోదా సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ వైద్యులు విజయవంతంగా చికిత్స అందించినట్లు తెలిపారు. గత కొంతకాలంగా ఆహారం మింగడంలో తీవ్ర ఇబ్బందులు, ఛాతీలో నొప్పి, బరువు తగ్గడం వంటి సమస్యలతో బాధపడుతున్న ఆమె తమ ఆసుపత్రిలో చేరారని అన్నారు. వైద్య పరీక్షలు, ప్రత్యేక ఎండోస్కోపిక్ మూల్యాంకనంలో రోగికి టైప్ వన్ అకలాసియా కార్డియాగా నిర్ధారణ అయిందన్నారు. తమ హాస్పిటల్ వైద్యులు ఆధునిక పిఓఈఎం పర్ ఓరల్ ఎండోస్కోపిక్ మయోటోమీ అనే అత్యాధునిక ఎండోస్కోపిక్ చికిత్సను విజయవంతంగా నిర్వహించారని పేర్కొన్నారు. ఈ విధానం ద్వారా శస్త్రచికిత్స లేకుండానే అన్నవాహిక కండరాల ఒత్తిడిని తగ్గించి, ఆహారం సజావుగా లోపలికి వెళ్లేలా చేశారని తెలిపారు. ఈ చికిత్స అనంతరం రోగి ఆహారం మింగగలగడం పూర్తిగా మెరుగుపడిందని తెలిపారు. ఏలాంటి సంక్లిష్టతలు లేకుండా చికిత్స పూర్తయ్యిందని, రోగి ఆరోగ్యం వేగంగా కోలుకుందని పేర్కొన్నారు. యశోదా హాస్పిటల్?లో ఉన్న అత్యాధునిక ఎండోస్కోపిక్ సదుపాయాలు, అనుభవజ్ఞులైన గ్యాస్ట్రోఎంటరాలజీ వైద్య బృందం ,సమగ్ర వైద్య నిర్వహణ వల్లే ఈ క్లిష్టమైన చికిత్స విజయవంతమైందని ఆసుపత్రి యాజమాన్యం తెలిపారు.

## ఎర్రగుంట హాస్పటల్ ఆకస్మికంగా తనిఖీ



**అన్నపురెడ్డిపల్లి, జనవరి 28 (జనం సాక్షి) :** అన్నపురెడ్డిపల్లి మండల పరిధిలో గల ఎర్రగుంట ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని డిఎంహెచ్ఓ డాక్టర్ తుకారం రాథోడ్ ఆకస్మికంగా తనిఖీ చేశారు ఈ సందర్బంగా వైద్య సేవలపై డాక్టర్ ప్రియాంక ని అడిగి తెలుసుకున్నారు. అనంతరం డిఎంహెచ్వో మాట్లాడుతూ సిబ్బంది సమయపాలన పాటించాలని, అత్యవసరమైన మందులు అందుబాటులో ఉంచుకోవాలని, గర్భిణీల నమోదు, వారిని పరీక్షించి మెరుగైన వైద్యసదుపాయం కోసం ఎం సి హెచ్ సెంటర్ రామవరం కు రిఫర్ చేయాలని, బీపీ, షుగర్ మందులు ప్రజలకు పంపిణీ చేయాలని తెలియచేసారు, మండల పరిధిలో గల అన్ని ప్రభుత్వ ప్రైవేటు పాఠశాలలో హాస్టల్లో ప్రతి నెల ఆరోగ్య పరీక్షలు నిర్వహించాలని , హాస్టల్లో చదివే పిల్లలలో రక్త హీనతను తగ్గించాలని, పిల్లలు ఆరోగ్యంపై శ్రద్ధ వహించేలాగా ఆరోగ్య విద్య బోధ చేయాలని తెలియచేశారు. చేతులు శుభ్రంగా కడుక్కోవాలని, పిల్లలకు మంచి ఆహారపు అలవాట్లు అలవాటు చేయాలని తెలియచేసారు. ఆరోగ్య కరమైన అలవాట్లు వలన జబ్బు పడే అవకాశాలు తగ్గుముఖం పట్టి ఆరోగ్యంగా జీవించవచ్చని తెలియచేసారు. జనవరి 30వ తేదీ నుండి ప్రారంభమయ్యే కుష్టు వ్యాధి అవగాహన కార్యక్రమంను విజయవంతం చేయాలని ప్రతి గ్రామంలో కుష్టి వ్యాధిపై అవగాహన కల్పించి ప్రతిజ్ఞ చేయించాలని తెలియజేశారు. పీ ఏచ్ సి లో ఉన్న మంచినీటి సమస్య గురించి స్థానిక సర్పంచ్ తో మాట్లాడి మంచినీటి సమస్యను పరిష్కరించవలసిందిగా కోరినారు. ఈ కార్యక్రమం లో వైద్యాధికారి డాక్టర్ ప్రియాంక, సిఏచ్ఓ వాణి, ఎస్తేరు రాణి పీఏచ్ యన్, మోహన్ మరియు సిబ్బంది పాల్గొన్నారు.

## బూర్గంపహాడ్ సీహెచ్సీలో సురక్షిత ప్రసవం

- ఇద్దరు బిడ్డలకు జన్మనిచ్చిన గిరిజన మహిళ



**బూర్గంపహాడ్, జనవరి 28 (జనంసాక్షి) :** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, బూర్గంపహాడ్ మండల కేంద్రంలో సామాజిక ఆరోగ్య కేంద్రం(సీహెచ్సీ)లో వైద్యుల సమయస్ఫూర్తితో వ్యవహరించడంతో గిరిజన మహిళ ఇద్దరు బిడ్డలకు జన్మనిచ్చింది. ములకలపల్లి మండలం ఊటచెరువుకు చెందిన మడకం జోగి బుధవారం తెల్లవారుజామున పురిటినొప్పులు అధికం కావడంతో 108కు భర్త విజయ్ ఫోన్ చేయగా అంబులెన్స్ సిబ్బంది హుటాహుటీన అక్కడకు చేరుకున్నారు. సదరు గర్భిణిని బూర్గంపహాడ్ సామాజిక ఆరోగ్య కేంద్రానికి తీసుకురావడంతో పరిస్థితిని గమనించిన డ్యూటీ డాక్టర్, నర్సింగ్ సిబ్బంది తక్షణమే వైద్యం అందించారు. సురక్షిత ప్రసవం జరగడంతో ఇద్దరు బిడ్డలకు జన్మనివ్వడంతో పాటు ఆరోగ్యంగా ఉన్నట్లు తెలిపారు. అత్యవసర సమయంలో మెరుగైన వైద్యం అందించి సురక్షిత ప్రసవం చేసిన వైద్యబృందాన్ని బాధిత కుటుంబసభ్యులు ప్రత్యేకంగా అభినందించారు.

# మున్సిపల్ ఎన్నికలను పారదర్శకంగా నిర్వహించాలి

- ఎన్నికల నిర్వహణలో జోనల్ అధికారులు కీలకపాత్ర పోషించాలి
- కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్



**సూర్యాపేట ప్రతినిధి, జనవరి 28 (జనంసాక్షి) :** మున్సిపల్ ఎన్నికలను జిల్లాలో పారదర్శకంగా, శాంతియుత వాతావరణంలో నిర్వహించేందుకు జోనల్ అధికారులు కీలక పాత్ర పోషించాలని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ అన్నారు. బుధవారం కలెక్టరేట్ లో మున్సిపల్ ఎన్నికల సందర్భంగా ఏర్పాటు చేసిన జోనల్ అధికారులు,ఎఫ్ఎస్టి ,ఎస్ఎస్టి ,విఎస్టి, వ్యయ పరిశీలకుల శిక్షణ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు.ప్రతి జోన్ పరిధిలో ఎన్నికల నిర్వహణకు సంబంధించిన అన్ని ఏర్పాట్లపై జోనల్ అధికారులు నేరుగా పర్యవేక్షణ చేపట్టాలని సూచించారు.పోలింగ్ కేంద్రాల స్థితిగతులు, సిబ్బంది నియామకం, ఓటర్లకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పన వంటి అంశాల్లో ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు.ఎన్నికల ప్రవర్తనా నియమావళిని ఖచ్చితంగా అమలు చేయాలని, ఎలాంటి ఉల్లంఘనలు చోటుచేసుకోకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.సమస్యాత్మక ప్రాంతాల్లో ముందస్తు చర్యలు తీసుకుని శాంతి భద్రతలను కాపాడాల్సిన బాధ్యత జోనల్ అధికారులపై ఉందన్నారు.

పోలింగ్ రోజున ఎలాంటి అవాంతరాలు తలెత్తకుండా చూసుకోవాలని,ఫిర్యాదులకు తక్షణ స్పందన అందించాలని ఆదేశించారు.వ్యయ పరిశీలకులు ఎన్నికల సమయంలో అభ్యర్థులు ఖర్చు పరిమితిని తప్పనిసరిగా పాటించేలా పర్యవేక్షించడం వ్యయ పరిశీలకుల ప్రధాన బాధ్యత అని తెలిపారు.డబ్బు, బహుమతులు, మద్యం వంటి వాటి అక్రమ పంపిణీని అరికట్టేందుకు ఫ్లయింగ్ స్క్వాడ్, స్టాటిక్ సర్వైలెన్స్ టీమ్స్?తో సమన్వయం చేసుకుని చర్యలు తీసుకోవాలని తెలిపారు.అనుమానాస్పద లావాదేవీలపై నిఘా ఉంచి, అవసరమైతే తక్షణ ఎస్ఎస్టి బృందాలు

నగదు, మద్యం, బహుమతులు, ఇతర ప్రలోభక వస్తువుల అక్రమ రవాణాను పూర్తిగా అడ్డుకోవాలని అన్నారు.చెక్?పోస్టుల వద్ద నిరంతర తనిఖీలు నిర్వహించాలని ఎఫ్ఎస్టి బృందాలు క్షేత్రస్థాయిలో చురుకుగా తిరుగుతూ ఫిర్యాదులపై తక్షణమే నివేదికలు సమర్పించాలని ఆదేశించారు.అదనపు కలెక్టర్ కె.సీతారామారావు మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చూడాలని,పెళ్లిళ్లకు సంబందించి, ఆసుపత్రికి వెళ్లే వారి విషయంలో ఉదాసీనతతో వ్యవహరించాలని,నగదు, మద్యం పట్టుబడితే వీడియోగ్రఫీ ద్వారా చిత్రీకరించాలన్నారు.ఈ శిక్షణ కార్యక్రమానికి ట్రైనింగ్ నోడల్ అధికారి శ్రీధర్ రెడ్డి, వ్యయ పరిశీలకుల నోడల్ అధికారి ప్రవీణ్ కుమార్,మాస్టర్ ట్రైనర్ రమేష్,జోనల్ అధికారులు, ఎఫ్ఎస్టి,వ్యయ పరిశీలకులు పాల్గొన్నారు.

## పడకేసిన పారిశుధ్యం రోడ్డు పక్కన చెత్త

- మినీ డంపింగ్ యార్డ్ ను తలపిస్తున్న జాతీయ రహదారి..



**దమ్మపేట జనవరి 28 (జనం సాక్షి) :** దమ్మపేట మండలం మందలపల్లి గ్రామ శివారులో సత్తుపల్లి అశ్వరావుపేట జాతీయ రహదారి పక్కన చెత్త కుప్పలు పేరుకుపోయి కోళ్ల వ్యర్థపదార్థలు కుప్పలు తెప్పలుగా పడేయడంతో తీవ్ర దుర్వాసన వెదజల్లుతూ పాదచారులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు.గ్రామంలో డంపింగ్ యార్డులు ఉన్న రహదారి పైనే చెత్తను తగలబెట్టడం వలన ఆ పొగ కారణంగా పాదచారులు,వాహనదారులు అనేక ఇబ్బందులకు గురవుతున్నారు.చెత్తలో ప్లాస్టిక్ తో కూడిన వ్యర్థాలు వలన మూగజీవాలకు మరణ సంకటంగా మారనుంది..దుర్వాసనతో అటువైపు వెళ్ళలేని పరిస్థితి నెలకొందని,దోమలు వ్యాపించి డెంగ్యూ మలేరియా వంటి రోగాలు బారిన పడే అవకాశం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.ఇకనైనా పంచాయితీ అధికారులు స్పందించి తక్షణమే చర్యలు తీసుకుని చెత్త వ్యర్థ పదార్థాలు వేయకుండా తగు జాగ్రత్తలు తీసుకోనీ పారిశుధ్యాన్ని మెరుగుపరచాలని గ్రామస్తులు కోరుతున్నారు.




# లాభాల్లో ముగిసిన దేశీయ మార్కెట్ సూచీలు



**న్యూఢిల్లీ:**దేశీయ మార్కెట్ సూచీలు బుధవారం లాభాల్లో ముగిశాయి ఆసియా మార్కెట్లలోని సంకేతాలు, ఇండియా–ఈయూ మధ్య కుదిరిన స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం.. సానుకూలతలకు దోహదం చేసింది. దాంతో నేటి ట్రేడింగ్‌లో సెన్సెక్స్ 487 పాయింట్ల లాభంతో 82,344.68 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 167 పాయింట్ల లాభంతో 25,342 వద్ద ముగిసింది.ఒక దశలో సెన్సెక్స్ 700 పాయింట్లవరకు లాభపడింది. నిఫ్టీ సూచీలో భారత్ ఎలక్ట్రానిక్స్, ఓఎన్‌జీసీ, కోల్ ఇండియా, ఎటర్నల్, హిందాల్కో షేర్లు లాభాలు పొందాయి. టాటా కన్జూమర్ ప్రొడక్ట్స్, ఏషియన్ పెయింట్స్, మారుతీ సుజుకీ, మ్యాక్స్ హెల్త్ కేర్, సన్ ఫార్మా స్టాక్స్ నష్టపోయాయి. మార్కెట్ అస్థిరతను కొలిచే విక్స్ సూచీ రెండు శాతం మేరపడిపోయింది. అమెరికా మార్కెట్లు మంగళవారం లాభాల్లో ముగిశాయి. ఇవన్నీ మన మార్కెట్ సెంటిమెంట్‌ను బలోపేతం చేశాయి. కార్పొరేట్ కంపెనీల త్రైమాసిక ఫలితాలు నిరుత్సాహపరచడం, విదేశీ మదుపర్ల అమ్మకాలతో సూచీలకు లాభాలు పరిమితమయ్యాయి. డాలర్‌తో పోలిస్తే రూపాయి 22 పైసలు పుంజుకుని 91.68 వద్ద ముగిసింది. బ్యారెల్ ముడిచమురు 0.15% లాభంతో 65.49 డాలర్ల వద్ద ట్రేడవుతోంది. ఆసియా మార్కెట్లు లాభాల్లో ముగియగా, ఐరోపా సూచీలు మిశ్రమంగా ట్రేడయ్యాయి. బీఎస్ఈలోని నమోదిత కంపెనీల మొత్తం మార్కెట్ విలువ రూ.2.11 లక్షల కోట్లు పెరిగి రూ.453.67 లక్షల కోట్ల (4.94 లక్షల కోట్ల డాలర్ల)కు చేరింది.

సెన్సెక్స్ ఉదయం 100 పాయింట్ల (క్రితం ముగింపు 81,537.70) నష్టంతో 81,436.79 పాయింట్ల వద్ద ప్రారంభమైంది. రోజంతా ఒడుదొడుకుల మధ్య కదలాడిన సూచీ, ఇంట్రాడేలో 81,088.59 వద్ద కనిష్ఠాన్ని తాకింది. తదుపరి పుంజుకున్న సెన్సెక్స్, 82,084.92 వద్ద గరిష్ఠాన్ని నమోదుచేసింది. చివరకు 319.78 పాయింట్ల లాభంతో 81,857.48 దగ్గర ముగిసింది. నిఫ్టీ 126.75 పాయింట్లు పెరిగి 25,175.40 వద్ద స్థిరపడింది. ఇంట్రాడేలో ఈ సూచీ 24,932.55- 25,246.65 పాయింట్ల మధ్య కదలాడింది. సెన్సెక్స్ 30 షేర్లలో 17 లాభపడ్డాయి. అదానీ పోర్ట్స్ 4.33%, యాక్సిస్ బ్యాంక్ 4.31%, టాటా స్టీల్ 2.64%, టెక్ మహీంద్రా 2.58%, ఎన్‌టీపీసీ 2.48%, ఎస్‌బీఐ 2.28%, అల్ట్రాటెక్ 1.81%, బీఈఎల్ 1.57%, ఐసీఐసీఐ బ్యాంక్ 1.49%, ఇండిగో 1.40% రాణించాయి. కోటక్ బ్యాంక్ 3.14%, ఏషియన్ పెయింట్స్ 2.86%, ఎటర్నల్ 1.97%, బజాజ్ ఫిన్‌సర్వ్ 1.69%, మారుతీ 1.48% నష్టపోయాయి. రంగాల వారీ సూచీల్లో.. లోహ 3.11%, సేవలు 1.96%, కమొడిటీస్ 1.87%, పీఎస్‌యూ బ్యాంక్ 1.76%, యుటిలిటీస్ 0.93%, చమురు–గ్యాస్ 0.92% పెరిగాయి. మన్నికైన వినిమయ వస్తువులు 1.18%, వినియోగ 0.68%, ఎఫ్ఎంసీజీ 0.48% తగ్గాయి.

బీఎస్ఈలో 1803 షేర్లు లాభపడగా, 2510 స్క్రిప్‌లు నష్టపోయాయి. 171 షేర్లలో ఎటువంటి మార్పులేదు.

పుంజుకున్న అదానీ షేర్లు: గౌతమ్ అదానీకి సమన్లు జారీ చేసేందుకు అమెరికా సెక్ కోర్టు అనుమతి కోరిందన్న వార్తలతో శుక్రవారం కుదేలైన అదానీ గ్రూప్ కంపెనీల షేర్లు, మంగళవారం మళ్లీ పుంజుకున్నాయి. అదానీ ఎంటర్‌ప్రైజెస్ 5.24%, అదానీ పోర్ట్స్ 4.33%, అదానీ ఎనర్జీ 4.26%, అదానీ గ్రీన్ ఎనర్జీ 3.45%, సంఘీ ఇండస్ట్రీస్ 2.93%, అంబుజా 2.35%, అదానీ టోటల్ గ్యాస్ 1.62%, అదానీ పవర్ 1.09%, ఏసీసీ 1.09%, ఎన్‌డీటీవీ 0.82% చొప్పున లాభాలు నమోదుచేశాయి.

భారత్–ఈయూ ఎఫ్‌టీఏ నేపథ్యంలో

వాహన షేర్లకు నష్టాలు: ఐరోపా నుంచి దిగుమతి అయ్యే కార్ల ధరలు తగ్గి, పోటీ పెరగొచ్చన్న అంచనాలతో దేశీయ వాహన కంపెనీల షేర్లు డీలాపడ్డాయి. ఎం అండ్ ఎం 4.19%, హ్యుందాయ్ 4.02%, మారుతీ 1.48%, టీఎంపీవీ 1.22% చొప్పున నష్టపోయాయి. రాణించిన జౌళి షేర్లు: ఎగుమతులకు అవకాశాలు పెరుగుతాయనే ఆశలతో జౌళి షేర్లు మెరిశాయి. ఇండోకౌంట్ ఇండస్ట్రీస్ 6.02%, కేపీఆర్ మిల్ 5.96%, వెల్‌స్పన్ లివింగ్ 4.22%, అలోక్ ఇండస్ట్రీస్ 2.50%, ట్రైడెంట్ 1.85%, అరవింద్ 0.52% రాణించాయి. ఆకర్షణీయ త్రైమాసిక ఫలితాలు ప్రకటించడంతో అల్ట్రాటెక్ సిమెంట్ షేరు 3.72% లాభపడి రూ.12,829.40 వద్ద ముగిసింది. ముత్తూట్ పప్పాచాన్ గ్రూప్ (ముత్తూట్ బ్లూ) కింద ముత్తూట్ ఫిన్‌కార్ప్, ఇతర గ్రూప్ కంపెనీలతో రూ.500 కోట్ల డిజిటల్ ట్రాన్స్‌ఫర్మేషన్ ఒప్పందాన్ని కుదుర్చుకున్నట్లు అమెరికా టెక్నాలజీ సంస్థ యూఎస్‌టీ ప్రకటించింది. ముత్తూట్ గ్రూప్ ఐటీ మౌలిక సదుపాయాలు, క్లౌడ్, డేటా కేంద్రం, సైబర్ భద్రతా కార్యకలాపాలను యూఎస్‌టీ బలోపేతం చేయనుంది.

## గుడ్ల ధరలు

| హైదరాబాద్ | వరంగల్ |
|---|---|
| ₹ 5.10 | ₹ 5.17 |

## బంగారం ధరలు (10 గ్రాములు)

హైదరాబాద్

| ₹ 1,53,150 | ₹ 1,67,080 |
|---|---|
| (22 క్యారెట్లు) | (24 క్యారెట్లు) |

## వెండి ధరలు (కేజీ)

హైదరాబాద్

₹ 4,00,000

## రెండో అంచె నగరాల్లోనూ సీనియర్లకు వేతనాలు అదుర్స్

### ర్యాండ్‌స్టాడ్ నివేదిక

**న్యూఢిల్లీ:**దేశీయ ఉద్యోగ విపణిలో మార్పులు వస్తున్నాయని.. ప్రతిభావంతుల కేంద్రాలుగా మారుతున్న రెండో అంచె నగరాల సంఖ్య అధికమవుతోందని ఒక నివేదిక వెల్లడించింది. సీనియర్ స్థాయి ఉద్యోగుల వేతనాలు ఈ నగరాల్లోనూ గణనీయంగా పెరుగుతున్నట్లు ర్యాండ్‌స్టాడ్ వార్షిక వేతన ధోరణి నివేదిక 2025–26 తెలిపింది. ఈ నివేదిక ప్రకారం.. కోచి, తిరువనంతపురం, థానే, సూరత్, జయపుర, భోపాల్, ఇందౌర్ వంటి రెండో అంచె నగరాలు అధిక వృద్ధి ప్రతిభా కేంద్రాలుగా ఆవిర్భవించాయి. ప్రథమ శ్రేణి నగరాల్లో లభిస్తున్న వేతనంతో సమానంగా, ఇక్కడా సీనియర్ స్థాయి ఉద్యోగుల జీతాల్లో పెరుగుదల కనిపిస్తోంది.రెండో అంచె నగరాల్లో డొమైన్, గ్లోబల్ కేపబిలిటీ కేంద్రాలు (జీసీసీ) వేగంగా వృద్ధి చెందుతున్నాయి. నాయకత్వం, ప్రత్యేక డొమైన్ నైపుణ్యం, అధునాతన సాంకేతిక నైపుణ్యాలకు గిరాకీ పెంచుతున్నాయి. సంస్థలు పోటీతత్వంతో అనుభవజ్ఞులకు జీతాలు చెల్లించే పరిస్థితులు నెలకొన్నాయి.మౌలిక సదుపాయాల పెట్టుబడులు, ప్రగతిశీల రాష్ట్ర విధానాలు, వేగవంతమైన డిజిటల్ పరివర్తన, అధునాతన తయారీ వృద్ధి, జీసీసీ, స్టార్టప్‌ల మద్దతుతో.. భవిష్యత్తు వృద్ధికి రెండో అంచె నగరాలు సిద్ధమవుతున్నాయి.ఇంధనం–యుటిలిటీస్, బ్యాంకింగ్, ఆర్థిక సేవలు, బీమా (బీఎఫ్ఎస్ఐ), టెలికాం, మీడియా–వినోదం వంటి రంగాల్లో మంచి వేతనాలు కనిపిస్తున్నాయి. ఆర్థిక, భౌగోళిక రాజకీయ అస్థిరతలు ఉన్నా ప్రథమ శ్రేణి నగరాల్లో వేతనాల సగటు బాగుంది. జాతీయ సగటు వార్షిక వేతనం జూనియర్ స్థాయిలో రూ.5.92 లక్షలు, మధ్య స్థాయిలో రూ.16.70 లక్షలు, సీనియర్ స్థాయిలో రూ.32.40 లక్షలుగా ఉన్నాయి. అగ్రశ్రేణి రెండో అంచె నగరాల్లో, సీనియర్లకు సగటు వార్షిక వేతనం రూ.28.38 లక్షలకు చేరింది.



## కొత్త వాహనం.. అయినా టైరు పేలొచ్చు!



**న్యూఢిల్లీ:**సాధారణంగా వాహనదారులు టైర్లలో గాలి ఉందా? ట్రెడ్ (గ్రిప్) కనిపిస్తోందా? అని మాత్రమే చూస్తుంటారు. కానీ, టైరు బయటకు కొత్తగా కనిపిస్తున్నా, దాని లోపల రబ్బరు నాణ్యత కోల్పోయి, పేలవంగా ఉండవచ్చని మీకు తెలుసా?వాహన భద్రతలో టైర్ తయారీ తేదీ అత్యంత కీలకమైన అంశమని అంతర్జాతీయ రవాణా భద్రతా సంస్థలు హెచ్చరిస్తున్నాయి. టైర్లు కేవలం రబ్బరుతో తయారు చేసిన వస్తువులు మాత్రమే కాదు; అవి రసాయనాలు, ఆయిల్స్, కొన్ని రకాల పాలిమర్ల మిశ్రమం. కాలక్రమేణా టైరు వాడినా వాడకపోయినా గాలిలోని ఆక్సిజన్, వేడి కారణంగా ఆ రబ్బరు గట్టిపడి 'ఆక్సిడైజేషన్' ప్రక్రియకు లోనవుతుంది. దీనివల్ల టైరు తన పట్టును కోల్పోవడమే కాకుండా ప్రయాణంలో ఒక్కసారిగా పేలిపోయే ప్రమాదం ఉంది.

నిపుణుల హెచ్చరిక

టైర్ ట్రెడ్ బాగున్నా సరే తయారీ తేదీ నుంచి 6 ఏళ్లు దాటితే ఆ టైరును మార్చడం సురక్షితం. ఒకవేళ టైరును అసలు వాడకుండా స్పేర్ వీల్‌గా ఉంచితే 10 ఏళ్ల తర్వాత దాన్ని కచ్చితంగా తొలగించాలి.ప్రతి టైరు సైడ్‌వాల్‌పై కోడ్ ఉంటుంది. ఇది టైరు తయారీ అంశాలను తెలియజేస్తుంది. ఈ కోడ్ చివర ఉండే నాలుగు అంకెలు అత్యంత ముఖ్యం. అందులో మొదటి రెండు అంకెలు తయారీ వారం (01 నుంచి 52 వరకు)ను తెలియజేస్తాయి. చివరి రెండు అంకెలు తయారీ సంవత్సరం తెలుపుతాయి.ఉదాహరణకు మీ టైరుపై డాట్ కోడ్‌లో చివరి అంకెలు '2419' అని ఉంటే, అది 2019వ సంవత్సరం 24వ వారంలో తయారైందని అర్థం. ప్రస్తుతం 2026 నడుస్తోంది కాబట్టి, ఈ టైరుకు ఇప్పటికే 6 ఏళ్లు దాటిపోయాయి. దీన్ని వాడటం రిస్క్‌తో కూడుకుంది.

# రూ. 6.9 లక్షల కోట్లు

## స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందంతో లబ్ధి



స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందంతో..

90% ఉత్పత్తులకు సుంకమే పడదు

ఏపీ, తెలంగాణ సహా పలు రాష్ట్రాలకు లబ్ధి

ఐరోపా చాకొలెట్లు, వైన్ చౌక అయ్యే అవకాశం

మన విద్యార్థులు, వృత్తినిపుణులకు సులువుగా వర్క్‌వీసా

ప్రపంచంలోనే నాలుగో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థ అయిన మనదేశం, ఐరోపా సమాఖ్య (ఈయూ) మధ్య సుదీర్ఘంగా సాగుతున్న స్వేచ్ఛా వాణిజ్య ఒప్పంద (ఎఫ్‌టీఏ) చర్చలు విజయవంతంగా ముగిశాయి. దీనివల్ల 27 దేశాల సమాఖ్య అయిన ఈయూలోకి 99% భారత ఎగుమతులకు ప్రాధాన్య ప్రవేశం లభించనుంది. ఇక్కడి సూక్ష్మ, చిన్న, మధ్య స్థాయి కంపెనీ (ఎమ్ఎస్ఎమ్ఈ)లకు సరికొత్త అవకాశాలు కలగనున్నాయి. మన మహిళలు, కళాకారులు, యువత, వృత్తినిపుణులకు ఉద్యోగాలు లభించనున్నాయి. కార్మిక ఆధారిత రంగాలకు భారీ ప్రయోజనాలు దక్కనున్నాయి. వచ్చే 5–7 నెలల్లో ఒప్పందంపై అధికారికంగా సంతకాలు జరగొచ్చు. కాబట్టి ఈ ఏడాదిలో, లేదా 2027 మొదట్లో ఒప్పందం అమల్లోకి వచ్చిన తొలిరోజు నుంచే, ఈ లబ్ధి చేకూరనుంది. అమెరికా మన ఉత్పత్తులపై 50% భారీ సుంకం విధించిన ప్రస్తుత తరుణంలో, తాజా పరిణామానికి ఎంతో ప్రాధాన్యం ఉంది. ఈయూ కూడా అమెరికా నుంచి అధిక టారిఫ్ బెదిరింపులను ఎదుర్కొంటుండడం గమనార్హం. ఈ రాష్ట్రాలకు ప్రయోజనం: ఈయూలో వస్త్ర మార్కెట్ 263.5 బి. డాలర్ల (సుమారు రూ.24.24 లక్షల కోట్ల) స్థాయిలో ఉండగా, మనం 7.2 బి. డాలర్ల (దాదాపు రూ.66,000 కోట్ల) ఎగుమతులు చేస్తున్నాం. ఇకపై సుంకమే లేకపోతే, మన వస్త్ర ఎగుమతిదార్లకు ప్రయోజనాలు లభిస్తాయి. ఆర్డర్లు పెరిగితే, ఇక్కడ మరిన్ని ఉద్యోగాలూ వస్తాయి. ముఖ్యంగా తెలంగాణ (హైదరాబాద్, వరంగల్), తమిళనాడు (తిరుపూర్), మహారాష్ట్ర (ఇచల్కరంజి), గుజరాత్ (సూరత్), పంజాబ్ (లుథియానా) వంటి రాష్ట్రాల్లోని జౌళి మార్కెట్లకు ప్రయోజనం లభించనుంది.ఆంధ్రప్రదేశ్ (విశాఖ, కాకినాడ), గుజరాత్, కేరళ, పశ్చిమ బెంగాల్ వంటి రాష్ట్రాల నుంచి ఈయూకు సముద్ర ఉత్పత్తులు ఎక్కువగా వెళుతుంటాయి. అస్సాం నుంచి టీ; కేరళ నుంచి మిరియాలు, యాలకులు ఎగుమతి అవుతుంటాయి. తక్కువ టారిఫ్‌లతో ఆయా రాష్ట్రాలకూ మేలు జరగనుంది. తోలు–పాదరక్షల రంగంలోని సూక్ష్మ–చిన్న–మధ్యస్థాయి సంస్థలకు మద్దతు లభించనుంది. తమిళనాడు(వేలూరు–అంబూరు), ఉత్తరప్రదేశ్(కాన్పూర్, ఆగ్రా)లోని క్లస్టర్లకు మేలు కలగనుంది. ఎలక్ట్రానిక్స్‌పై టారిఫ్ ఉండదు కనుక, 99.6% ఎగుమతులకు ప్రయోజనం దక్కనుంది. రత్నాభరణాలపై 4% సుంకం మినహాయింపు లభిస్తుంది కనుక, తయారీదార్లు ఎక్కువగా ఉండే ముంబయి, సూరత్, జయపురకు మేలు.

మనకు దక్కేదేమిటి?

మనదేశానికి చెందిన చెందిన 75 బిలియన్ డాలర్ల (దాదాపు రూ.6.9 లక్షల కోట్ల) విలువైన ఎగుమతులకు ఎఫ్‌టీఏ కింద ప్రయోజనాలు దక్కనున్నాయి.

93% పైగా భారత వస్తువులపై సుంకమే ఉండదు. ఇందులో వాహన, ఉక్కు మినహా అన్ని భారతీయ వస్తువులు ఉన్నాయి.6% పైగా మిగిలిన వస్తువులపై టారిఫ్ తగ్గింపు, కోటా ఆధారిత సుంకం మినహాయింపులు(వాహనాల వంటి వాటికి) లభిస్తాయి.భారత వస్తువులపై సగటున ఈయూ టారిఫ్ 3.8 శాతంగానే ఉంది. ఒప్పందం కింద ఇది 0.1 శాతానికి తగ్గనుంది.ఈ రంగాలకు మేలు: జౌళి, దుస్తులు, సముద్ర ఉత్పత్తులు, పాదరక్షలు, తోళ్లు, రసాయనాలు, ప్లాస్టిక్స్, స్పోర్ట్స్ వస్తువులు, బొమ్మలు, రత్నాభరణాలు వంటి 33 బి. డాలర్ల (సుమారు రూ.3 లక్షల కోట్ల) విలువైన ఎగుమతులకు ప్రస్తుతం 4–26% సుంకం ఉండగా.. ఎఫ్‌టీఏ అమల్లోకి వచ్చిన వెంటనే 0% సుంకం వర్తిస్తుంది.

ఈయూకు ప్రయోజనాలివీ..

టారిఫ్ కోతలు, మినహాయింపుల కారణంగా 2032 కల్లా ఈయూ ఎగుమతులు సైతం రెట్టింపు కానున్నాయి. ఐరోపా వస్తువులపై దశలవారీగా టారిఫ్‌లను మనదేశం తగ్గిస్తుంది. ఈయూ కంపెనీలకు సైతం మనదేశంలో 102 ఉప రంగాలు అందుబాటులోకి వస్తాయి.ఈయూ ఎగుమతుల్లో 97.54% సుంకం మినహాయింపు వరకు కవర్ చేసే 92.14% టారిఫ్ లైన్లకు భారత్ మినహాయింపులిస్తుంది. ఇందులో హైటెక్ వస్తువులతో పాటు యాపిల్, కివీ, పియర్ వంటి పళ్లు; పారిశ్రామిక, వినియోగదారు ఉత్పత్తులున్నాయి.ఈయూ ఎగుమతులకు దశలవారీ సుంకాల కోత వల్ల వ్యయాలు తగ్గుతాయి. భారత సరఫరాదార్లతో మమేకం కావడానికి అవకాశాలు లభిస్తాయి. ప్రస్తుతం 11–44% టారిఫ్ ఉన్న మెషినరీ, కెమికల్స్, ఫార్మా, వైద్య పరికరాలు, విమానాలు, ప్లాస్టిక్స్, ఇనుము–ఉక్కు వంటి వస్తువులను ఎగుమతి చేసే ఐరోపా ఎగుమతిదార్లకు భారీ పన్ను కోతల వల్ల ప్రయోజనం దక్కనుంది. భారత్‌కు విమానాలు, విమాన విడిభాగాలు, ఎలక్ట్రికల్ మెషినరీ, వజ్రాలు, రసాయనాలను అధికంగా ఎగుమతి చేయడం ద్వారా ఈయూ ప్రయోజనం దక్కించుకోగలదని మేధో సంపత్తి సంస్థ జీటీఆర్ఐ అంటోంది.

విలాస కార్ల ధరలు తగ్గవా?


ఎఫ్‌టీఏ కింద ఏటా 2.5 లక్షల వాహనాలను దిగుమతి చేసుకునేందుకు, వాటిపై ప్రస్తుతం ఉన్న పన్నును 110% నుంచి 10 శాతానికి క్రమంగా తగ్గించడానికి మనదేశం అంగీకరించింది. బ్రిటన్‌తో అంగీకరించిన 37,000 వాహనాలతో పోలిస్తే, ఈయూకు ఆరింతల ఎక్కువ కోటాను మనదేశం ఆఫర్ చేయడం విశేషం. ప్రస్తుతం మనదేశంలోకి దిగుమతయ్యే, 40,000 డాలర్ల పైబడిన ధర ఉన కార్ల (సీబీయూ)పై 110% పన్ను ఉంది. ఆ ధరలోపు కార్లపై 70% పన్ను వర్తిస్తుంది. కోటాకు వెలుపల ఎటువంటి మినహాయింపులూ భారత్ ఇవ్వదు. ఈయూ కంపెనీలు భారత్‌లో తయారీ చేపట్టాలన్నది మన ఉద్దేశంగా ఉంది. విద్యుత్తు వాహనాల (ఈవీ)కు కోటా.. ఒప్పందం జరిగిన అయిదో ఏడాది నుంచి ప్రారంభమవుతుంది. మన ఈవీ మార్కెట్ ఇపుడిపుడే వృద్ధి చెందుతున్నందున, ఈ నిర్ణయం తీసుకున్నారు. అంటే అయిదేళ్ల పాటు మనకు రక్షణ ఉంటుంది.తాజా పరిణామాన్ని మెర్సిడెజ్ బెంజ్, బీఎమ్‌డబ్ల్యూ, ఆడి, స్కోడా, స్టెలాంటిస్ వంటి దిగ్గజాలు ఆహ్వానించాయి. అయితే కార్ల ధరలు తగ్గే అవకాశం లేదని అంటున్నాయి. కేవలం 5% విక్రయాలు మాత్రమే, పూర్తిగా తయారై దిగుమతి అయిన మోడళ్ల (సీబీయూ) రూపంలో జరుగుతున్నందున, తమ వాహన ధరలేమీ తగ్గవని మెర్సిడెజ్ బెంజ్ పేర్కొంది. మార్కెట్ పరిస్థితులను మదించాకే ఏ విషయమైనా చెప్పగలమని ఆడి ఇండియా తెలిపింది.చాకొలెట్లు, కాస్మోటిక్స్: ఐరోపా వైన్లు, ఆల్కహాళ్లకు కోటా పద్ధతిన టారిఫ్ కోతలు వర్తిస్తాయి. చాకొలెట్లు, ఇతర ప్రాసెస్డ్ ఆహార వస్తువులకూ తగ్గింపులున్నాయి. దీంతో ఫ్రాన్స్, ఇటలీ, స్పెయిన్, బెల్జియం నుంచి మనదేశానికి ఎగుమతులు పెరగనున్నాయి. అక్కడి ఖరీదైన కాస్మోటిక్స్‌కూ ఊతం లభించనుంది. దీంతో ఆయా ఉత్పత్తుల ధరలు మనదేశంలో తగ్గే అవకాశం ఉంది. 2.5 యూరోల కంటే తక్కువ ధర ఉన్న వైన్‌లకు ఎటువంటి సుంకం మినహాయింపులు ఉండవు. అంత కంటే ధర ఎక్కువ ఉన్న వాటికి మాత్రం సుంకం 150% నుంచి 20 శాతానికి తగ్గుతుంది.

సేవల రంగాలకూ మేలే..

ఎఫ్‌టీఏలో 144 ఈయూ ఉప రంగాలు భారత ఎగుమతిదార్లకు అందుబాటులోకి వస్తాయి. కీలక వృత్తినైపుణ్య, సాంకేతిక సేవలు ఇందులో ఉన్నాయి. ఈయూ నుంచి మన విద్యార్థుల రాకపోకలపై పరిమితి ఉండదు. వృత్తి నిపుణలకు వర్క్ వీసా హామీ లభిస్తుంది. ఎగుమతి అయ్యే మన వైన్‌కు ఎటువంటి సుంకాలు ఉండవు. 100 మి. డాలర్లు/85,000 టన్నుల ద్రాక్షకు సుంకం ఉండదు.భారత ఫార్ములేషన్లు, మందులకు: తక్కువ టారిఫ్‌ల కారణంగా భారత ఫార్ములేషన్లు, ఏపీఐ, వాల్యూ యాడెడ్ మందుల స్థానం మరింత బలోపేతం అవుతుందని ఫార్మెగ్జిల్ ఛైర్మన్ నమిత్ జోషి పేర్కొన్నారు. ఔషధాలపై 11% వరకు ఉన్న టారిఫ్ తొలగింపు వల్ల వాణిజ్యం పెరుగుతుందని ఇండియన్ ఫార్మాస్యూటికల్ అలయన్స్ (ఐపీఏ)

## అమెజాన్‌లో 16వేల మంది ఉద్యోగులు తొలగింపు

**న్యూఢిల్లీ:**ప్రముఖ ఇ–కామర్స్ సంస్థ అమెజాన్ మరోసారి భారీ సంఖ్యలో లేఆఫ్ ప్రకటించింది. తాజాగా 16వేల మంది ఉద్యోగులను తొలగిస్తున్నట్లు వెల్లడించింది. ఈ విషయాన్ని సంస్థ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ బెత్ గలెటీ పేర్కొన్నారు. మూడు నెలల వ్యవధిలో ఈ స్థాయిలో రెండోసారి లేఆఫ్‌లను ప్రకటించడం గమనార్హం. గతేడాది అక్టోబర్‌లో 14 వేల మంది కార్పొరేట్ ఉద్యోగులను తొలగించిన విషయం తెలిసిందే.




## పాక్ మాజీ ప్రధాని ఇమ్రాన్‌ఖాన్‌కు చూపు పోయే ముప్పు..!

**ఇస్లామాబాద్:**పాకిస్థాన్ మాజీ ప్రధాని ఇమ్రాన్‌ఖాన్ ఆరోగ్య పరిస్థితిపై ఆందోళన వ్యక్తమవుతోంది. తమ నేతకు వెంటనే చికిత్స అందించకపోతే.. కంటిచూపు పోయే ప్రమాదం ఉందని పాకిస్థాన్ తెహ్రీక్–ఇ–ఇన్సాఫ్ (పీటీఐ) వర్గాలు పేర్కొన్నాయి. స్థానిక మీడియా కథనాల ప్రకారం..ఇమ్రాన్‌ఖాన్ కుడి కంటిలో సమస్య తలెత్తిందని, దానికి వెంటనే చికిత్స అందించకపోతే చూపుపోయే ప్రమాదం ఉందని పార్టీ వర్గాలు ఆందోళన వ్యక్తంచేశాయి. వెంటనే ఆయన్ను ఆసుపత్రికి తరలించాలని డిమాండ్ చేశాయి. వైద్యుల సూచనను పట్టించుకోకుండా జైల్లోనే ఆయనకు చికిత్స అందించాలని జైలు అధికారులు పట్టుబడుతున్నారని ఆరోపించాయి. 2024 అక్టోబర్‌లో ఇమ్రాన్ తన వ్యక్తిగత వైద్యుడి వద్ద పరీక్షలు చేయించుకున్నారని, ఆ తర్వాత నుంచి ఆ డాక్టర్‌ను కలిసేందుకు అనుమతించడం లేదని వెల్లడించాయి.

## ఇరాన్ దిశగా మరిన్ని యుద్ధనౌకలు

తరలిస్తున్నట్లు అమెరికా అధికారి ఒకరు తెలిపారు. ఇరాన్‌లో ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఆందోళనలు జరుగుతున్న సంగతి తెలిసిందే. ఈ సందర్భంగా జరిగిన ఘర్షణల్లో వేల మంది ప్రాణాలు కోల్పోయారు. దీనిపై ట్రంప్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ క్రమంలో అబ్రహం లింకన్ వాహక నౌకతో సహా పలు యుద్ధ నౌకలను పశ్చిమాసియాలో మోహరించారు. దీంతో ఇరాన్‌పై యూఎస్ ఏ క్షణాన దాడి చేస్తుందోనన్న భయాందోళనలు నెలకొన్నాయి.

## అమెరికాలో తెలంగాణ సాఫ్ట్‌వేర్ ఉద్యోగి మృతి

వనపర్తి(జనంసాక్షి): అమెరికాలో తెలంగాణకు చెందిన సాఫ్ట్‌వేర్ ఉద్యోగి గుండెపోటుతో మృతిచెందారు. కుటుంబసభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. వనపర్తి జిల్లా వీపనగండ్ల మండలం బొల్లారం గ్రామానికి చెందిన హర్షవర్ధన్‌రెడ్డి (45) ఫ్లోరిడాలో నివాసముంటున్నారు. ఓ ఐటీ సంస్థలో ఆయన పనిచేస్తున్నారు. వర్క్ ఫ్రం హోం చేస్తుండగా మంగళవారం అర్ధరాత్రి (భారత కాలమాన ప్రకారం) గుండెపోటు వచ్చింది. దీంతో హర్షవర్ధన్ మృతిచెందారు. గత పదేళ్లుగా అమెరికాలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తున్న ఆయనకు.. భార్య, కుమారుడు ఉన్నారు. హర్షవర్ధన్ తండ్రి సుదర్శన్‌రెడ్డి బొల్లారం సర్పంచ్‌గా ఉన్నారు.

## ల్యాండింగ్ గేర్ లేకుండానే భూమిని తాకిన నాసా రీసెర్చ్ విమానం

**న్యూయార్క్:**అమెరికా అంతరిక్ష సంస్థ నాసాకు చెందిన ఓ రీసెర్చ్ విమానం ల్యాండింగ్ గేర్ లేకుండానే భూమిని తాకింది. ఈ క్రమంలో విమానం నుంచి భారీగా మంటలు వ్యాపించాయి. దీనికి సంబంధించిన వీడియో నెట్టింట చక్కర్లు కొడుతుంది. నాసాకు చెందిన డబ్ల్యూ–57 రీసెర్చ్ విమానం ల్యాండ్ గేర్‌లో సాంకేతిక సమస్య తలెత్తింది. దీంతో ఆ విమానాన్ని హ్యూస్టన్‌లోని ఎల్లింగ్టన్ ఎయిర్‌పోర్టులో అత్యవసర ల్యాండింగ్ చేశారు. ఈ క్రమంలో విమానం అదుపుతప్పి రన్‌వేపై ఒకవైపునకు వంగిపోవడంతో దాని వెనక భాగం నుంచి మంటలు వచ్చాయి. ఎయిర్‌పోర్టులోని రెస్క్యూ సిబ్బంది వెంటనే మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. వారి సహాయంతో పైలట్ కాక్‌పిట్ నుంచి సురక్షితంగా బయటపడ్డాడని స్థానిక మీడియా పేర్కొంది. తర్వాత నాసా కూడా ఈ ఘటనను ధ్రువీకరించింది. సిబ్బంది అందరూ సురక్షితంగా బయటపడ్డారని తెలిపింది.





# ఎన్నికల్లో నిజాయితీ, నిష్పక్షపాతం తప్పనిసరి

- మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ పక్కా అమలు : ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్
- ఉల్లంఘనలపై కట్టుదిట్టమైన చర్యలు
- ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలకు శిక్షణ


**రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రతినిధి జనవరి 28 (జనంసాక్షి) :**

రాజన్న సిరిసిల్ల జిల్లాలోని 2 మున్సిపాలిటీలలో జరుగుతున్న మున్సిపల్ ఎన్నికలలో అధికారులు విధులను నిజాయితీగా, నిష్పక్షపాతంగా నిర్వహించాలని ఇంచార్జి కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి గరిమ అగ్రవాల్ ఆదేశించారు. మున్సిపల్ ఎన్నికల క్రమంలో మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్, ఎన్నికల విధులపై జోనల్ అధికారులకు, ఎఫ్ఎస్టీ, ఎస్ఎస్టీ టీంలకు జిల్లా సమీకృత కార్యాలయంలోని ఆడిటోరియంలో జిల్లా మున్సిపల్ ఎన్నికల సాధారణ పరిశీలకులు డాక్టర్ శ్రీనివాస్ రెడ్డితో కలిసి బుధవారం శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ మున్సిపల్ ఎన్నికలను రాష్ట్ర ఎన్నికల సంఘం మార్గదర్శకాల ప్రకారం ప్రతి ఒక్కరికీ సమానమైన హక్కు కల్పిస్తూ పారదర్శకంగా నిర్వహించాలని ఆదేశించారు.

ఎలాంటి రాజకీయ పార్టీల కార్యక్రమాల్లో అధికారులు, సిబ్బంది పాల్గొనకూడదని ఆమె స్పష్టం చేశారు. పారదర్శకంగా ఎన్నికల నిర్వహణ కోసం ఏర్పాటు చేసిన ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు ఉల్లంఘనలను, నగదు, మద్యం పంపిణీని గుర్తించడం, రిపోర్ట్ చేయడం ఆధారాలు సేకరించడం, వీడియో రికార్డు చేయడం చాలా కీలకమన్నారు. ఎన్నికల సమయంలో అక్రమ డబ్బు,నగదు సరఫరా జరగకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని, ఏమాత్రం నిర్లక్ష్యం ప్రదర్శించవద్దన్నారు. వీటికి సంబంధించిన అన్ని వివరాలతో సమీప పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయాలని ఆదేశించారు. ఎన్నికలకు సంబంధించి అక్రమ నగదు,మద్యం పంపిణీ అరికట్టడమే లక్ష్యమని, సాధారణ ప్రజలకు అసౌకర్యం కలగకుండా వీలైనంత వరకు జాగ్రత్తలు వహించాలన్నారు. నగదు సీజ్ చేసే సమయంలో రాష్ట్ర ఎన్నికల సంఘం నిర్దేశించిన మార్గదర్శకాలను తప్పకుండా పాటించాలని, నగదు సీజ్ చేసే సమయంలో ఎక్కడ అప్పీల్ చేయాలనే అంశం స్పష్టంగా తెలియజేస్తూ రశీదు అందించాలన్నారు. నగదు సీజ్ చేసిన సమాచారం ఐటీ అధికారులకు ఇవ్వాలన్నారు. రాజకీయ పార్టీలు నిర్వహించే సభలు,ర్యాలీలను క్షుణ్ణంగా పరిశీలించాలని, వినియోగించిన వాహనాలు, కుర్చీలు, భోజనం ప్రతి అంశాన్ని పరిశీలించి వివరాలు నమోదుతో రికార్డ్ చేయాలన్నారు. ఎన్నికల కోడ్ ఉల్లంఘనలపై అప్రమత్తంగా ఉంటూ ఆధారాలు సేకరించాలన్నారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలులోకి వచ్చిన తరువాత రూ 50 వేల కంటే ఎక్కువ డబ్బు తరలిస్తే పట్టుకొని, వీడియో తీసి పంచనామా చేయాలని పట్టుకున్న డబ్బుకు సంబంధించి రసీదు అందజేయాలన్నారు.

ప్రచార వాహనాలకు మున్సిపల్ కమిషనర్లు,లౌడ్ స్పీకర్లకు పోలీస్‌ల నుంచి అనుమతి తీసుకోవాలని స్పష్టం చేశారు. ర్యాలీలు, సభలు, సమావేశాలకు సమీప ఎస్హెచ్ఓల నుంచి ఎన్ఓసీ తీసుకున్న తర్వాత మున్సిపల్ కమిషనర్ అనుమతి ఇవ్వాలని ఆదేశించారు. ప్రతి వార్డు సభ్యుడు రూ లక్ష వరకు ఎన్నికల వ్యయం చేయవచ్చన్నారు. జోనల్ ఆఫీసర్స్ తమ పరిధిలోని అన్ని పోలింగ్ కేంద్రాలను మూడు సార్లు తనిఖీ చేయాలన్నారు. దివ్యాంగులకు ప్రత్యేక సౌకర్యం ఏర్పాటు చేయాలన్నారు. ఎన్నికల రోజున అధికారులు, సిబ్బందికి అన్ని వసతులు కల్పించాలని తెలిపారు. ఎన్నికలకు 48 గంటల ముందు ప్రచారం నిలిపివేయాలని, స్థానికేతరులు ఇక్కడ ఉండకుండా చూడాలన్నారు. పోలింగ్ రోజున డిస్ట్రిబ్యూషన్ కేంద్రాల నుంచి ఆయా పోలింగ్ కేంద్రాలకు ఎన్నికల అధికారులు, సిబ్బంది జోనల్ ఆఫీసర్స్ తో పాటు వారికి కేటాయించిన వాహనాల్లోనే వెళ్లాలని ఆమె స్పష్టం చేశారు. ప్రతి రోజు అన్ని టీంలు నివేదికలను జిల్లా అధికారులు, పోలీస్ అధికారులకు పంపాలన్నారు.

అనంతరం జిల్లా ఎన్నికల సాధారణ పరిశీలకులు డాక్టర్ శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ఎన్నికల సంఘం నిబంధనల మేరకు విధులు నిర్వహించాలని సూచించారు. మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ పక్కాగా అమలు చేయాలన్నారు. ఎన్నికలు స్వేచ్ఛాయుత వాతావరణంలో పూర్తి చేయాలని తెలిపారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ గడ్డం నగేష్, అదనపు ఎస్పీ చంద్రయ్య, నోడల్ అధికారులు గీత, శ్రీనివాసాచారి, నవీన్, ట్రైనర్ మహేందర్ రెడ్డి, అధికారులు పాల్గొన్నారు.



# పుర పోరు

## అందరికి ప్రతిష్టాత్మకమే

- అభ్యర్థుల ఎంపికకు పార్టీల కసరత్తు
- విజయావకాశాలు ఉంటేనే టికెట్లు
- మూడు పార్టీలకు కీలకమే

**రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రతినిధి జనవరి 28 (జనంసాక్షి) :**

మున్సిపల్ ఎన్నికలు మూడు రాజకీయ పార్టీలకు కీలకము కానున్నాయి. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన క్రమంలో పార్టీ గుర్తులపై మొదటిసారి స్థానిక సంస్థల ఎన్నికలు జరుగుతూ ఉండడంతో ఇటు కాంగ్రెస్ పార్టీ అటు బీఆర్ఎస్, బీజేపీ ప్రతిష్టాత్మకంగా తీసుకుంటున్నాయి. ప్రతి పార్టీ నాయకులు తమ అభ్యర్థులు గెలవాలని ఆచితూచి అడుగు వేస్తూ అభ్యర్థులను ఖరారు చేసే పనిలో నిమగ్నమయ్యారు వేములవాడలో ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ఎన్నికల నోటిఫికేషన్ కు కొద్ది రోజుల ముందు పట్టణంలో పలు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేస్తూ, కుల సంఘాల భవన నిర్మాణాలకు ప్రొసిడింగ్ కాపీలు, ప్రజలకు హామీలు ఇస్తూ ప్రజలతో మమేకమయ్యారు. వేములవాడ మున్సిపల్ పరిధిలో 28 వార్డులు ఉండగా ఇప్పటికే ఒక్కొక్క వార్డులో ఇద్దరు, ముగ్గురు అభ్యర్థులు అధికార కాంగ్రెస్ పార్టీకి దరఖాస్తు చేసుకున్నారు. ప్రభుత్వ విప్ మాత్రం వార్డుల వారిగా వచ్చిన దరఖాస్తులను పరిశీలన చేస్తూ సర్వేలు చేపిస్తూ సర్వేలో ఎవరికి గెలుపు ఉంటుందో వారికే టికెట్ కేటాయిస్తామని చెప్పినట్లు పార్టీ శ్రేణుల్లో వినిపిస్తుంది. టికెట్ ఆశించి బంగపడినవారు రెబల్‌గా పోటీలో ఉండకుండ ఇప్పటినుంచి బుజ్జగింపుల పర్వం తన వంతు ప్రయత్నం కొనసాగిస్తున్నారు.

**త్రిముఖ పోరులో గెలుపెవరిదో..!**

కాంగ్రెస్ పార్టీలో ఆశావాహుల సంఖ్య ఎక్కువ ఉండడంతో అభ్యర్థులను ఎంపిక చేసేందుకు సమయం పట్టే అవకాశం ఉంది. బుధవారం నుంచి నామినేషన్లు ప్రారంభం కావడంతో అభ్యర్థుల ఎంపిక ప్రక్రియ త్వరగా పూర్తిచేసే ఆలోచనలో ఉన్నట్లు సమాచారం. ఇప్పటికే అధికార పార్టీ ఆధ్వర్యంలో బరిలో ఉండే నాయకులు నామినేషన్లు వేసేందుకు సిద్ధమవుతున్నారు. మున్సిపల్ ఎన్నికల్లో గెలుపు కోసం భాజపా ఇప్పటికే మాజీ మంత్రి ఇనుగల పెద్దిరెడ్డిని ఇన్చార్జిగా నియమించారు. మంగళ వారం భాజపా ఎన్నికల్లో పోటీచేసే అభ్యర్థులు, ముఖ్య నాయకులతో సమావేశం కూడా నిర్వహించారు. అయితే ఈ సమావేశాని కి జిల్లా మాజీ అధ్యక్షుడు గైర్హాజరు కావడం చర్చనీయాంశంగా మారింది. పోటీలో ఉండే ఆశావాహుల అభ్యర్థులతో ఎన్నికల ఇన్చార్జ్ చర్చలు జరిపినట్లు తెలుస్తుంది.

బిఆర్ఎస్ పార్టీ కూడా గతంలో గెలిచిన అభ్యర్థులతో పాటు కొత్త అభ్యర్థులకు టిక్కెట్ ఇచ్చే యోచనలో ఉన్నట్లు సమాచారం. మూడు పార్టీల నాయకులు బుధవారం వరకు కూడ ఏ వార్డులో అభ్యర్థులను ఖరారు చేయలేదు. ఏది ఏమైనా ఆధ్యాత్మిక పట్టణమైన వేములవాడ మున్సిపల్ ఎన్నికల త్రిముఖ పోరులో తమ పట్టు కోసం ఎవరి ప్రయత్నాలు వారు చేస్తున్నారు. అయితే ఓటర్లు ఎవరికి పట్టం కడతారు అని ఉత్కంఠ నెలకొంది.



### కరీంనగర్ కార్పొరేషన్ టికెట్ ఆశావహులతో

# మంత్రుల ముఖాముఖి

- కాంగ్రెస్ జెండా ఎగరాలి
- గెలుపే లక్ష్యంగా అభ్యర్థుల ఎంపిక
- సర్వేల ఆధారంగా కార్యకర్తల కష్టానికి న్యాయం చేస్తాం



**కరీంనగర్, జనవరి 28 (జనంసాక్షి) :** కరీంనగర్ కార్పొరేషన్‌లో టికెట్ ఆశిస్తూ దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులతో ముఖాముఖి సమావేశం డీసీసీ కార్యాలయంలో జరిగింది. చొప్పదండి ఎమ్మెల్యే, డీసీసీ అధ్యక్షుడు డాక్టర్ మేడిపల్లి సత్యం అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమానికి రాష్ట్ర వ్యవసాయ, సహకార శాఖ మంత్రి, జిల్లా ఇంఛార్జ్ తుమ్మల నాగేశ్వరరావు, ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, మానకొండూరు ఎమ్మెల్యే, టీపీసీసీ ఎస్సీ సెల్ అధ్యక్షుడు డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ, సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి, గ్రంథాలయ సంస్థ చైర్మన్ సత్తు మల్లేశం, కరీంనగర్ అసెంబ్లీ ఇంఛార్జ్ వెలిచాల రాజేందర్ రావు, కార్పొరేషన్ కాంగ్రెస్ అధ్యక్షుడు వైద్యుల అంజన్ కుమార్, ఆల్ఫోర్స్ నరేందర్ రెడ్డి, అర్బన్ బ్యాంక్ చైర్మన్ కర్ర రాజశేఖర్, మాజీ ఎమ్మెల్యే ఆరెపల్లి మోహన్ తదితరులు హాజరయ్యారు.

మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు మాట్లాడుతూ పలుమార్లు సర్వేలు జరిపామని, కార్యకర్తలను సమన్వయం చేసుకుని ముందుకు పోవాలని సూచించారు. మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ గత మున్సిపల్ ఎన్నికల్లో దౌర్జన్యం, అధికార దుర్వినియోగం జరిగాయని, కాంగ్రెస్ కార్యకర్తలకు న్యాయం చేయడమే తమ లక్ష్యమని, గెలిచే అభ్యర్థులను ఎంపిక చేస్తామని స్పష్టం చేశారు.

జిల్లా ఇంఛార్జ్ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ సోనియా గాంధీ కోరిక మేరకు తెలంగాణ సాధ్యమైందని, రేవంత్ రెడ్డి నాయకత్వంలో అత్యధిక స్థానాలు గెలిచి అధికారం చేపట్టామని, కరీంనగర్ కార్పొరేషన్‌లో కాంగ్రెస్ జెండా ఎగరాలని, కష్టపడిన కార్యకర్తలకు నామినేటెడ్ పదవులు ఇస్తామని హామీ ఇచ్చారు. దరఖాస్తులను పరిశీలిస్తున్నామని, కార్యకర్తల కష్టానికి తగిన ఫలితం ఉంటుందని భరోసా ఇచ్చారు. చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం మాట్లాడుతూ కరీంనగర్ కార్పొరేషన్‌పై కాంగ్రెస్ జెండా ఎగరవేయడమే అంతిమ లక్ష్యమని స్పష్టం చేశారు.

## కెసిఆర్ ముఖ్యమంత్రి కావాలని మేడారంలో మొక్కులు చెల్లించుకున్న బిఆర్ఎస్ నాయకులు.

**గంభీరావుపేట జనవరి 28 (జనం సాక్షి):** రాజన్న సిరిసిల్ల జిల్లా గంభీరావుపేట మండలానికి చెందిన బిఆర్ఎస్ నాయకులు మళ్లీ కెసిఆర్ ముఖ్యమంత్రి కావాలని బుధవారం రోజు మేడారంలో మొక్కులు చెల్లించుకున్నారు వారు మాట్లాడుతూ మేడారం సమ్మక్క సారలమ్మ ఆశీస్సులతో తెలంగాణ రాష్ట్ర ప్రజలంతా బిఆర్ఎస్ అధికారంలోకి రావాలని మళ్లీ కేసీఆర్ ముఖ్యమంత్రి కావాలని మేడారం లో ముక్కులు చెల్లించుకున్నారు ఈ కార్యక్రమంలోదమ్మన్నపేటగ్రామ శాఖ అధ్యక్షులు వేణు మాజీ మార్కెట్ డైరెక్టర్ రాజిరెడ్డి, శ్రీనివాస్ గౌడ్, సంజీవ్ బాలరాజు నారాయణరెడ్డి పాల్గొన్నారు

# పారదర్శకంగా మున్సిపల్ ఎన్నికలు

### ఎన్నికల నిబంధనలు ప్రతి ఒక్కరు విధిగా పాటించాలి : జిల్లా ఇన్చార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్



**రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రతినిధి జనవరి 28 (జనంసాక్షి) :** వేములవాడ మున్సిపల్ కార్యాలయంలో బుధవారం నామినేషన్ కేంద్రాన్ని జిల్లా ఇన్చార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ పరిశీలించారు. అనంతరం ఆమె విలేకరులతో మాట్లాడుతూ బుధవారం నుండి ఈ నెల 30 వరకు ఉదయం10.30 గంటల నుంచి 05.00 గంటల వరకు నామినేషన్లు స్వీకరించేందుకు అన్ని ఏర్పాట్లు చేశామన్నారు. నామినేషన్ కేంద్రంలోకి అభ్యర్థితో పాటు ఇద్దరికి మాత్రమే అనుమతి ఉంటుందని స్పష్టం చేశారు. నామినేషన్ కేంద్రం వద్ద 100 మీటర్ల వరకు రెండు వాహనాలకు అనుమతి ఉంటుందని తెలిపారు. వేములవాడలో 28 వార్డులకు సంబంధించి 10 మంది ఆర్ఓలు, 10 మంది ఏఆర్ఓలను రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాలకు అనుగుణంగా నియమించామన్నారు. ఎస్ఎస్టీ, ఎఫ్ఎస్టీ టీంలను నియమించామని తెలిపారు. ఎన్నికల సిబ్బందికి శిక్షణ ఇచ్చామని, పోటీ చేసే అభ్యర్థులు ఎన్నికల సంఘం నిబంధనల మేరకు నూతన బ్యాంకు ఖాతా,అఫిడవిట్, బలపరిచే వారి వివరాలు, మిగతా పత్రాలు సమర్పించాలన్నారు. ప్రతి మున్సిపల్ కేంద్రంలో హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేశామని, వారి వద్ద పూర్తి సమాచారం అందుబాటులో ఉంటుందన్నారు. జిల్లా యంత్రాగం,మున్సిపల్, పోలీసుల ఆధ్వర్యంలో అన్ని ఏర్పాట్లు చేశామన్నారు. అభ్యర్థులు, ప్రజలకు త్రాగునీరు, తదితర సదుపాయాలు అందుబాటులో ఉండేలా చూడాలన్నారు. ఎన్నికల కమిషన్ జారీ చేసిన మార్గదర్శకాలు,నిబంధనలను కచ్చితంగా అమలు చేయాలని, ఎన్నికల ప్రవర్తనా నియమావళి ఉల్లంఘన జరగకుండా పర్యవేక్షణ జరపాలని అధికారులకు ఆదేశించమన్నారు. నామినేషన్ దరఖాస్తుల స్వీకరణ, పరిశీలన ప్రక్రియలో ఎలాంటి పొరపాట్లు జరగకుండా జాగ్రత్తలు తీసుకుంటామన్నారు. ఆమె వెంట అదనపు ఎస్పీ చంద్రయ్య, వేములవాడ ఆర్డీఓ రాధాభాయ్, తహసీల్దార్ జయంత్ కుమార్,మున్సిపల్ కమిషనర్ సంపత్ కుమార్, పట్టణ సిఐ వీర ప్రసాద్ పాల్గొన్నారు.

# ఆత్మహత్యకు ప్రేరేపించిన కేసులో అరుగురికి 5 ఏళ్ల జైలు

### మెట్పల్లి అసిస్టెంట్ సెషన్స్ జడ్జి తీర్పు... ఒక్కొక్కరికి రూ.2000 జరిమానా

### పోలీసుల కృషికి ఎస్పీ అభినందనలు

**మల్లాపూర్, జనవరి 28 (జనంసాక్షి) :** కుమారుడిని బలవంతంగా దూరం చేసి తీవ్ర మనస్థాపానికి గురిచేసి ఆత్మహత్యకు ప్రేరేపించిన కేసులో ఆరుగురు నిందితులకు మెట్‌పల్లి గౌరవనీయ అసిస్టెంట్ సెషన్స్ జడ్జి డి. నాగేశ్వర్ రావు ఐదేళ్ల సాధారణ కారాగార శిక్ష, ఒక్కొక్కరికి రూ. 2,000 చొప్పున జరిమానా విధిస్తూ మంగళవారం తీర్పు వెలువరించారు.

జగిత్యాల పట్టణానికి చెందిన పెద్దిరాజుకు ముత్యంపేట గ్రామానికి చెందిన సునీతతో 2004లో వివాహమైంది. వీరికి మురారి అనే కుమారుడు ఉన్నాడు. సునీత అనారోగ్యంతో 2011 జూన్ 2న ఉరివేసుకుని మృతి చెందింది. ఆ తర్వాత ఆమె తల్లిదండ్రులు, బంధువులు మురారిని తీసుకెళ్లి పెద్దిరాజుకు ఇవ్వకుండా వేధింపులకు గురిచేశారు. కుమారుడిని చూడనివ్వకపోవడం, దుర్భాషలాడటంతో తీవ్ర మానసిక వేదనకు గురైన పెద్దిరాజు 2011 అక్టోబర్ 4న ముత్యంపేటకు వెళ్లి కుమారుడిని ఇవ్వమని కోరాడు. నిందితులు డబ్బులు డిమాండ్ చేస్తూ కుమారుడిని ఇవ్వకుండా తీవ్రంగా వేధించడంతో అక్కడే యాసిడ్ సేవించి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మెట్పల్లి, జగిత్యాల, కరీంనగర్ ఆసుపత్రుల్లో చికిత్స పొందుతూ 2011 అక్టోబర్ 5న మృతి చెందాడు.

మల్లాపూర్ పోలీసులు కేసు నమోదు చేసి విచారణ అనంతరం నిందితుల వేధింపుల కారణంగానే పెద్దిరాజు ఆత్మహత్యకు పాల్పడ్డాడని నిర్ధారించి వారిని అరెస్ట్ చేశారు. సాక్షులను విచారించిన న్యాయమూర్తి ఆరుగురికి ఐదేళ్ల జైలు శిక్ష, జరిమానా విధించారు. శిక్ష విధించబడిన నిందితులు: సింగసాని స్వామి, లక్ష్మీ, మహేష్, ఐతరవేని భూమయ్య, రామడుగు రవి, బఘ లక్ష్మీ. ఈ కేసులో శిక్ష పడేలా కృషి చేసిన సబ్-ఇన్‌స్పెక్టర్లు శశిధర్ రెడ్డి, సత్యనారాయణ, రాజమౌళి, పి.పి. ఆనంద్, ఎస్సై ఎస్. శ్రీకాంత్, కోర్ట్ కానిస్టేబుల్ వినోద్‌లను జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ ప్రత్యేకంగా అభినందించారు.

# మేడిపల్లిలో ఘోర రోడ్డు ప్రమాదం

- ఇద్దరు ఇంజనీరింగ్ విద్యార్థులు మృతి
- కారు అతి వేగమే ప్రమాదానికి కారణం



**బోడుప్పల్-జనంసాక్షి :** మేడిపల్లి పోలీస్ స్టేషన్ పరిదిలో వరంగల్ హైవేపై బుధవారం తెల్లవారు జామున ఘోర రోడ్డు ప్రమాదం జరిగి ఇద్దరు ఇంజనీరింగ్ విద్యార్థులు మృతి చేందారు.

మేడిపల్లి పోలీసులు,బంధువులు తెలిపిన వివరాల ప్రకారం వనపర్తి జిల్లాకు చెందిన 8 మంది విద్యార్థులు హైదరాబాద్లోని ఓ ప్రయివేట్ కాలేజిలో బీటెక్ చదువుతున్నారు. మౌలాలీలోని స్నేహితుడి ఇంటి వద్ద జరిగిన శుభాకార్యానికి నిఖిల్ (22) కారులో బయలుదేరారు. ఫంక్షన్ పూర్తయ్యాక తిరుగు ప్రయాణంలో పోచారం సద్భవన టౌన్ షిప్‌లో ఉంటున్న స్నేహితులను దింపుటకు వెళ్తుండగా మేడిపల్లిలోని ఉప్పల్ ఎలివేటెడ్ కారిడార్ పిల్లర్ నెంబర్ 97 వద్ద కారు అదుపుతప్పి వేగంగా పిల్లర్ ను ఢీకొంది. ఈ ప్రమాదంలో నిఖిల్ (22), వరుణ్ (23)లు అక్కడికక్కడే మృతి చెందగా, వెంకట్(23), రాకేష్(22)లకు తీవ్ర గాయాలు అయ్యాయి. మరో నలుగురు విద్యార్థులు అభినవ్(22), యశ్వంత్ రెడ్డి(22), సాత్విక్(23), హర్షవర్ధన్(22) లు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. గాయపడ్డ వారు ప్రయివేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నట్లు పోలీసులు తెలిపారు.

# ప్రియుడి కోసం తల్లిదండ్రులను హత మార్చిన కూతురు

- తల్లిదండ్రులను నమ్మించి ఒకరి తర్వాత ఒకరి హత్య
- మత్తుమందు ఇంజక్షన్‌తో ఒకరి తర్వాత ఒకరిని దారుణ హత్య
- జంట హత్య కేసు మిస్టరీ వీడింది
- నిందితురాలు నటనకు పోలీసులే షాక్
- వికారాబాద్ డి.ఎస్.పి శ్రీనివాసరెడ్డి వెల్లడి



**వికారాబాద్ జిల్లా బ్యూరో జనవరి 28 (జనం సాక్షి):** కంటే కూతురిని కనాలి.. రాణిలా పెంచాలి అని ఒక కవి రాసిన భావాన్ని తిరగరాసింది ఒక కూతురు. అల్లారి ముద్దుగా పెంచి గోరుముద్దలు తినిపించిన కన్న వారిని నమ్మించి కడ తేర్చింది. ఒళ్ళు నొప్పులకు సూది మందు ఇస్తానని నమ్మబలికి మత్తుమందు ఇచ్చి దారుణంగా హత్య చేసింది. ఈ సంఘటన వికారాబాద్ జిల్లా బంటారం మండలంలోని యాచారం గ్రామంలో జరిగింది. వికారాబాద్ డిఎస్పి శ్రీనివాస్ రెడ్డి దారూర్ సిఐ రఘురాములు తెలిపిన ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. యాచారం గ్రామంలో ఈనెల 24వ తేదీన జరిగిన జంట హత్యల కేసు మిస్టరీ వీడినట్లు వికారాబాద్ డిఎస్పి శ్రీనివాసరెడ్డి తెలియజేశారు. యాచారం గ్రామానికి చెందిన నక్కలి దశరథ్, నక్కలి లక్ష్మమ్మ ఈనెల 24వ తేదీన అనుమానాస్పద స్థితిలో మృతి చెందినట్లు తెలియ తెలియజేస్తాడు. బాధితుల కొడుకు నక్కలి అశోక్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు బంటారం పోలీసులకు ఫిర్యాదు రాగా ధరూర్ సిఐ రఘు రాములు దర్యాప్తు చేసినట్లు తెలియజేశారు. జంట హత్య కేసులో సంచలన విషయాలు విలుగులోకి ఇచ్చినట్లు వివరించారు. నక్కలి దశరథ్ లక్ష్మమ్మ దంపతులను కన్న కూతురు సురేఖ(25) హత్య చేసినట్లు దర్యాప్తులో తేలిందని అన్నారు. నిందితురాలు సురేఖకు తల్లిదండ్రులు పెండ్లి సంబంధాలు చూస్తూ ఉండగా తాను ఒక వ్యక్తిని ప్రేమించినట్లు తల్లిదండ్రులకు తెలియజేసింది. కులాంతర ప్రేమ వివాహము వద్దని తల్లిదండ్రులు మందలించడంతో వారిని అడ్డు తొలగించుకోవడానికి పథకం ప్రకారం హత్య చేసినట్లు తెలిపారు. ఇంట్లో ఉన్న తల్లి లక్ష్మమ్మకు ఒళ్ళు నొప్పుల సూది మందు ఇస్తానని నమ్మబలికి అధిక మత్తు మందు ఇంజక్షన్ ఇచ్చి హత్య చేసింది. ఆరుబయట చలిమంట కాపుకుంటున్న తండ్రి దశరథుని పిలిచి అమ్మకు ఒళ్ళు నొప్పుల మందు ఇవ్వడంతో నిద్రపోతుందని నీకు మందు ఇస్తే నీవు నిద్ర పోదువు దా అని పిలిచి అదిక డోస్ మత్తుమందు సూది టీకా ఇచ్చి ఒక పథకం ప్రకారం ఒకరి తర్వాత ఒకరిని దారుణంగా హత్య చేసినట్లు తెలియజేశారు. హత్యల దగ్గర రెండు రక్తం చుక్కలు కలిగిన సిరంజీలు దొరకడంతో అనుమానస్పద కేసుగా నమోదు చేసి విచారణ చేపట్టినట్లు తెలియజేశారు. హత్యకు గురైన దంపతుల కూతురు సురేఖ బీఎస్సీ నర్సింగ్ పూర్తి చేసి సంగారెడ్డి లోని ఒక ప్రైవేట్ ఆసుపత్రిలో నర్స్‌గా పని చేస్తుంది. అక్కడ పనిచేస్తుండగా ఇన్స్టాగ్రామ్ లో ఒక వ్యక్తి పరిచయమయ్యాడని వారి పరిచయం ప్రేమకు దారి తీసినట్లు తెలియజేశారు. ఈ విషయమై తల్లిదండ్రులకు తెలియజేయగా ప్రేమికుడి పూర్వాపరాలు తెలుసుకున్న తల్లిదండ్రులు కులాంతర వివాహం చేసుకోవద్దని కూతురును మందలించారు. ఈ విషయమై వారి మధ్య అనేకసార్లు గొడవలు జరిగినట్లు తెలియజేశారు. తల్లిదండ్రులు కులాంతర వివాహం చేసుకోవడానికి అంగీకరించకపోవడంతో ఎలాగైనా పెళ్లి చేసుకోవాలని పథకం ప్రకారం హత్య చేసినట్లు తెలియజేశారు. పనిచేస్తున్న ప్రైవేట్ ఆసుపత్రిలో ఎమర్జెన్సీ రోగులకు ఇచ్చే అట్రాక్యూరియం అనే మత్తు మందు నాలుగు బాటిల్స్‌ను దొంగతనంగా సేకరించినట్లు తెలియజేశారు. ఈనెల 24వ తేదీన వీక్లీ ఆఫ్ తీసుకొని మోమిన్ పేటలో నీ ఒక మెడికల్‌లో మూడు సిరంజులు కొనుగోలు చేసి తీసుకొని ఇంటికి వచ్చినట్లు తెలియజేశారు. రాత్రి భోజనం చేసిన తర్వాత ఇరువురి మధ్య పెండ్లి విషయమై గొడవ జరిగిందని అన్నారు. ఒకరి తర్వాత ఒకరికి ఇంజక్షన్ ఇచ్చి దారుణంగా హత్య చేసినట్లు తెలియజేశారు. ఈ విషయమై నిందితురాలు అన్న అశోక్ సమాచారం ఇచ్చి అమ్మానాన్నలు చనిపోయారని చనిపోయే ముందు అన్నతో మంచిగా ఉండు అన్ని వాడే చూసుకుంటాడని చెప్పి మృతి చెందినట్లు తెలియజేసింది. ఈ విషయమై పోలీసులు సురేఖను తనదైన శైలిలో విచారించడంతో నేరం ఒప్పుకొని ఇంట్లో ఉన్న నాలుగు కాళీ ఇంజక్షన్ బాటిల్లు రెండు వాడిన సిరంజిలను స్వాధీనం చేసుకున్నట్లు తెలియజేశారు. నిందితురాలని అరెస్టు చేసి రిమాండ్ కు తరలించినట్లు వివరించారు.

# మొదటి రోజు 80 నామినేషన్లు

- కరీంనగర్ నగరపాలక సంస్థలో బీజేపీ 32, కాంగ్రెస్ 25, బీఆర్ఎస్ 13 నామినేషన్లు
- కమిషనర్ ప్రఫుల్ దేశాయ్ పర్యవేక్షణ
- పోలీస్ బందోబస్తు మధ్య ప్రశాంతంగా ప్రక్రియ



**కరీంనగర్, జనవరి 28 (జనంసాక్షి) :**

కరీంనగర్ నగరపాలక సంస్థ ఎన్నికల్లో మొదటి రోజు నామినేషన్ల ప్రక్రియ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్ పర్యవేక్షణలో పోలీస్ బందోబస్తు మధ్య ప్రశాంతంగా ముగిసింది. 66 డివిజన్లకు గాను 33 నామినేషన్ కౌంటర్లలో రిటర్నింగ్, అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులు అభ్యర్థుల నామినేషన్లను స్వీకరించి ఎన్నికల సంఘం రూపొందించిన ఆన్‌లైన్ టీ పోల్ వెబ్‌సైట్‌లో వివరాలు ఎప్పటికప్పుడు అప్‌లోడ్ చేశారు. మొదటి రోజు 76 మంది అభ్యర్థుల నుంచి మొత్తం 80 నామినేషన్లు దాఖలయ్యాయి.

పార్టీల వారీగా బీజేపీ 32, కాంగ్రెస్ 25, బీఆర్ఎస్ 13, ఏఐఎంఐఎం 3, ఆప్ 1, బీఎస్పీ 1, టీజీఎస్ఈసీ 1, ఇండిపెండెంట్ 4 నామినేషన్లు దాఖలయ్యాయి. కమిషనర్ ప్రఫుల్ దేశాయ్ స్వయంగా కౌంటర్లను సందర్శించి తనిఖీ చేశారు. కమాండ్ కంట్రోల్ సెంటర్ ద్వారా ప్రక్రియను క్షుణ్ణంగా పర్యవేక్షించారు. ఎన్నికల సంఘం ఆదేశాలు, జిల్లా ఎన్నికల అధికారి సూచనల మేరకు సీసీ కెమెరాల పర్యవేక్షణ, పోలీస్ బందోబస్తు మధ్య నామినేషన్లు స్వీకరించామని కమిషనర్ తెలిపారు. రిటర్నింగ్ అధికారులు ప్రతి నామినేషన్‌ను నియమావళి అనుగుణంగా తనిఖీ చేసి ఆన్‌లైన్‌లో నమోదు చేశారు. నో డ్యూ సర్టిఫికేట్ కోసం కళాభారతిలో ప్రత్యేక కౌంటర్ ఏర్పాటు చేశామని, ఆస్తి పన్ను, నీటి పన్నులు చెల్లించిన రసీదు చూపిస్తే సర్టిఫికేట్ ఇస్తామని చెప్పారు.

అభ్యర్థులు కొత్త బ్యాంక్ ఖాతా తెరిచి నామినేషన్ సెట్‌తో సమర్పించాలని, రూ. 1.50 లక్షలకు మించి ఖర్చు చేయవద్దని సూచించారు. ప్రచార రథాలు, వాహనాలకు పోలీస్ శాఖ నుంచి ఎన్ఓసీ తీసుకుని మున్సిపల్, టౌన్ ప్లానింగ్ విభాగాల్లో అనుమతి పొందాలని తెలిపారు. ర్యాలీలు, సభలు, స్టార్ కంపెయినర్ల ప్రచారానికి కూడా ఇదే విధానం పాటించాలని ఆదేశించారు.

## 23వ వార్డు ప్రజల ఆశీస్సులతో ఎన్నికల బరిలో.. గడ్డలి పరిమళ రవీందర్

### వార్డు సమస్యలు పరిష్కరిస్తానని హామీ

**తాండూరు, జనవరి 28 (జనంసాక్షి) :** తాండూరు మున్సిపాలిటీ 23వ వార్డు ప్రజల ఆశీర్వాదంతో ఎన్నికల బరిలో నిలిచిన గడ్డలి పరిమళ రవీందర్ బుధవారం బీఆర్ఎస్ తరపున కౌన్సిలర్ అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేశారు. మున్సిపల్ కార్యాల కార్యాలయంలో నామినేషన్ సమర్పించిన ఆయన ఈ సందర్భంగా మాట్లాడుతూ వార్డు ప్రజల ఆశీస్సులు తనపై నిండుగా ఉన్నాయని, గెలుపే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని తెలిపారు. 23వ వార్డు జనరల్ రిజర్వేషన్ కావడంతో మరోసారి అవకాశం లభించిందని, వార్డు ప్రజల సమస్యలను ప్రతినిత్యం అందుబాటులో ఉండి పరిష్కరించేందుకు కట్టుబడి ఉంటానని హామీ ఇచ్చారు. ఇప్పటికే వార్డులో అనేక సమస్యలు పరిష్కరించామని గుర్తుచేస్తూ ప్రజలు తనను ఆదరించి ఆశీర్వదించాలని విజ్ఞప్తి చేశారు



# స్థలం 1.. సర్వేలు 2

## అక్రమాలకు అద్దంపడుతున్న రెవెన్యూ నివేదికలు

- ఇద్దరు ఆఫీసర్ల నిర్వాకానికి వక్ఫ్ భూములు కనుమరుగు
- బోడుప్పల్‌లోని సర్వే నెంబర్ 69లో ఎన్నెన్నో సిత్రాలు
- సంబంధం లేనివాటితో చాటుమాటున రిజిస్ట్రేషన్‌కు యత్నం
- భూ బాగోతాలకు ఆజ్యంపోస్తున్న ఓ బిల్డర్, మాజీ ప్రజాప్రతినిధి

### పక్క నెంబర్ వేసి చాటుమాటున..

సర్వే నెంబర్ 69లో గల వక్ఫ్ భూముల్లో 2022లో కొందరు నిర్మాణాలు చేపట్టబోగా పలువురి నుంచి అభ్యంతరాలు వ్యక్తమయ్యాయి. దీంతో అప్పటి రెవెన్యూ సర్వేయర్.. ఆ 36 ప్లాట్లు వక్ఫ్ భూమిలో ఉన్నట్టుగా రిపోర్టు ఇచ్చారు. రెవెన్యూ అధికారులు ఇదే స్థలానికి 2025లో మరో రిపోర్టు రూపొందించారు. సర్వే నెంబర్ 58 పరిధిలో ఈ భూములున్నట్టుగా చూపెడుతూ అక్రమార్కులకు రిజిస్ట్రేషన్ మార్గం సుగమం చేశారు. నిజానికి 58 సర్వే నెంబర్ పరిధిలో నిర్మాణాలన్నీ ఎప్పుడో పూర్తయ్యాయి. కానీ ఈ రెండెకరాల భూమిని 58 సర్వే నెంబర్‌లో ఉన్నట్టు కాగితాపై పెట్టడం గమనార్హం. పక్క సర్వే నెంబర్ మాటున కోట్ల రూపాయల విలువైన భూమిని కాజేసేందుకు పెద్దకుట్రకే తెరలేపినట్టు ఈ రిపోర్టులు ధ్రువీకరిస్తున్నాయి.



'పట్టి పంగనామాలు పెడితే.. గోడ సాటుకుపోయి తుడుసుకున్నట్టు'గా ఉంది భూబకాసురుల రివాజు. ఎన్ని ఫిర్యాదులు వెళ్లినా తమకేం పట్టనట్టుగా విలువైన స్థలాలను చెరిపేసేందుకు సిద్ధమయ్యారు కొందరు..! అందుకు ప్రభుత్వ అధికారులనే తమ గుప్పిటపెట్టుకుని, వారి కనుసన్నల్లో కోట్ల రూపాయల భూములను మరో కంటపడకుండా కొల్లగొట్టేందుకు ఒక్కటయ్యారు. అసలు పత్రాలను తారుమారు చేసేదాకా పరిస్థితి వెళ్లిందంటే.. ఈ మాఫియాలో ఎవరెవరు స్నేహహస్తాలున్నాయోనన్న అనుమానాలు తలెత్తుతున్నాయి. మేడిపల్లి మండలంలోని కొందరు రెవెన్యూ అధికారులు.. ఉన్నతాధికారులనే పక్కదారి పట్టించేరీతిలో అక్రమార్కులతో కుమ్మక్కై అందినకాడికి దండుకోవాలనుకుంటున్నారు. రెండు మూడేళ్ల కాలంలో ఒకే స్థలంలో ఎన్నెన్ని చిత్రవిచిత్రాలకు కేంద్ర బిందువుగా మారిన సదరు అధికారుల బాగోతాలు ఒక్కొక్కటిగా బయటపడుతున్నాయి.

**బోడుప్పల్, జనవరి 28 (జనంసాక్షి) :** నెంబర్ బోడుప్పల్ పరిధిలోని సర్వే 69లో ఓ రెండెకరాల స్థలం వక్ఫ్ బోర్డు రికార్డులో చూపెడుతుండగా.. ఓ బిల్డర్, మరికొందరు కుమ్మక్కై దానిలో లేఅవుట్ చేసి ప్లాట్లుగా మార్చారు. గత మూడు నెలల క్రితం నిర్మాణాలు కూడా షురూ చేశారు. వారికి బోడుప్పల్‌కు చెందిన ఓ మాజీ ప్రజాప్రతినిధి సహకారం కూడా ఉండటంతో ప్రభుత్వ నిబంధనలన్నీ బేఖాతరు చేస్తూ, ఎలాంటి పర్మిషన్లు లేకుండా నిర్మాణాలకు పూనుకున్నారు. సర్వే నెంబర్ 69లో రెండెకరాల భూమి నిషేధిత జాబితాలో ఉండటమూ దీనికో కారణం. అయితే ఈ స్థలం వక్ఫ్ బోర్డుకు చెందినదని ఫిర్యాదులు వెళ్లడంతో సదరు బోర్డునుంచి కొందరు ఎంక్రోచ్ చేస్తున్నట్టు వక్ఫ్ ఉన్నతాధికారులు నిర్ధారించారు. అయినప్పటికీ స్థానిక ప్రభుత్వ అధికారులు తప్పుడు నివేదికలు రూపొందించి ఈ మొత్తం భూ బాగోతానికి కారణమైనట్టుగా తెలుస్తోంది. అక్రమార్కులతో కుమ్మక్కైన ఓ ఇద్దరు అధికారులు ఏకంగా నిషేధిత స్థలాలకు ఎండార్స్ చేయడం పట్ల ఎన్నో అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

**అంతా ఒక్కటై.. కాజేతకు సిద్ధమయ్యారు!**

గతంలో మేడిపల్లి తహశీల్దార్ కార్యాలయంలో పనిచేసిన ఓ సర్వేయర్.. బోడుప్పల్ పరిధిలోని కొన్ని భూములను నిషేధిత జాబితాలో ఉన్నట్టు రిపోర్టు ఇచ్చారు. ప్రస్తుత సర్వేయర్, గతంలో ఇదేచోట పనిచేసి బదిలీపై వెళ్లిన తహశీల్దార్, ప్రస్తుత డిప్యూటీ తహశీల్దార్ మాత్రం ఓ బిల్డర్, మరికొందరితో కుమ్మక్కై నట్టు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. వీరంతా కలిసి సంబంధం లేని సర్వే నెంబర్ల సాకుతో అక్రమార్కులకు రిజిస్ట్రేషన్ చేసేలా అన్ని కార్యకలాపాలూ చక్కబెడుతున్నట్టు గుసగుసలు వస్తున్నాయి. తప్పుడు ధ్రువపత్రాలు సృష్టించి కోట్ల రూపాయల భూమికి ఎసరు పెట్టారు. సంబంధం లేని సర్వే నెంబర్లు, వక్ఫ్ బోర్డు నుంచి పొందని ఎనఓసీ, నిషేధిత జాబితాలో ఉన్నా యథేచ్ఛగా నిర్మాణాలు, సర్వేయర్లు మారగానే మారిపోతున్న రిపోర్టులు.. వంటి పరిణామాలు చూస్తుంటే ఇంకా ఎందెందరి హస్తాలున్నా యోనన్న అనుమానాలు రేకెత్తుతున్నాయి. వక్ఫ్ భూమిలో పాగా వేయాలనుకుంటున్న సదరు బిల్డర్, మరికొందరి దారుణాలను వెంటనే అరికట్టాలని సర్వత్రా డిమాండ్ వ్యక్తమవుతోంది.







## మున్సిపల్ ఎన్నికలలో బిఆర్ఎస్ పార్టీతో సీపీఎం పొత్తు

### భువనగిరి మున్సిపల్ బిఆర్ఎస్ పార్టీ ఎన్నికల ఇంచార్జ్ బండ నరేందర్ రెడ్డి

**భువనగిరి, జనవరి 28(జనం సాక్షి) :** బిఆర్ఎస్ పార్టీ జిల్లా కార్యాలయంలో మున్సిపల్ ఎన్నికల సందర్భంగా బిఆర్ఎస్ పార్టీ తో సీపీఎం పార్టీ పొత్తు పై భువనగిరి మున్సిపల్ బిఆర్ఎస్ పార్టీ ఎన్నికల ఇంచార్జ్ బండ నరేందర్ రెడ్డి ,భువనగిరి మాజీ శాసనసభ్యులు,బిఆర్ఎస్ పార్టీ భువనగిరి నియోజకవర్గ ఇంచార్జ్ పైళ్ల శేఖర్ రెడ్డి ,బిఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షులు కంచర్ల రామకృష్ణ రెడ్డి తో జరిగిన సమావేశం లో భువనగిరి మున్సిపాలిటీ లో సీపీఎం పార్టీ కి 6 వ వార్డు కేటాయించడం జరిగింది. 35 వార్డులలో సీపీఎం పార్టీ నాయకులు బిఆర్ఎస్ పార్టీ అభ్యర్థులకు మద్దతు ఉంటుందని ఈ సందర్భంగా సీపీఎం పట్టణ కార్యదర్శి మాయ కృష్ణ తెలిపారు. ఈ సందర్భంగా 6 వ వార్డు అభ్యర్థిగా సీపీఎం పార్టీ సీనియర్ నాయకులు కొలుపుల వివేక్ ని బిఆర్ఎస్ పార్టీ తాజా మాజీ కౌన్సిలర్ తుమ్మల పాండు బలపరిచారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యురాలు బట్టుపల్లి అనురాధ ,బిఆర్ఎస్ పార్టీ నాయకులు మాజీ జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ జడల అమరేందర్ గౌడ్ ,మాజీ రైతు బంధు సమితి జిల్లా అధ్యక్షులు కొలుపుల అమరేందర్,మాజీ మున్సిపల్ చైర్మన్ ఎనబోయిన ఆంజనేయులు ,వైస్ చైర్మన్ చింతల కిష్టయ్య మరియు తదితరులు పాల్గొన్నారు.

### వెంకటాద్రి నగర్ థీమ్ పార్క్‌లో

## పచ్చదనం వెల్లివిరియాలి

### రూ.2 కోట్లతో నూతన థీమ్ పార్క్ నిర్మాణం

- వాకింగ్ ట్రాక్, ఓపెన్ జిమ్ ఏర్పాటు
- కాలనీ అభివృద్ధికి చిత్తశుద్ధితో కృషి
- పిఎసి చైర్మన్ అరికపూడి



**శేరిలింగంపల్లి, జనవరి 28 (జనంసాక్షి) :** శేరిలింగంపల్లి నియోజక వర్గం చందానగర్ డివిజన్ పరిధి వెంకటాద్రి నగర్ కాలనీలో నూతనంగా ఏర్పాటు చేయనున్న థీమ్ పార్క్ హరితవనంతో విరాజిల్లాలని రాష్ట్ర ప్రజాపద్దుల కమిటీ చైర్మన్ అరికెపూడి గాంధీ పేర్కొన్నారు. ఈ మేరకు వెంకటాద్రి నగర్ కాలనీలో 2 కోట్ల రూపాయల ప్రభుత్వ నిధుల అంచనా వ్యయంతో నూతనంగా నిర్మించ తలపెట్టిన థీమ్ పార్క్ సుందరీకరణ పనులను బుధవారం ఇంజనీరింగ్ విభాగం అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ చందానగర్ డివిజన్ ప్రజల, నాయకుల విజ్ఞప్తి మేరకు వెంకటాద్రి నగర్ కాలనీలో నూతనంగా నిర్మించ తలపెట్టిన థీమ్ పార్క్ అభివృద్ధికి చిత్తశుద్ధితో ముందుకు సాగుతానని, పార్కులో పచ్చదనం వెల్లివిరిసేలా పకడ్బందీ చర్యలు చేపడతానని అభిప్రాయపడ్డారు. థీమ్ పార్క్ ను అన్ని హంగులతో, మౌళిక వసతులతో సుందరరీకరించి ఆహ్లాదకరమైన వాతావరణం ఏర్పాటుకు కృషి చేస్తానని హామీని ఇచ్చారు. పార్క్ అభివృద్ధి పనులు త్వరితగతిన పూర్తిచేసి ప్రజలకు అందుబాటులో కి తీసుకురావాలని, పనులు నాణ్యత ప్రమాణాల తో చేపట్టాలని, ఎక్కడా రాజీ పడకూడదని చైర్మన్ గాంధీ తెలియచేసారు. వాకింగ్ ట్రాక్ నిర్మాణంద్వారా పిల్లలకు, పెద్దలకు ఉదయం సాయంత్రం వాకింగ్ నిర్వహించుకోవడానికి ఎంతో అనువుగా ఉంటుందని, భవిష్యత్తులో ఈ సదవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. వెంకటాద్రి నగర్ లోగల పార్కుల్లో పచ్చని చెట్లు కనిపించాలని దానికి వెంకటాద్రి నగర్ రెసిడెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ కృషి చేయాలని సూచించారు. ఆట వస్తువులు, ఓపెన్ జిమ్ ఏర్పాటుచేస్తామని, వెంకటాద్రి నగర్ కాలనీ అభివృద్ధికి కృషి చేస్తామని అరికెపూడి పునరుద్ఘాటించారు. పొలాద ఘటించారు. ఈ కార్యక్రమంలో జిహెచ్ఎంసి ఇంజనీరింగ్ విభాగం డిఇ శ్రీదేవి, మాజీ కౌన్సిలర్లు రఘుపతిరెడ్డి, రవీందర్ రావు, నాయకులు రఘునాథ్ రెడ్డి, ఎర్రగుడ్ల శ్రీనివాస్ యాదవ్, మణిక్యాల రావు, బంగారాజు, సత్యనారాయణ, నరేందర్ బల్లా మరియు కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

## మున్సిపల్ ఎన్నికల్లో పోటీ కోసం అసిస్టెంట్ ప్లీడర్ పదవికి రాజీనామా




**మొయినాబాద్ జనవరి 28 జనం సాక్షి :** చేవెళ్ల కోర్టులో ప్రభుత్వ అసిస్టెంట్ ప్లీడర్‌గా విధులు నిర్వహిస్తున్న గీతా వనజాక్షి మున్సిపల్ ఎన్నికల్లో పోటీ చేయడానికి తన పదవికి రాజీనామా చేశారు. మున్సిపాలిటీ పరిధిలోని పెద్దమంగారం కేంద్రంగా పనిచేస్తున్న ఆమె, మున్సిపల్ ఎన్నికల్లో కౌన్సిలర్‌గా పోటీ చేయాలనే ఉద్దేశంతో ఈ నిర్ణయం తీసుకున్నారు. ఈ మేరకు ఆమె తన రాజీనామా పత్రాన్ని చేవెళ్ల కోర్టు న్యాయమూర్తికి సమర్పించారు. ఈ సందర్భంగా గీతా వనజాక్షి మాట్లాడుతూ, ప్రభుత్వ అసిస్టెంట్ ప్లీడర్‌గా తనకు అప్పగించిన బాధ్యతలను నిజాయితీగా, సమర్థవంతంగా నిర్వహించానని తెలిపారు. ప్రజలకు న్యాయం చేయాలనే ఆశయంతోనే ఈ పదవికి రాజీనామా చేసి ప్రజాసేవ దిశగా అడుగులు వేస్తున్నానన్నారు. గతంలో పెద్దమంగారం గ్రామ సర్పంచ్‌గా పనిచేసిన అనుభవంతో మళ్లీ ప్రజాసేవ చేయాలనే లక్ష్యంతో మున్సిపల్ ఎన్నికల్లో బరిలోకి దిగుతున్నట్లు తెలిపారు. తాను చేసిన అభివృద్ధి పనులను గుర్తించిన గ్రామ ప్రజల ప్రోత్సాహంతోనే ఈ నిర్ణయం తీసుకున్నానని, వారి ఆదరణతో ఎన్నికల్లో విజయం సాధిస్తాననే ధీమా వ్యక్తం చేశారు.

### మున్సిపల్ ఎన్నికల్లో సాయిపూర్

## హస్తగతం ఖాయం

- ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి ధీమా
- 100 మంది కార్యకర్తలు కాంగ్రెస్‌లో చేరిక
- సంక్షేమ పథకాలకు ఆకర్షితులు



**తాండూరు, జనవరి 28 (జనం సాక్షి):** మున్సిపల్ ఎన్నికల్లో సాయిపూర్ హస్తగతం ఖాయమని ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. బుధవారం తాండూరు మున్సిపల్ పరిధిలోని 9వ వార్డుకు చెందిన పట్లోళ్ళ సాయి రెడ్డి, పట్లోళ్ళ వెంకట్ రెడ్డి, పట్లోళ్ళ రాఘవేందర్ రెడ్డి, పట్లోళ్ళ ప్రశాంత్ రెడ్డితో పాటు దాదాపు 100 మంది వార్డు కార్యకర్తలు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆయన సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. కాంగ్రెస్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పట్టణంలోని సాయిపూర్‌లో కాంగ్రెస్ బలపరిచిన అభ్యర్థుల విజయం ఖాయమని స్పష్టం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో అమలు చేస్తున్న సంక్షేమ పథకాలకు వివిధ పార్టీల నుంచి పలువురు ఆకర్షితులై కాంగ్రెస్‌లో చేరుతున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## డ్రైవర్ నిర్లక్ష్యంతో ట్రాక్టర్ బోల్తా

- మైనర్ బాలిక మృతి.. మరొకరికి తీవ్ర గాయాలు
- మైనర్ బాలికలతో పని చేయించిన బీఆర్ఎస్ నాయకుడు
- డ్రైవర్‌ను తప్పించినట్లు ఆరోపణలు.. చర్యలు తీసుకోవాలని డిమాండ్



**నవాబుపేట జనవరి 28 (జనం సాక్షి) :** డ్రైవర్ నిర్లక్ష్యంతో ట్రాక్టర్ బోల్తా పడి మైనర్ బాలిక మృతి చెందగా, మరొకరికి తీవ్ర గాయాలయిన దారుణ ఘటన ముబారక్‌పూర్ గ్రామంలో బుధవారం చోటుచేసుకుంది. పెద్దేముల్ మండలం చైతన్యనగర్‌కు చెందిన మాదాసు కృష్ణయ్య కుటుంబం బ్రతుకుతెరువు కోసం ముబారక్‌పూర్‌కు వలస వచ్చి అక్కడి యజమాని అంతమ్మోళ్ల దయాకర్ రెడ్డి వద్ద వ్యవసాయ కూలీలుగా పనిచేస్తోంది. ఎప్పటిలాగే బుధవారం ఉదయం గోపి, ఆయన భార్య మౌనిక, కృష్ణయ్య పెద్ద కూతురు అనూష ట్రాక్టర్‌పై పొలానికి వెళ్తుండగా గుబ్బడపత్తేపూర్ సమీపంలో డ్రైవర్ గోపి నిర్లక్ష్యంతో ట్రాక్టర్ బోల్తా పడింది. దీంతో అనూష అక్కడికక్కడే మృతి చెందగా, మౌనికకు తీవ్ర గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న యజమాని దయాకర్ రెడ్డి, గ్రామస్తులు గాయపడిన మౌనికను ఆసుపత్రికి తరలించారు.

మృతి విషయం తెలుసుకున్న పోలీసులు అక్కడికి చేరుకుని పంచనామా నిర్వహించి మృతదేహాన్ని వికారాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి పంపారు. మృతురాలి తల్లి లక్ష్మీ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ పెండ్లిక్ తెలిపారు. సంఘటనకు కారణమైన డ్రైవర్ గోపిని తప్పించి మరొకరిని ఏర్పాటు చేసినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. మైనర్ బాలికలతో వ్యవసాయ పనులు చేయించి ఒకరి మృతికి కారణమైన బీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు దయాకర్ రెడ్డిపై చర్యలు తీసుకుని మృతురాలి కుటుంబానికి న్యాయం చేయాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు.

## చదువు విద్యార్థులకు ఒక ఆయుధం





- సమాజం మార్పు కోసం ఎంతో ఉపయోగకరం
- ఉపాధ్యాయులు విద్యార్థుల పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలి
- భయాన్ని తొలగించి నమ్మకాన్ని కలిగించాలి
- వికారాబాద్ జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్

**వికారాబాద్ జిల్లా బ్యూరో జనవరి 28 (జనం సాక్షి):** చదువు అనేది ఆయుధం లాంటిదని గుర్తించి విద్యార్థులకు విద్యాబోధన చేయాలని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ సూచించారు. బుధవారం దారూర్ మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్న కాంప్లెక్స్ సమావేశానికి కలెక్టర్ ఆకస్మికంగా వెళ్లి సందర్శించారు. కాంప్లెక్స్ సమావేశంలో పాఠశాలల్లో విద్యా బోధనపై ఉపాధ్యాయులను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులను ఉద్దేశించి కలెక్టర్ మాట్లాడుతూ... విద్య ద్వారా మాత్రమే సామాజిక మార్పు వస్తుందన్నారు. ఉపాధ్యాయులు విద్యార్థుల పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకొని జవాబు దారితనంతో పనిచేయాలని కలెక్టర్ సూచించారు. డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్, ఏపీజే అబ్దుల్ కలాం లాంటి మహనీయుల స్ఫూర్తిని విద్యార్థుల్లో కల్పించి విద్య యొక్క ఆవశ్యకత తెలియజేయాలని కలెక్టర్ తెలిపారు. విద్యార్థులు ఆంగ్ల భాష పైన పట్టు సాధించేందుకు సరళంగా అర్థమయ్యే విధంగా విద్యా బోధన చేయాలని కలెక్టర్ తెలిపారు. విద్యార్థుల్లో భయాన్ని తొలగించి గట్టి నమ్మకాన్ని కలిగించే విధంగా ఉపాధ్యాయులు విద్యార్థులను తీర్చిదిద్దే విధంగా కృషి చేయాలని కలెక్టర్ తెలిపారు. విద్యార్థులు చదవడం రాయడమే కాకుండా ఇంగ్లీష్ పదాలను అర్థం చేసుకునే విధంగా తర్ఫీదు ఇవ్వాలని కలెక్టర్ సూచించారు. ప్రధానోపాధ్యాయులు పాఠశాలల్లో కుటుంబ పెద్దగా వ్యవహరిస్తూఉపాధ్యాయులందరినీ సమన్వయంతో నడిపిస్తూ ముందుకు సాగాలని కలెక్టర్ పేర్కొన్నారు. పాఠశాలల్లో పారిశుద్ధ్యంకు ప్రాధాన్యత కల్పిస్తూ విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యం కలిగించకుండా సౌకర్యవంతంగా ఉండేలా తగు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు. పాఠశాలల్లో మౌలిక వసతులతో పాటు ఇంకా మిగిలిపోయిన మరమ్మత్తు పనులు పూర్తి చేసేందు కు చర్యలు తీసుకుందామని కలెక్టర్ తెలిపారు. పాఠశాలలకు వేయించే పెయింటింగ్ దీర్ఘకాలం ఉండే విధంగానాణ్యవంతంగా చేపట్టాలని కలెక్టర్ సూచించారు. జిల్లా కలెక్టర్ తో పాటు జిల్లా విద్యాశాఖ అధికారి రేణుకా దేవి, మండల విద్యాధికారి శ్రీనివాస్ రెడ్డిలు పాల్గొన్నారు.

## రేగులకుంట చెరువు కబ్జా దాష్టీకాన్ని అరికట్టండి : కసిరెడ్డి

**శేరిలింగంపల్లి, జనవరి 28 (జనంసాక్షి) :** శేరిలింగంపల్లి నియోజకవర్గం హాఫీజ్ పేట్ డివిజన్ పరిధి దీప్తిశ్రీనగర్ హాఫీజ్ పేట్ సర్వే నెంబర్ 150 బై నెంబర్ పేరుతో తప్పుడు దృపత్రాలను సృష్టించి సర్వే నెంబర్ 151లోని రేగులకుంట చెరువు భూమిని కబ్జా చేయడం జరిగిందని 'జనంకోసం' స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు కసిరెడ్డి భాస్కర్ రెడ్డి ఆరోపించారు. ఈ మేరకు బుధవారం రంగారెడ్డి జిల్లాకలెక్టర్, హైడ్రా కమీషనర్, జిహెచ్ఎంసి కమీషనర్ తదితరులకు ఫిర్యాదులతోకూడిన వినతి పత్రాలను అందజేశారు. అనంతరం శేర్లింగంపల్లిలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ హాఫీజ్పేట్ డివిజన్ దీప్తిశ్రీనగర్ పరిధి రేగులకుంట చెరువు శిఖంభూమిని తప్పుడు ధ్రువపత్రాల సహకారంతో ప్రైవేట్ స్థలమైన సర్వేనెంబర్ 150 ని చూపిస్తూ రేగులకుంటకు సంబంధించిన చెరువు శిఖం భూమి అయినా సర్వేనెంబర్ 151 లో కొంతమంది దళారులు స్వచ్ఛందంగా కబ్జాకు పాల్పడడం జరిగిందని తక్షణమే సదరు భూమిని విచారణ జరిపి ప్రభుత్వం స్వాధీనం చేసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. ఇందులో భాగంగానే రంగారెడ్డి జిల్లా కలెక్టర్, హైడ్రా కమిషనర్ ఏవి రంగనాథ్, జిహెచ్ఎంసి కమిషనర్ తోపాటు హెచ్ఎండిఏ కమిషనర్, ఇరిగేషన్ శాఖ ఈఈ మరియు రంగారెడ్డి జిల్లా తూర్పు(రాజేంద్రనగర్) ఆర్డీవో కు పూర్తి ఆధారాలతో ఫిర్యాదు చేయడం జరిగిందన్నారు. రాజేంద్రనగర్ ఆర్డీవో కు గతంలో సెప్టెంబర్ 10 2020 లో సాగర్ స్థలానికి సంబంధించి సర్వే నిర్వహించిన ఆధారాలతో కూడిన కాపీని సైతం జతపరచడం జరిగిందని కసిరెడ్డి వివరించారు. తక్షణమే అన్ని విభాగాల అధికారులు స్పందించి నిజాయితీగా విచారణలు జరిపించి వాస్తవాలను నిగ్గు తేల్చడంతోపాటు కోట్లాది రూపాయల విలువ చేసే ప్రభుత్వ భూమిని పరిరక్షించడం, కబ్జారాయుళ్లను కఠినంగా శిక్షించడానికి తగిన కార్యాచరణతో ముందుకు సాగాల్సిన అవసరం ఉందని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో 'జనంకోసం' స్వచ్ఛంద సంస్థ ప్రధానకార్యదర్శి నాగం రాజశేఖర్, ఇతర ప్రతినిధులు పాల్గొన్నారు.



## జాతర ఔన్నత్యాన్ని ప్రపంచానికి చాటి చెప్పాలి

- ఆదివాసుల అస్తిత్వం దెబ్బతినకుండా మార్పులు
- భక్తులకు వసతి కల్పించేలా జాతరకు భారీగా ఏర్పాట్లు
- పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క



**ములుగు, జనవరి 28 (జనంసాక్షి) :** సమక్క సారలమ్మ జాతర ఔన్నత్యాన్ని ప్రపంచానికి చాటి చెప్పాలని రాష్ట్ర గ్రామీణ అభివృద్ధి పంచాయతీరాజ్ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క) అన్నారు. మేదారం సమ్మక్క సారలమ్మ జాతర వద్ద ఏర్పాటు చేసిన మీడియా సెంటర్ లో బుధవారం జాతరను ప్రెస్ కవరేజ్ చేస్తున్న వివిధ మీడియా సంస్థలకు చెందిన జర్నలిస్టులకు, మీడియా ప్రతినిధులకు మంత్రి సీతక్క టీషర్ట్ లను పంపిణీ చేశారు. మంత్రి సీతక్క మాట్లాడుతూ, కోట్లాది మంది భక్తుల కొంగు బంగారంమైన సమక్క సారలమ్మ జాతర కు భక్తుల రాక విపరీతంగా పెరిగిపోయిందని అన్నారు. ములుగు జిల్లాలో నిర్వహించే జాతర లో ప్రస్తుత సంవత్సరం అనేక మార్పులు చేసినప్పటికీ ఎక్కడ కూడా ఆదివాసుల అస్థిత్వం, ఆత్మగౌరవం, పూజ విధానం లో మార్పు లేకుండా ఏర్పాట్లు చేశామని అన్నారు. జాతరకు పెద్ద ఎత్తున వచ్చే భక్తులకు అసౌకర్యం కలగకుండా రోడ్డు విస్తరణ, మెరుగైన పారిశుధ్య చర్యలు, విద్యుత్ దీపాలంకరణ, క్యూ లైన్ సౌకర్యాలు మెరుగయ్యాయని అన్నారు. సమ్మక్క సారలమ్మ జాతర తీసుకొచ్చే విధానం పూజ వ్యవహారాలలో ఎటువంటి మార్పు రాలేదని అన్నారు. 4 రోజులు జరిగే సమక్క సారలమ్మ జాతరకు ప్రస్తుత సంవత్సరం 40 రోజుల సరిపడా ఏర్పాట్లు చేశామని అన్నారు. భక్తులకు అవసరమైన టాయిలెట్స్, త్రాగు నీటి సరఫరా, పారిశుధ్య నిర్వహణకు అదనపు కార్మికులను ముందుగానే జాతర స్థలం వద్ద సిద్ధం చేశామని అన్నారు. సమక్క సారలమ్మ జాతరకు ఇప్పటి వరకు 20 లక్షల భక్తులు వచ్చారని అంచనా వేశామని అన్నారు. మక్క సారలమ్మ జాతర కవర్ చేసే అదృష్టం పాత్రికేయులకు కలిగిందని, జాతర యొక్క ఔన్నత్యం గొప్పతనాన్ని బయట ప్రపంచానికి మీడియా చాటి చెప్పాలని మంత్రి తెలిపారు. రాబోయే సమ్మక్క సారలమ్మ జాతర సమయానికి మీడియా కు సైతం పెద్ద హాల్, మెరుగైన వసతులు కల్పిస్తామని మంత్రి హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సమాచార పౌర సంబంధాల శాఖ అదనపు సంచాలకులు డి. ఎస్. జగన్, ఉప సంచాలకులు వెంకటేశ్వర్లు, వెంకట సురేష్ సంబంధించిన పాత్రికేయులు తదితరులు పాల్గొన్నారు.

## ఆటో డ్రైవర్ల సమస్యలపై ప్రభుత్వాన్ని నిలదీస్తాం

- తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత



**హైదరాబాద్ (జనంసాక్షి) :** ఆటో డ్రైవర్ల సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వాన్ని నిలదీస్తామని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత హామీ ఇచ్చారు. ఆటో యూనియన్ ల నాయకులతో బుధవారం బంజారాహిల్స్ లోని తెలంగాణ జాగృతి కార్యాలయంలో సమావేశం అయ్యారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికలకు ముందు ఆటోడ్రైవర్లకు ఇస్తామన్న రూ. 12 వేలు వెంటనే ఇవ్వాలని కవిత డిమాండ్ చేశారు. హైదరాబాద్ లో ఇతర జిల్లాల ఆటో డ్రైవర్లకు ఇబ్బంది కలిగించటంపై ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సమస్యపై అన్ని ఆటో సంఘాలతో కలిసి పోరాటం చేస్తామని చెప్పారు. అవసరమైతే కార్మిక శాఖ మంత్రి ని కలుస్తామన్నారు. చట్టబద్ధమైన అనుమతులు ఉన్నప్పటికీ జిల్లాల నుంచి వచ్చే ఆటో డ్రైవర్లను అడ్డుకోవటం సరికాదన్నారు. కార్మికుల భద్రతతో పాటు వారి ఉపాధి హక్కులను కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వం పైనే ఉందన్నారు. హైదరాబాద్ నగరంలో జిల్లాల నుంచి వచ్చే ఆటో డ్రైవర్లపై జరుగుతున్న దాడులు, వేధింపులు తక్షణమే అరికట్టాలని ఆమె డిమాండ్ చేశారు. ఈ సమస్యపై సంబంధిత పోలీస్, రవాణా శాఖ అధికారులతో మాట్లాడి జిల్లాల ఆటో డ్రైవర్లకు పూర్తి రక్షణ కల్పించేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. తెలంగాణ ఉద్యమ స్ఫూర్తితో కార్మికుల పక్షాన తెలంగాణ జాగృతి ఎప్పుడూ నిలుస్తుందని భరోసా ఇచ్చారు. సమావేశంలో తెలంగాణ జాగృతి వర్కింగ్ ప్రెసిడెంట్ ఎల్. రూప్ సింగ్, ఆటో జాగృతి అధ్యక్షుడు ఎంఏ సలీమ్, ఏఐటీయూసీ జనరల్ సెక్రెటరీ వెంకటేష్, ఐ ఎన్ టీయూసీ జనరల్ సెక్రెటరీ మల్లేశం గౌడ్, టీ ఏడీఎస్ ప్రెసిడెంట్ సత్తిరెడ్డి, టీ ఎన్ టీయూసీ స్టేట్ ప్రెసిడెంట్ యాదగిరి, జీ యూ టీఎస్ అధ్యక్షులు శ్రీనివాస్, బీ ఆర్టీయూ అధ్యక్షుడు పరశురాముడు, తెలంగాణ జాగృతి నాయకులు, ఆటో డ్రైవర్లు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## తక్కువ సమయంలో దర్శనం

- క్యూ లైన్ ఇబ్బందులు లేవు
- జాతర ఏర్పాట్లు అభినందనీయం: భక్తుల హర్షం

**ములుగు, జనవరి28 (జనంసాక్షి) :** శ్రీ సమ్మక్క-సారలమ్మ మేడారం మహాజాతర సందర్భంగా ప్రభుత్వం, జిల్లా యంత్రాంగం చేపట్టిన ఏర్పాట్లపై భక్తులు సంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఈసారి మేడారంలో తక్కువ సమయంలో దర్శనం జరుగుతోందని, భారీ రద్దీ ఉన్నప్పటికీ ఎక్కడా తొక్కిసలాటలు జరగకుండా, క్యూ లైన్లో ఇబ్బందులు లేకుండా దర్శనం సాఫీగా సాగుతోందని భక్తులు పేర్కొంటున్నారు. క్రమపద్ధతిలో ఏర్పాటు చేసిన క్యూ లైన్లు, పోలీసులు, వాలంటీర్ల నిరంతరం మార్గనిర్దేశర చేయడంతో దర్శనానికి ఎక్కువ సమయం పట్టడం లేదని తెలిపారు. గత జాతరలతో పోలిస్తే ఈసారి ఏర్పాట్లు మరింత మెరుగ్గా ఉన్నాయని, స్వల్ప వ్యవధిలోనే దర్శనం పూర్తవుతోందని భక్తులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. అలాగే, మేడారం చేరే రహదారులు వెడల్పుగా, సౌకర్యంగా ఉండటంతో వాహనాల రాకపోకలు సులభంగా సాగుతున్నాయని, ట్రాఫిక్ సమస్యలు చాలా వరకు తగ్గాయని భక్తులు తెలిపారు. పార్కింగ్ ప్రాంతాల నుంచి గద్దెల వరకు స్పష్టమైన దారి సూచనలు ఏర్పాటు చేయడంతో దారి తప్పే పరిస్థితి లేకుండా ఉందని పేర్కొన్నారు. భారీగా భక్తులు తరలివస్తున్నప్పటికీ వైద్య సేవలు, తాగునీటి సౌకర్యాలు, పరిశుభ్రత, భద్రతా చర్యలు అన్నీ సమర్థవంతంగా అమలవుతున్నాయని భక్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. అత్యవసర పరిస్థితుల్లో వెంటనే స్పందించేలా వైద్య సిబ్బంది, అంబులెన్సులు అందుబాటులో ఉండటం భక్తులకు భరోసానిస్తోందని తెలిపారు. మొత్తంగా, భక్తుల సౌకర్యాన్ని ప్రధానంగా తీసుకుని ప్రభుత్వం, జిల్లా యంత్రాంగం చేపట్టిన ఏర్పాట్లు ప్రశంసనీయమని, అధికారుల సమన్వయంతో ఈసారి మేడారం జాతర ప్రశాంతంగా, భక్తిశ్రద్ధలతో సాగుతోందని భక్తులు హర్షం వ్యక్తం చేశారు.

## బస్సులో నుంచి తల బయటకు పెట్టిన విద్యార్థి

- టోల్ ప్లాజా పిల్లర్‌కు గుద్దుకుని మృతి

**కోనసీమ, జనవరి28 (జనంసాక్షి) :** జిల్లాలోని ముమ్మిడివరం మండలం అన్నంపల్లి టోల్ ప్లాజా వద్ద జరిగిన ప్రమాదంలో ఓ విద్యార్థి మరణించాడు. మృతుడిని అన్నంపల్లి పంచాయతీ పరిధిలోని లక్ష్మిదేవిలంక గ్రామానికి చెందిన సోంపల్లి వెంకట రవీంద్ర(16)గా గుర్తించారు. రవీంద్ర అమలాపురంలోని నారాయణ కాలేజీలో ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. బుధవారం ఉదయం ఆర్టీసీ బస్సు ఎక్కి కళాశాలకు వెళ్లేందుకు బయలుదేరాడు. బస్ ఎక్కిన కొద్దిసేపటికే టోల్ ప్లాజా వద్ద బస్‌లో నుంచి తల బయటకు పెట్టగా, టోల్‌గేట్ వద్ద ప్రమాదానికి గురై తీవ్రంగా గాయపడ్డాడు. దీంతో ఆ విద్యార్థి అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ దుర్ఘటనతో స్థానికంగా విషాద వాతావరణం నెలకొంది. విషయం తెలిసిన వెంటనే పోలీసులు అక్కడకు చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఈ ప్రమాదంతో బస్సులోని ప్రయాణికులు, స్థానికులు షాక్‌కు గురయ్యారు. విద్యార్థి మృతి విషయాన్ని తల్లిదండ్రులకు తెలియజేశారు. దీంతో వారు ఘటనా స్థలానికి చేరుకుని కన్నీరుమున్నీరుగా విలపించారు. కాలేజ్‌కు వెళ్లేందుకు బయలుదేరిన తమ కుమారుడు కాసేపటికే ఇలా విగతజీవిగా మారడంతో తల్లిదండ్రులు శోకసంద్రంలో మునిగిపోయారు.

# బోధనలో నాణ్యత పెరగాలి


- ప్రతి విద్యాసంస్థలో మెరుగైన బోధన
- విద్యాశాఖపై ఉన్నతాధికారులతో సీఎస్ సమీక్ష



**హైదరాబాద్, జనవరి28 (జనంసాక్షి) :** ప్రభుత్వ పాఠశాలలు, విద్యా సంస్థలలో బోధనలో నాణ్యత ప్రమాణాలు మరింతగా పెంచాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణారావు అధికారులను ఆదేశించారు. ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలు, విశ్వ విద్యాలయాల స్థాయి వరకు ప్రతి విద్యా సంస్థలోను మెరుగైన బోధన సాగాలని, విద్యా బోధనలలో నాణ్యత ప్రమాణాలు పెంచే దిశగా కార్యాచరణ రూపొందించుకోవాలని సి.ఎస్ ఆదేశించారు. గౌరవ ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు విద్యాశాఖపై సంబంధిత ఉన్నతాధికారులతో బుధవారం డా.బి.ఆర్. అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో సమీక్షా సమావేశం నిర్వహించారు. సమావేశంలో పాఠశాల విద్య, ఉన్నత విద్య, డిజిటల్ విద్య, ఇంటర్మీడియట్, డిగ్రీ కాలేజీల్లో పనితీరు, యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూళ్ల నిర్మాణం, తదితర అంశాలపై సమీక్ష చేశారు. ఉన్నత విద్యా సంస్థలు, కళాశాలలో, విశ్వవిద్యాలయాలలో బోధన చేసి రిటైర్డ్ అయిన మంచి అనుభవం కలిగిన ప్రొఫెసర్స్, లెక్చరర్స్, టీచర్స్ తో విద్యార్థులకు తరుచుగా ముఖాముఖి కార్యక్రమాలు నిర్వహించి విద్యార్థులకు బోధన చేయిస్తే విద్యార్థులలో సృజనాత్మకత, మోటీవేషన్, మంచి ఆలోచనలు పెరిగే అవకాశం ఉంటుందని అన్నారు. తద్వారా విద్యార్థుల భవిష్యత్ కు సంబంధించి ప్రణాళికలు ఏర్పరచుకొనే అవకాశం ఉంటుందని అన్నారు. అదే విధంగా కేజిబివి, వివిధ సంక్షేమ వసతి గృహాలలో ఒక వసతి గృహాన్ని ఎంపిక చేసుకొని అందులో సోలార్ మోడల్ తరహా కిచెన్, స్టోరేజ్ రూమ్స్, మౌలిక వసతులు, తాగునీరు, టాయిలెట్స్, విద్యుత్, ఇంటర్నెట్ అన్ని సదుపాయాలు ఏర్పాటు చేసి దానిని ఒక మోడల్ హాస్టల్ గా రూపొందిం చాలని సి.ఎస్ అధికారులకు సూచించారు. దానిని ఆదర్శంగా తీసుకోని భవిష్యత్ లో మిగితా వసతి గృహాలలో కూడా ఏర్పాటు చేసుకోవచ్చని తెలిపారు. కళాశాలల స్థాయిలో కెరీర్ గైడెన్స్ తరగతులు నిర్వహించాలని, ఐటీ కోర్స్ పూర్తి చేసిన విద్యార్థులతో ఇంటర్న్‌షిప్ కార్యక్రమం క్రింద ప్రభుత్వ పాఠశాలలో బోధన చేయించాలని, విద్యార్థులలో ఆసక్తి, నైపుణ్యాలు పెంచే విధంగా అనుభవం కలిగిన రిటైర్డ్ ఉపాధ్యాయులు, మార్గదర్శకులతో తరగతులు నిర్వహిస్తే విద్యార్థులకు మంచి ప్రయోజనం కలుగుతుందని అన్నారు. సమావేశంలో విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి యోగితా రాణా, ఉన్నత విద్యా శాఖ కమిషనర్ శ్రీదేవసేన, ఇంటర్మీడియట్ బోర్డు కార్యదర్శి కృష్ణ ఆదిత్య, ఐటి ప్రత్యేక కార్యదర్శి భవేష్ మిశ్రా , పాఠశాల విద్యా సంచాలకులు నవీన్ నికోలస్ తదితరులు పాల్గొన్నారు.

## జంపన్న వాగుగా మారిన సంపెంగ వాగు

- నదిలో స్నానం ఆచరించడం ఆనవాయితీ



**ములుగు, జనవరి 28 (జనంసాక్షి) :** జంపన్న వాగుకు కేవలం ఆధ్యాత్మిక ప్రాధాన్యత మాత్రమే కాదు, అద్భుతమైన వీరగాథ కూడా ఉంది. ఒకప్పుడు దీనిని సంపెంగ వాగు అని పిలిచేవారు. 13వ శతాబ్దంలో కాకతీయ చక్రవర్తి ప్రతాపరుద్రుడి కాలంలో, గిరిజనులు కరువు కారణంగా కప్పం కట్టలేకపోవడంతో కాకతీయ సైన్యం మేడారంపై దాడి చేసింది. ఆ భీకర యుద్ధంలో సమ్మక్క భర్త పగిడిద్ద రాజు, కుమార్తె సారలమ్మ, అల్లుడు గోవిందరాజులు వీరమరణం పొందారు. తల్లి సమ్మక్కతో కలిసి యుద్ధం చేసిన కుమారుడు జంపన్న తీవ్రంగా గాయపడ్డాడు. శత్రువుల చేతిలో చిక్కడం ఇష్టం లేక, ఆయన ఈ సంపెంగ వాగులోకి దూకి ఆత్మార్పణం చేసుకున్నాడు. జంపన్న చిందించిన రక్తధారల వల్లే వాగు నీరు ఎరుపు రంగులో ఉంటుందని భక్తుల ప్రగాఢ నమ్మకం. నాటి నుంచి జంపన్న వీరత్వానికి గుర్తుగా ఈ వాగుకు 'జంపన్న వాగు' అనే పేరు స్థిరపడిపోయింది. ప్రస్తుతం జంపన్న వాగు భక్తుల రాకతో సందడిగా ఉంది. సుదూర ప్రాంతాల నుంచి వచ్చే భక్తులు ఇక్కడే బస చేస్తూ, వాగు జలాలను పవిత్రంగా భావించి నెత్తిన చల్లుకుంటున్నారు. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం , అధికారులు జంపన్న వాగు వద్ద గట్టి భద్రతా ఏర్పాట్లు చేశారు. స్నాన ఘట్టాల వద్ద ప్రమాదాలు జరగకుండా నిరంతరం పర్యవేక్షిస్తున్నారు. సారలమ్మ, పగిడిద్ద రాజు, గోవిందరాజులు గద్దెలపైకి చేరుకునే సమయం కావడంతో భక్తుల రద్దీ మరింత పెరిగే అవకాశం ఉంది. ఈ వాగులో స్నానం చేస్తే తమ బాధలన్నీ తొలగిపోయి, అమ్మవార్ల ఆశీస్సులు లభిస్తాయని భక్తులు నమ్ముతారు.

## సరికొత్త ఆధార్ యాప్ లాంచ్

- సరళంగా,సురక్షితంగా ఉండేలా చర్యలు

**న్యూఢిల్లీ, జనవరి28 (జనంసాక్షి) :** కేంద్ర ప్రభుత్వం సరికొత్త ఆధార్ యాప్‌ను లాంచ్ చేసింది. దేశ డిజిటల్ ప్రజా మౌలిక సదుపాయాలను బలోపేతం చేసే లక్ష్యంతో దీనిని తీసుకొచ్చింది. ఈ కొత్త యాప్‌తో ఆధార్ సర్వీసులు మరింత సరళంగా, సురక్షితంగా, యూజర్ ఫ్రెండ్లీగా మారనున్నాయి. బుధవారం దిల్లీలో డాక్టర్.అంబేద్కర్ ఇంటర్నేషనల్ సెంటర్‌లో జరిగిన కార్యక్రమంలో కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్ ఈ యాప్‌ను జాతికి అంకితం చేశారు. 2009లో ఇదే రోజున అంటే జనవరి 28న ఆధార్‌ను లాంచ్ చేశారు. ఈ యాప్ ద్వారా వెంటనే ఆధార్ వెరిఫికేషన్ చేసుకోవచ్చు. చిరునామా, మొబైల్‌నంబర్‌ను అప్‌డేట్ చేసుకునే సౌలభ్యం ఉంది. ఆధార్ కాంటాక్ట్ కార్డ్ ద్వారా అత్యంత గోప్యంగా కాంటాక్ట్ వివరాలను పంచుకోవచ్చు. ఎవరికైనా షేర్ చేసినప్పుడు మొత్తం వివరాలు కాకుండా అవసరమైనవి మాత్రమే కనిపించేలా ఏర్పాటు చేసుకోవచ్చు. ఎలాంటి సంక్లిష్టత లేకుండా యూజర్లకు అందుబాటులోకి సేవలు ఈ యాప్ ద్వారా ఐదుగురి వరకు ప్రొఫైల్ వివరాలు క్రియేట్ చేసుకోవచ్చు.

## నేడు మేడారానికి కేంద్ర గిరిజన శాఖ మంత్రి జుయల్ ఓరం

- రాష్ట్ర గిరిజన శాఖ మంత్రి అడ్లూరి విజ్ఞప్తి మేరకు రాక

**హైదరాబాద్, జనవరి28 (జనంసాక్షి) :** ఆసియాలోనే అతిపెద్ద గిరిజన జాతరగా ప్రసిద్ధి గాంచిన సమ్మక్క సారలక్క జాతరకు గురువారం కేంద్ర గిరిజన వ్యవహారాల శాఖ మంత్రి జుయల్ ఓరం పాల్గొని పూజలు నిర్వహించనున్నారు. ఇటీవల హైదరాబాద్ లోని కన్హా శాంతి వనంలో జరిగిన గిరిజన గ్రామీణ వైద్య సహకారుల సదస్సులో గిరిజన సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ కేంద్ర మంత్రిని కలిసి సమ్మక్క సారలక్క జాతర ఆహ్వాన పత్రికను రాష్ట్ర ప్రభుత్వం తరపున అందించారు.

## సంజయ్ గాంధీ నుంచి అజిత్ పవార్ వరకు

- అనేకులు విమాన, హెలికాప్టర్ ప్రమాదాల్లో మృతి

**న్యూఢిల్లీ, జనవరి28 (జనంసాక్షి) :** అనేకమంది రాజకీయ ప్రముఖులు వివిధ సందర్భాల్లో విమాన లేదా హెలికాప్టర్ ప్రమాదాల్లో దుర్మరణం చెందారు. సంజయ్ గాంధీ నుంచి అజిత్ పవార్ వరకు అనేకులు దుర్మరణం చెందారు. మహారాష్ట్ర ఉప ముఖ్యమంత్రి అజిత్ పవార్ బుధవారం ఉదయం బారామతిలో జరిగిన విమాన ప్రమాదంలో మరణించారు. ఉదయం 8:45 గంటల ప్రాంతంలో పవార్, అతని బృందం ప్రయాణిస్తున్న విమానం బారామతిలో అత్యవసరంగా ల్యాండ్ కావడానికి ప్రయత్నించినప్పుడు ఈ ప్రమాదం జరిగింది. ఇంతకు ముందు కూడా పలువురు రాజకీయ నాయకులు విమాన, హెలికాప్టర్ ప్రమాదాల్లో ప్రాణాలు కోల్పోయారు. గతేడాది అహ్మదాబాద్ నుంచి లండన్ బయలుదేరిన ఎయిరిండియా విమానం కూలిపోయిన ఘటనలో మరణించిన వారిలో గుజరాత్ మాజీ ముఖ్యమంత్రి విజయ్ రూపానీ కూడా ఉన్నారు. 68 ఏళ్ల రూపానీ యూకేలోని తన కుటుంబాన్ని కలవడం కోసం ఆ విమానం ఎక్కారు. అరుణాచల్ ప్రదేశ్ ముఖ్యమంత్రి దోర్జీ ఖండు ఏప్రిల్ 30, 2011న హెలికాప్టర్ కూలిపోవడంతో మరణించారు. చైనా సరిహద్దుకు సమీపంలోని మారుమూల ప్రాంతంలో ఈ ప్రమాదం జరిగింది. ఐదు రోజుల తర్వాత శిథిలాలను గుర్తించారు. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర రెడ్డి సెప్టెంబర్ 2, 2009న నల్లమల కొండలలో హెలికాప్టర్ ప్రమాదంలో మరణించారు. విస్తృతంగా గాలించడంతో ఒకరోజు తర్వాత ఆయన మృతదేహం లభ్యమైంది. పారిశ్రామికవేత్త, హర్యానా విద్యుత్ మంత్రి ఓపీ జిందాల్, మాజీ రాష్ట్రపతి శంకర్ దయాళ్ శర్మ కుమారుడు, మాజీ కేంద్ర మంత్రి సురేందర్ సింగ్ మార్చి 31, 2005న ఉత్తరప్రదేశ్‌లోని సహరాన్‌పూర్‌లో జరిగిన హెలికాప్టర్ ప్రమాదంలో మరణించారు. మేఘాలయ గ్రామీణాభివృద్ధి మంత్రి సిప్రియన్ సంగ్మా 2004లో జరిగిన హెలికాప్టర్ ప్రమాదంలో మరణించారు. 2004, సెప్టెంబర్ 22న గౌహతి నుంచి షిల్లాంగ్ వెళ్తున్న హెలికాప్టర్ బారపాణి సరస్సు సమీపంలో కూలిపోయింది. ఈ ప్రమాదంలో సంగ్మాతో పాటు మరో తొమ్మిది మంది మరణించారు. లోక్‌సభ స్పీకర్, టీడీపీ నాయకుడు జీఎంసీ బాలయోగి మార్చి 3, 2002న ఆంధ్రప్రదేశ్‌లోని పశ్చిమ గోదావరి జిల్లాలో హెలికాప్టర్ కూలిపోవడంతో మరణించారు. యాంత్రిక లోపం కారణంగానే ఈ ప్రమాదం సంభవించిందని అధికారులు తేల్చారు. గ్వాలియర్ రాజ కుటుంబ సభ్యుడు, ప్రముఖ జాతీయ నాయకుడు మాధవరావు సింధియా సెప్టెంబర్ 30, 2001న ఉత్తరప్రదేశ్‌లోని మెయిన్‌పురి జిల్లాలో తన చార్టర్డ్ విమానం కూలిపోవడంతో మరణించారు. కాన్పూర్‌లో ఒక ర్యాలీలో ప్రసంగించడానికి ఆయన వెళుతుండగా ఈ ప్రమాదం జరిగింది. ఇందిరా గాంధీ కుమారుడు, జాతీయ రాజకీయాల్లో కీలక నాయకుడిగా చెలామణి అయిన సంజయ్ గాంధీ జూన్ 23, 1980న తాను నడుపుతున్న రెండు సీట్ల విమానం కూలిపోవడంతో మరణించారు.

# చరిత్రలో నిలిచేలా మేడారంలో శాశ్వత వసతులు

- రూ.251 కోట్లతో మహాజాతర అభివృద్ధి పనులు
- రద్దీని తట్టుకునే క్యూ లైన్లు, శాశ్వత గద్దెలు, ఆధునిక వసతులు
- ప్లాస్టిక్ రహితంగా గద్దెల పరిసరాలు



**హైదరాబాద్, జనవరి 28 (జనంసాక్షి) :** ఆసియా ఖండంలోనే అతిపెద్ద ఆదివాసీ జాతరగా గుర్తింపు పొందిన శ్రీ సమ్మక్క-సారలమ్మ మేడారం మహాజాతర-2026ను చరిత్రలో నిలిచిపోయేలా నిర్వహించేందుకు తెలంగాణ ప్రభుత్వం విస్తృత స్థాయిలో శాశ్వత అభివృద్ధి పనులు చేపట్టింది. మొత్తం రూ.251 కోట్ల వ్యయంతో చేపట్టిన ఈ పనులు పూర్తి అయ్యి భక్తుల మన్ననలు పొందుతున్నాయ్. భక్తుల సర్వత్ర ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ప్రతి రెండు సంవత్సరాలకు మాఘ పౌర్ణమి సందర్భంగా జరిగే ఈ జాతరకు 'తెలంగాణ కుంభమేళా'గా విశేష ఖ్యాతి ఉంది. లక్షలాది కాదు? కోట్లాది మంది భక్తులు తరలివచ్చే ఈ మహాజాతర ఈసారి పునర్నిర్మాణ పనుల వల్ల మరింత ప్రాధాన్యం సంతరించుకుంది. గతంలో ప్రతి జాతర సందర్భంగా తాత్కాలిక వసతులతో సరిపెట్టిన పరిస్థితికి భిన్నంగా, ఈసారి వందల ఏళ్లపాటు నిలిచేలా పూర్తి రాతి కట్టడాలతో గద్దెల చుట్టు పునర్నిర్మాణం చేపట్టారు. ఆదివాసీ పెద్దలు, పూజారుల సంఘం సంపూర్ణ ఆమోదంతోనే ప్రభుత్వం ఈ పనులకు శ్రీకారం చుట్టింది.గద్దెల విస్తరణకు మాత్రమే రూ.101 కోట్లు. సుమారు 4,000 టన్నుల గ్రానైట్‌తో గద్దెల ప్రాంగణాన్ని చారిత్రక కట్టడాల మాదిరిగా నిర్మించారు. 46 స్తంభాలతో 271 చదరపు మీటర్ల విస్తీర్ణంలో ప్రాకారం, 8 స్తంభాలతో వృత్తాకార గద్దె, 50 అడుగుల వెడల్పుతో ప్రధాన స్వాగత తోరణం ప్రధాన ఆకర్షణగా నిలుస్తున్నాయి. మేదారం గద్దెల చుట్టూ నిర్మిస్తున్న 32 గ్రానైట్ పిల్లర్లపై ఆదివాసీ సంస్కృతి, ఆచారాలు, జీవనశైలి, కోయ వంశ చరిత్రను శిల్పాల రూపంలో చెక్కించారు. 30 ఏళ్ల నాటి కోయల తాళపత్ర గ్రంథాల ఆధారంగా రూపొందించిన ఈ శిల్పాలు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నాయి. సమ్మక్క, సారలమ్మ, పగిడిద్దరాజు, గోవిందరాజు, జంపన్నతో పాటు ప్రకృతిలో మమేకమై జీవించే ఆదివాసుల జీవన వైవిధ్యాన్ని ప్రతిభింబించే పులి, జింక, ఏనుగు, నెమలి వంటి వన్యప్రాణుల ప్రతిరూపాలు చెక్కించారు. సుమారు 750 కోయ ఇంటి పేర్లు, 7,000కు పైగా శిల్పాలు గిరిజన చరిత్రను భావితరాలకు తెలియజేసేలా రూపొందించారు. భక్తుల రద్దీని దృష్టిలో పెట్టుకొని 60 అడుగుల నుంచి నాలుగు లైన్ల రోడ్ల విస్తరణ, శాస్త్రీయ క్యూ లైన్లు, వాచ్ టవర్లు, సత్రాలు ఏర్పాటు చేశారు.

పార్కింగ్ సమస్య తలెత్తకుండా 42 ప్రదేశాల్లో 1,418 ఎకరాల విస్తీర్ణంలో వాహనాల పార్కింగ్ ఏర్పాట్లు చేస్తున్నారు. జనారణ్యమైన ములుగు అటవీ ప్రాంతం మేడారం ఊ చేరే అన్ని రహదారులు వాహనాల రాకపోకలు, భక్తుల గుడారలతో ములుగు అటవీ ప్రాంతం. ముఖ్యం గా తాడ్వాయి మదలం గత నెల రోజుల నుండి రద్దీగా గా మారింది. జాతర ముఖ్య గట్టలు ప్రారంబమైనందున మేడారం జనారణ్యమైంది. గత జాతరకు సుమారు రెండు కోట్ల మంది భక్తులు హాజరవ్వగా, ఈసారి మూడు కోట్ల మంది వస్తారని అంచనా. గత నెల రోజుల నుండి దాదాపు 1 కోటి పైన భక్తులు సమ్మక్క సారలమ్మ అమ్మ వార్లను దర్శించుకున్నారు. ఈ నేపథ్యంలో జాతర నిర్వహణ పగడ్బందీగా ఏర్పాట్లు చేశారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కల్గకుండా జిల్లా యంత్రాంగం కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేసింది.

మొత్తం 21 శాఖల సమన్వయంతో 42,027 మంది అధికారులు, సిబ్బందిని విధులు నిర్వహిస్తున్నారు. జాతర ప్రాంతాన్ని 8 జోన్లు, 42 సెక్టార్లుగా విభజించి ప్రత్యేక అధికారులను నియమించారు. అన్నీ సెక్టార్ లకు వాకీ టాకీ లను ఏర్పాటు చేసి సెక్టార్ వారీగా ఏ ఇబ్బంది లేకుండా అధికారులు సమన్వయం తో పని చేస్తున్నారు. వైద్య సేవల కోసం 108 అంబులెన్సులు, బైక్ అంబులెన్సులు, వైద్య శిబిరాలు ఏర్పాటు చేశారు. కళ్యాణ మండపం లో ఏర్పాటు చేసిన ఆసుపత్రి ద్వారా ఎప్పటికప్పుడు వైద్య సేవలు అందిస్తున్నారు.

Printed, Published and Owned by M.M.RAHMAN Printed at M/s. Manair Enterprises, Plot No. 16E/4, IDA, Kattedan, Ranga Reddy Dist, Telangana - 500077, Published at #119&120, 1st Floor, Down Town Mall, Lakdikapul, Hyderabad, Telangana-500004. Editor : M.M.RAHMAN RNINo. APTEL/2013/50370